ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

: fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-7-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 153 పేజీలు: 10+4 వెల: 6.50

**కొవిడ్ టీకాపై ఆందోళన వద్దు: ఎయిమ్స్** 5లో

**హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం: నెతన్యాహు**


# 'బనకచర్ల'తో నష్టం లేదు..

## ఆంధ్ర, తెలంగాణ 200 టిఎంసిల నీరు వాడుకోవచ్చు

### తెలంగాణ ప్రాజెక్టులకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు

### కమీషన్లు కొట్టినవాళ్లు రైతుల గురించి మాట్లాడడమా?

### పేదరిక నిర్మూలనకే పి-4: సిఎం చంద్రబాబు



గురువారం కుప్పంలో మీడియాతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**కుప్పం, జులై 3 ప్రభాతవార్త :** రెండువేల టిఎంసిల నీళ్లు సముద్రం పాలవుతున్నపుడు కేవలం రెండువందల టిఎంసిల నీటిని వాడుకునేందుకు గాను బనకచర్ల ప్రాజెక్టుతో ఎవరికీ ఎలాంటి నష్టం లేదని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. గురువారం కుప్పం నియోజకవర్గం శివపురంలోని తన స్వగృహంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్లపై ఎవరెవరో ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలు 200టిఎంసిల వంతున నీటిని వాడుకోవచ్చన్నారు. సమైకా ్యంధ్రలో తన హయాంలోనే దేవాదుల లిఫ్ట్ఇరిగేషన్ ప్రాజెక్టు పెట్టామన్నారు. పుష్కర, తాడిపూడి ప్రాజెక్టులు తెచ్చామన్నారు. వైఎస్ సిఎంగా ఉన్నపుడు ఎల్లంపల్లి ప్రాజెక్టు అన్నారని అయితే రాలేదన్నారు. తాను ఏనాడూ తెలంగాణా ప్రాజెక్టులకు అడ్డు చెప్పలేదని చెప్పేది కూడా లేదని సిఎం పేర్కొన్నారు.

**మామిడి రైతులగురించి కేంద్రంతో మాట్లాడా :** కమీషన్లు కొట్టేసిన వారు నేడు రైతుల గురించి మాట్లాడుతున్నారని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈసారి మామిడి దిగుబడి అధికంగా వచ్చిందని అలాగే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు లేవన్నారు. మామిడి రైతులకు రాయితీ కింద 250కోట్లు ఇస్తున్నామన్నారు. మామిడి రైతుల విషయంగా కేంద్ర ప్రభుత్వంతో సైతం చర్చించామన్నారు. మామిడి రైతులకు రాయితీతో కవర్లు సైతం అందించామన్నారు. ఏమీచేయక శవరాజకీయాలు చేసేవారు చిత్తూరు జిల్లా రైతులకు ఒక్క రూపాయి ఇచ్చారా? అని ప్రశ్నించారు. 3950 కోట్లతో రైతులసౌకర్యార్థం హంద్రీ-నీవా ప్రాజెక్టుకు చర్యలు చేపట్టామన్నారు. రైతులకు బిందు సేద్యానికి 90శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 14వేలు, కేంద్రం 6వేలు ఇస్తోందన్నారు. తమది బాధ్యత గల ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో అనేక ఇబ్బందులను అధిగమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం ఇచ్చామన్నారు. 64లక్షల మందికి ప్రతినెలా 1వతేదినే 34వేల కోట్లరూపాయలు పెన్షన్లరూపంలో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 5 ఏళ్లలో 250రూపాయల పెన్షన్ పెంచడం గొప్పా? అని ప్రశ్నించారు. నాడు వాలంటీర్లు లేకుంటే పింఛన్లు ఇవ్వలేం అన్నారు. నేడు సవ్యంగా పంపిణీ జరుగుతోందన్నారు. పెన్షన్లలో అనర్హుల్నితీసేస్తే గొడవ చేస్తున్నారన్నారు.

**రాష్ట్ర ఆదాయం.. వనరుల్ని కొల్లగొట్టారు**

ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో రాష్ట్ర ఆదాయం, వనరుల్ని కొల్లగొట్టారని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న భూముల రికార్డులు తారుమారు చేశారన్నారు. నేడు >>2



## ప్రధాని మోడీకి 'ఘనా' మేటి పురస్కారం

### అత్యున్నత జాతీయ అవార్డు అందించిన అధ్యక్షుడు మహామా

**అక్రా,(ఘనా),జులై3 :** భారత ప్రధాని నరేంద్ర మోడీ తన విదేశీ పర్యటనలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఆయన విశిష్ఠ రాజనీతిజ్ఞతకు, ప్రపంచవ్యాప్తంగా ప్రభావవంతమైన నాయకత్వానికి గుర్తింపుగా పశ్చిమ ఆఫ్రికా దేశమైన ఘనా తమ దేశ అత్యున్నత జాతీయ పురస్కారం 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా'తో సత్కరించింది. ఘనా రాజధాని అక్రాలో జరిగిన కార్యక్రమంలో ఆ దేశ అధ్యక్షుడు జాన్ ద్రమాని మహామ స్వయంగా ఈ అవార్డును ప్రధాని మోడీకి అందజేశారు. ఈ గౌరవం పట్ల ప్రధాని మోడీహర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాన్ని తాను 140 కోట్ల మంది భారతీయుల తరఫున స్వీకరిస్తున్నానని తెలిపారు. భారత యువత ఆకాంక్షలకు, దేశ సాంస్కృతిక వైవిధ్యానికి, అలాగే భారత్ ఘనా మధ్య ఉన్న చారిత్రక బంధానికి ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రత్యేక గౌరవం అందించినందుకు ఘనా ప్రభుత్వానికి, ప్రజలకు ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు. ఘనా అత్యున్నత పురస్కారం అందుకోవడం గౌరవంగా ఉంది. ఇది భారత్‌ఘనా మధ్య ఉన్న బలమైన, చిరకాల సంబంధాలకు నిదర్శనమని ప్రధాని మోడీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ప్రధాని మోడీకి ఈ పురస్కారం లభించడంపై భారత విదేశాంగ శాఖ కూడా స్పందించింది. గ్లోబల్ సౌత్ దేశాల వాణిని బలోపేతం చేయడానికి మోడీ చేస్తున్న >>2

**మాదేశంలో 2500 రాజకీయ పార్టీలున్నాయి.. ఘనా పార్లమెంటులో ప్రధాని మోడీ** 2లో

## కోటిపల్లి రైల్వే లైన్ భూ సేకరణపై స్టే తొలగింపు

**విజయవాడ, జులై3, ప్రభాతవార్తప్రతినిధి:** కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ భూసేకరణపై దాఖలైన పిటిషన్లపై అమలులో ఉన్న స్టే ఉత్తర్వులను హైకోర్టుఎత్తివేసింది. రీ అలైన్‌మెంట్‌కు సంబంధించి సర్వే చేసేందుకు అధికారులకు వెసులుబాటు కల్పించింది. సాధ్యమైనంత త్వరగా సర్వే పూర్తిచేసి ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లాలని రైల్వే అధికారులను ఆదేశించింది. రైల్వేలైన్ రీఅలైన్‌మెంట్ ద్వారా ఎవరైనా రాజకీయ నాయకులు, బడా వ్యక్తులు లబ్ధిపొందుతున్నారా? అనే విషయాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు సూచించింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. రాజకీయ నాయకులు, పెట్టుబడుదారుల లబ్ధి కోసం కోనసీమజిల్లా, అమలాపురం సమీపంలోని భట్నవిల్లి గుడిమెల్లంక మధ్య కోటిపల్లి నరసాపురం రైల్వేలైన్ అలైన్‌మెంట్ మారుస్తున్నారని, ముందుగా నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారం ట్రాక్ నిర్మాణం చేపట్టేలాఆదేశాలు ఇవ్వాలని >>2

## చెవిరెడ్డి మోహిత్‌కు హైకోర్టులో చుక్కెదురు

### అరెస్టునుంచి రక్షణ కల్పించేందుకు నిరాకరణ

**విజయవాడ, జులై3, ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. తీవ్రమైన ఆరోపణలున్న ఇలాంటి కేసులో అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వలేమని తేల్చి చెప్పింది. పోలీసులు అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉంటే హైకోర్టులో ముందస్తు బెయిలు పిటీషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని, నిందితుల జాబితా నుంచి తన పేరును >>2

## విద్యార్థులకు రవాణా ఖర్చులు

### మూడునెలలకోసారి జమ

**విజయవాడ,జులై 3,ప్రభాతవార్త ప్రతినిధి:** ఇళ్ళకు దూరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రవాణా చార్జీలు చెల్లించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయిం తీసుకుంది.. విద్యాహక్కు చట్టం ప్రకారం 1-8 తరగతుల విద్యార్థులకు పాఠశాల తప్పనిసరిగా నిర్ణీత దూరంలో ఉండాలి. బడి దూరంగా ఉంటే పిల్లలు వెళ్ళి, వచ్చేందుకు రవాణా ఛార్జీలు చెల్లించాలి. ఈ రవాణా ఛార్జీల్లో కేంద్రం 60% ఇస్తే రాష్ట్రప్రభుత్వం 40% భరించాలి. 2025-26 విద్యాసంవత్సరానికి ఇప్పటికే కేంద్రం ఏడాది మూడు నెలలకోసారి రవాణా ఛార్జీలను తల్లిదండ్రులబ్యాంకు ఖాతాల్లో జమచేయాలని భావిస్తున్నట్లు సమగ్ర శిక్షాభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు >>2



తీవ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను చూపుతున్న కర్నూల్ డీఐజీ కోయ ప్రవీణ్, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

## ఇద్దరు టెర్రిస్టుల ఇళ్లలో భారీగా పేలుడు పదార్థాలు

- రాయచోటిలో స్వాధీనం చేసుకున్న పోలీసులు
- దేశవ్యాప్తంగా జరిగిన పేలుళ్లలో 5 కేసులు
- ఆ ఇద్దరికి 'అల్ ఉమా' ఉగ్ర సంస్థతోనూ సంబంధాలు

కర్నూలు డిఐజి కోయ ప్రవీణ్ వెల్లడి

**రాజంపేట, జులై 3 ప్రభాతవార్త :** తమిళనాడు యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ మూడు రోజుల క్రితం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో అరెస్టు చేసిన ఇద్దరు తీవ్రవాదుల ఇళ్లలో భారీ ఎత్తున ప్రాణ నష్టం చేకూర్చే విస్ఫోటక పేలుడు పదార్థాలు, టిన్‌బాంబులు, సూట్‌కేస్ బాంబులతోపాటు అత్యంత భారీ పేలుళ్లకు అమర్చే అధ్యాధునిక ఐఇడి పరికరాలు ఉన్నట్లు కర్నూలు డిఐజి కోయ ప్రవీణ్ వెల్లడించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉగ్రవాదుల ఇళ్లలో స్వాధీనం చేసుకున్న >>2

## నిర్దిష్ట ప్రణాళికతో నీటి ప్రాజెక్టులు పూర్తి

### • పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను గాడిన పెడుతున్నాం • గత ప్రభుత్వం ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం చేసింది: మంత్రి నిమ్మల రామానాయుడు



గురువారం ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జులై3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటి నిర్దిష్ట కార్యచరణ ప్రణాళికను అనుసరించి పూర్తి చేస్తామని ఏపి జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఉత్తరాంధ్ర ప్రజలకు సాగు, మంచినీరందించే పెండింగ్ ప్రాజెక్టులను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నామన్నారు. గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, ఆయా ప్రాజెక్టుల సిఇలు, ఎస్ఇలు ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. గత ఐదేళ్లఉత్తరాంధ్ర ప్రాజెక్టులను వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి నిమ్మల ఆరోపించారు. వంశధార నాగావళి, నాగావళి, చంపావతి అనుసంధానం బ్యాలెన్స్ పనులపై సమీక్షించారు.

హీరమండలం లిఫ్ట్, మద్దువలస స్టేజ్2, జంజ్యావతి రిజర్వాయర్ పనుల వేగవంతంపై చర్చించారు. జైకా నిధులతో నత్తనడకన సాగుతూ నిలిచిపోయిన ఆంధ్ర రిజర్వాయర్, రైవాడ, పెద్దంకలం, పెద్దగడ్డ, వట్టిగెడ్డ పూర్తిచేయడానికి ఉన్న అవాంతరాలపై సమీక్షలో చర్చించారు. 90శాతం పనులు పూర్తైన వంశధార స్టేజ్2, ఫేజ్2 మరియు తోటపల్లి బ్యారేజ్ పనులను గత ప్రభుత్వం గాలికొదిలేయడం దుర్మార్గమన్నారు. వైకాపా గడిచిన ఐదేళ్లలో ఉత్తరాంధ్రకు చేసిన ద్రోహం అంతా ఇంతా కాదన్నారు. వంశధార నాగావళి మరియు నాగావళిచంపావతి అనుసంధానం బ్యాలెన్స్ పనులపై మంత్రి సమీక్షించారు. ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. హీరమండలం లిఫ్ట్, మద్దువలస స్టేజ్ 2, జంజావతి రిజర్వాయర్ పనులు >>2




గురువారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీ అయిన వైఎస్సార్సీ నేతలు

## బ్యాలట్‌తో ఎన్నికలు జరపండి

- కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరిన వైసిపి నేతలు
- చివరి గంటలో పోలింగ్ శాతంపై చర్చ
- బీహార్ తరహాలో ఏపిలో స్పెషల్ ఇంటెన్సిపై రివిజన్‌కు ఓకే


**విజయవాడ జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ నేతల బృందం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసింది. ఈ సందర్భంగా గతంలో ఇవిఎంల పనితీరుపై ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్సీ బృందం ఫిర్యాదు చేసింది. దీంతో ఈ అంశాలపై వివరణ ఇచ్చేందుకు వైఎస్సార్సీ ఇసి ఆహ్వానించింది. దీంతో, ఇసి దృష్టికి పలు కీలక అంశాలను తీసుకెళ్లినట్టు తెలిపారు. వైఎస్సార్సీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి వైఎస్సార్సీ లోక్‌సభ పక్ష నేత మిథున్ రెడ్డి మాజీ ఎంపీబెల్లాన్న చంద్రశేఖర్ , పార్టీ నేత లోకేశ్ రెడ్డిల బృందం గురువారం ఉదయం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో చివరి గంటల్లో అకస్మాత్తుగా పోలింగ్ శాతంగ పెరగడం, అసాధారణంగా ఓటర్లు పెరగడం తదితర అంశాలను ఈసీ దృష్టికి నేతల బృందం తీసుకెళ్లింది.

ఇవిఎంల పనితీరుపై ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఫిర్యాదులపై వివరణ ఇచ్చేందుకు వైఎస్సార్సీ బృందాన్ని ఇసి ఆహ్వానించింది. దీంతో ఇసితో పార్టీ నేతలు చర్చించారు. ఈ సమావేశం అనంతరం ఎంపీ మిధున్‌రెడ్డి, మాజీ ఎంపి బెల్లాన్న చంద్రశేఖర్‌లతో కలిసి వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఈవీఎంలకు సంబంధించిన టెక్నికల్ అంశాలు, కొన్ని పోలింగ్ బూత్‌ల్లో చోటుచేసుకున్న అసంబద్ధ విషయాలను ఎన్నికల సంఘంకు గతంలో ఫిర్యాదు చేశాం. వీటిపై మా సందేహాలకు వివరణ ఇచ్చేందుకు ఎన్నికల సంఘం సమావేశం ఏర్పాటు చేసి, ఆహ్వానించింది. ఈ మేరకు సమావేశంలో ఓటర్ లిస్టు పెరుగుదల, ఇవిఎం టెక్నికాలిటీస్, పోలింగ్ సరళి >>2

## టిటిడి నకిలీ నెయ్యి కేసు

## ముగ్గురు నిందితులకు బెయిలు మంజూరు

### దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించిన హైకోర్టు



**విజయవాడ,జులై3,ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పోమిల్ జైన్ (ఏ3), విపిన్ జైన్ (ఏ4), వైష్ణవి డెయిరీ సిఇఒ అపూర్వ వినయ్ కాంత్ చావడా (ఏ5)లకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తుకు సహకరించాలని, దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని పిటిషనర్లకు న్యాయస్థానం స్పష్టం చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి (టిటిడి)నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో ఈ ముగ్గురుకూడా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ క్రమంలో బెయిల్ మంజూరు చేయాల్సిందిగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా.. ఇటీవల వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి. ఈరోజు పిటిషనర్లకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల శ్రీవారి లడ్డు తయారీకి ఉపయోగించే కల్తీ నెయ్యి కేసులో నిందితులకు బెయిల్ ఇచ్చిన తరువాత న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాస్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టిటిడికి నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పోమిల్ జైన్ (ఏ3), విపిన్ జైన్ (ఏ4), వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ వినయ్ కాంత్ చావడా (ఏ5) లకు హైకోర్టు బెయిల్ >>2



## తొక్కిసలాట ఘటనపై తుది నివేదిక సిద్ధం!

### జస్టిస్ సత్యనారాయణ మూర్తి రెండు రోజులుగా తిరుపతిలో బిజీబిజీ


**తిరుపతి, జులై 3ప్రభాతవార్తప్రతినిధి:** సరిగ్గా ఏడునెలల క్రిందట తిరుపతిలో జరిగిన తిరుమల భక్తుల తొక్కిసలాట ఘటనకేసులో బాధ్యులపై చర్యలకు నియామకమైన జస్టిస్ సత్యనారాయణమూర్తి కమిటీ తుది నివేదికలు సమర్పించేందుకు సిద్ధమవుతోంది. గత రెండురోజులుగా జస్టిస్ సత్యనారాయణమూర్తి తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని ప్రత్యేక ఛాంబర్‌లో బిజీగా సమగ్రసమాచారం సిద్ధం చేస్తున్నారు. నివేదికలు ప్రభుత్వానికి అందితే చివరగా ఇంకెందరిపై వేటుపడతుందనేది మళ్ళీ భయంగొల్పిస్తోంది. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలు కల్పించే సమయంలో ఈ ఏడాది జనవరి8వతేదీ రాత్రి తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్న విషయం విదితమే. ఈ ఘటనలో ఎనిమిది మంది యాత్రికులు ప్రాణాలు >>2



తీవ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న ఐఇడి పేలుడు పరికరాలు, మారణాయుధాలు

# పేలుడు పదార్థాలు

>> పేలుడు పదార్థాలు దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల మ్యాపులు ,పేలుడు పదార్థాలకు తయారీకి ఉపయోగించే పరికరాలు, పెట్రోల్ గ్యాస్ బాంబుల తయారీకి వాడే పేలుడు పదార్థాలు మీడియాకు ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అన్నమయ్య ఎస్పీ విద్యాసాగర్‌తో కలిసి డిఐజి మాట్లాడుతూ 2025 జూన్ 30న తమిళనాడు పోలీసులు పలు బాంబు పేలుళ్ల కేసుల్లో నిందితులపై జారీ చేసిన అరెస్ట్ వారెంట్లను అమలు చేశామన్నారు. ఈ నిందితులు 1999 నుండి పరారీలో ఉండగా, వారు గత 20 సం.గా రాయచోటి పట్టణంలో తప్పుడు పేర్లతో అబూ బకర్ సిద్ధిక్ – అమానుల్లా పేరుతో, మహమ్మద్ అలీ–మంసూర్ పేరుతో నివసిస్తున్నారన్నారు. ఈ ఇద్దరు ఉగ్రవాదులకు తమిళనాడుతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన పేలుళ్లకు సంబంధించి ఐదు కేసులు నమోదయి ఉన్నాయన్నారు. ఈ ఇద్దరు ఉగ్రవాదులు అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్ ఉమాతో సంబంధాలు ఉన్నాయని తెలిపారు. వీరి ఇళ్లలో శోధాలు చేసినప్పుడు భారీ మొత్తంలో విస్ఫోటక పదార్థాలు లభించాయన్నారు., వీటిని ఉపయోగించి పేలుడు పరికరాలు ఐఇడి తయారు చేయవచ్చన్నారు. ఈ పదార్థాలు భారతదేశ పౌరుల ప్రాణాలకు తీవ్ర ప్రమాదాన్ని కలిగించే స్థాయిలో ఉన్నాయనీ అన్నారు. ఉగ్రవాదుల అరెస్ట్‌తో దేశ స్థాయిలో ప్రమాదం నివారించబడిందన్నారు అబూ బకర్ సిద్ధిక్ అమానుల్లా మరియు మహమ్మద్ అలీ మంసూర్ అనే ఉగ్రవాదుల కార్యకలాపాలకు సంబంధించి ఈ సామగ్రిని పోలీస్ బృందం స్వాధీనం చేసుకుందన్నారు. వీరు "అల్ ఉమ్మా" అనే తీవ్రవాద సంస్థతో అనుబంధం కలిగినవారిగా గుర్తించామన్నారు.ఉగ్రవాదుల ఇళ్లలో ఫ్యూయల్ ఆయిల్‌తో కలిపిన అమ్మోనియం నైట్రేట్, ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్స్‌న్రీ ఎక్స్‌ప్లోసివ్, టిన్‌లో నిండి ఉండే బాంబు – 20 కేజీల సూట్ కేసులో, మరొక సూట్ కేసులో ఐఇడి అయ్యి ఉండవచ్చన్నారు. టైమర్‌ల కోసం గడియార యంత్రాలు,పుల్ స్విచ్‌లు, ప్రెషర్ స్విచ్‌లు,స్పీడ్ కంట్రోలర్లు,గ్యాస్ ట్యూబ్ అరెస్టర్లు, పేలుళ్ల సమయంలో గాయాలకు ఉపయోగించే బాల్ బెరింగ్స్, నట్‌బోల్టులు, మానిటరింగ్ కోసం బైనాక్యులర్స్,వాకీటాకీలు, రేడియో పరికరాలు, అనేక మొబైల్ ఫోన్లు, అనేక చెక్ పుస్తకాలు, ఆర్థిక లావాదేవీల సమాచారం, డిజిటల్ స్టోరేజ్ పరికరాలు, ముస్లిం తీవ్రవాద సాహిత్యం, భారతదేశంలోని నగరాల మ్యాపులు,టైమింగ్ సర్క్యూట్లు, మాన్యువల్స్, కోడింగ్ బుక్స్, ఆస్తి మరియు ప్రయాణ పత్రాలు, హ్యాకింగ్ సాఫ్ట్‌వేర్‌లు లభ్యమైనట్టు తెలిపారు. ఉగ్రవాదుల ఇళ్లలో శోధించేసందర్భంగా, నిందితుల భార్యలు అయిన సైరా భాను (అబూ బకర్ సిద్ధిక్ భార్య), షేక్ షమీం (మహమ్మద్ అలీ భార్యలు) పోలీసులపై ప్రతిఘటన చేయడమే కాకుండా మహిళా పోలీసులపై దాడికి యత్నించారన్నారు.. పోలీసుల నిరంతర శ్రమతో ఇంటిని శోధించి పై విస్ఫోటక సామగ్రిని స్వాధీనం చేసుకున్నారున్నారు.ఈ ఘటనపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సైరా భాను షమీంలను శోధనకు అడ్డుపడినందుకు, మహిళా పోలీసులపై దాడికి ప్రయత్నించినందుకు అరెస్ట్ చేసి కడప సెంట్రల్ జైలుకు రిమాండ్‌కి పంపారు. వీరికి నిందితుల ఉగ్రచర్యలపై ఎంత సంబంధముందో అనే దానిపై దర్యాప్తు కొనసాగుతుందన్నారు. నిందితులపై గతంలో సామూహికదాడులు, ఉగ్రవాద చట్టాలప్రకారం కేసులు నమోదయ్యాయి. బాంబు అమరిక, పాంప్లెట్‌లతో కలిసి పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద బాంబు ఉంచడం ఈ కేసులు జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగించే ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించినవిగా నమోదయ్యాయి. ఎగ్మోర్ ఘటన రోజు అనేక ఇతర బాంబులు కూడా వివిధ ప్రాంతాలలో (చెన్నై, త్రిచ్చి, కోయంబత్తూరులో పేలుళ్లు జరిగాయన్నారు.1999లో కోచిన్‌కుర్లా ఎక్స్‌ప్రెస్‌లో ఈ నిందితులు పేలుడు పదార్థాలను అక్రమంగా తరలించబోతుండగా, ఆ ట్రైన్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. అవి కాసర్‌గోడ్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరు నిందితులు గత 20 సంవత్సరాలుగా రాయచోటి పట్టణంలో తప్పుడు గుర్తింపులతో నివసిస్తూ, స్థానికంగా వివాహాలు చేసుకొని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఉన్నారు. అన్నమయ్య జిల్లా పోలీసుల చొరవతో ఒక పెద్ద ఉగ్ర కుట్రను భగ్నం చేయడంలో విజయం సాధించారనీ వివరించారు. ఈ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించడంలో రాజంపేట, మదనపల్లి, రాయచోటి సబ్ డివిజన్ పోలీసు అధికారులు. ఎస్బి సీఐ, సీఐ రాయచోటి అర్బన్ సీఐ రాయచోటి రూరల్ సీఐ సైబర్ సెల్ ఆర్ఐ సైబర్ సెల్ స్పెషల్ బ్రాంచ్ సిసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



గురువారం అక్రాలోని ఘనా పార్లమెంటులో ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

# ప్రధాని మోడీకి 'ఘనా' మేటి పురస్కారం

>> నిరంతర కృషికి లభించిన గుర్తింపు ఇదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఘనాతో మన స్నేహానికి, సహకారానికి ఇది నిదర్శనమని ఆయన 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఈ పురస్కారం ఇరు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లేందుకు తనపై కొత్త బాధ్యతను పెంచిందని ప్రధాని మోడీ పేర్కొన్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోడీమొదటగా ఘనా చేరుకున్నారు. గత మూడు దశాబ్దాల కాలంలో ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ, ఘనా అధ్యక్షుడు మహామ మధ్య విస్తృత స్థాయి చర్చలు జరిగాయి. అనంతరం ఇరు దేశాలు తమ సంబంధాలను 'సమగ్ర భాగస్వామ్య' స్థాయికి పెంచుకుంటున్నట్లు ప్రకటించాయి. తన చారిత్రక పర్యటన భారత్‌ఘనా సంబంధాలకు కొత్త ఊపునిస్తుందని ప్రధాని మోడీవిశ్వాసం వ్యక్తం చేశారు.

# మాదేశంలో 2500 రాజకీయ పార్టీలున్నాయి..

**ఆక్రా(ఘనా),జులై 3:** భారత్‌లో 2500కిపైగా రాజకీయ పార్టీలున్నాయని భారత్‌లోని మారాష్ట్రాలను వివిధ పార్టీలు పాలిస్తున్నాయని చెపుతూ 22 అధికారిక భాషలున్నాయని చెప్పారు. ఘనాదేశ పార్లమెంటులో సభ్యులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇక దేశంలో విదేశీభాషలు వేలాదిగా ఉన్నాయని, భారత్‌కు వచ్చే పర్యాటకులను విశాలహృదయంతో స్వాగతించడానికి ఈ భిన్నత్వమే కారణమని ఆస్ఫూర్తివల్లనే భారతీయులు ఎక్కడికి వెళ్లినా అక్కడి ప్రజలతో సులభంగా మమేకం అవుతున్నారని చెప్పారు.రాజకీయపార్టీల సంఖ్యను చెప్పినవెంటనే ప్రధానిమోడీ వ్యాఖ్యలకు ఘనా పార్లమెంటు సభ్యులు మొత్తం విస్తుపోయారు. ప్రపంచంలోనే అతిపెద్దప్రజాస్వామ్య దేశప్రతినిధిగా 140 కోట్లమంది భారతీయుల శుభాకాంక్షలు మీకు నావెంట తెచ్చానని, ఘనా దేశ పురస్కారాన్ని అందుకోవడం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. రెండుదేశాల సంబంధాలకు ఈ పురస్కారాన్ని అంకితం ఇస్తున్నట్లు తెలిపారు. మాకు ప్రజాస్వామ్యం ఒక వ్యవస్థ మాత్రమే కాదని, ప్రాథమిక విలువల్లో అదిభాగమని, రెండోప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన ప్రపంచక్రమం వేగంగా మారుతోందని సాంకేతికతలో విప్లవం, గ్లోబల్‌సౌత్‌లో ఎదుగుదల ఈమార్పునకు దోహదంచేస్తున్నాయని, గ్లోబల్ సౌత్ గళం వినిపించకుండా ఈ అభివృద్ధి, పురోగతి సాధ్యంకాదన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధిచెందిన దేశంగా మార్చాలనిమా ప్రజలు సంకల్పంతో ఉన్నారని బలమైన భారత్, సుస్థిరమైన ప్రపంచానికి దోహదంచేస్తుందని ఆఫ్రికా అభివృద్ధి దిశగాచేసే ప్రయాణంలో మా సహాయాన్ని అందిస్తామన్నారు. మనదేశాల పురోగతికి పరస్పరం సహకరించుకుందామని ప్రధానిమోడీ పిలుపునిచ్చారు. జి20కి భారత్ సారథ్యం వహిస్తున్న తరుణంలోనే ఆగ్రూప్‌లో ఆఫ్రికా యూనియన్ శాశ్వత సభ్యత్వం పొందడం ఆనందకరమన్నారు. ఈ పర్యటనలోభాగంగా రెండుదేశాలమధ్య పరిశోధన అభివృద్ధి, ఔషధ ఉత్పత్తి సరఫరా తదితరరంగాలకు సంబంధించిన ఒప్పందాలు చేసుకున్నారు.

# నష్టం లేదు..

>> అత్యధికంగా తనకు భూసమస్యలపైనే వినతులు వస్తున్నాయన్నారు. ఏడాదిలోగా ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఒకప్పుడు ఎపిలో బ్రిటీష్ చట్టంకు లోబడి భూరికార్డులు బాగా ఉండేవన్నారు. తాను ఏనాడూ ఫేక్‌ఫెలోస్‌తో రాజకీయం చేయలేదన్నారు. ఇలాంటి వారు అబద్ధాల్ని నిజం చేయాలని చూస్తారన్నారు.నేడు ఫేక్‌ఫెలోస్ రాష్ట్రానికి పెనుసవాల్‌గా మారారన్నారు. ఇలాంటి వారి విషయంలో చట్టం తనపనితాను చేసుకు పోతుందన్నారు. కారుకింద పడ్డ సింగయ్యను ఆస్పత్రికి తరలించలేదన్నారు. పేదరికం లేని సమాజమే తన ధ్యేయం అని అందుకోసమే పి4 కార్యక్రమంను తీసుకొచ్చామన్నారు. 2029నాటికి జీరో పావర్టీ ఉండాలనే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. గతంలో జన్మభూమి కార్యక్రమం సైతం తీసుకొచ్చామని పేర్కొన్నారు. నేడు చిల్లిగవ్వ కూడా ఇవ్వనివారు పి4పై విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో తానుచేసిన ఆర్థికసాయంతో బాగా చదువుకున్న ఓ కుటుంబం తిమ్మరాజుపల్లిలో పేదలను ఆదుకునేందుకు ముందుకువచ్చిందనిగుర్తు చేశారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్ర మంను రాష్ట్రవ్యాప్తంగా చేపట్టామన్నారు.

# టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ వైద్య రంగంలో గేమ్ ఛేంజర్

## గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పంలో ఏర్పాటు

**కుప్పం, జులై 3 ప్రభాతవార్త :** వైద్య ఆరోగ్య రంగంలో టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ గేమ్ ఛేంజర్ అని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. గురువారం కుప్పం ఏరియా ఆస్పత్రిలో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటైన టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ (డిఐఎన్‌సి)ను సిఎం చంద్రబాబునాయుడు పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఆధునిక సా ంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వైద్య ఖర్చులు తగ్గించేలా చూడాలని సూచించారు. బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్య రంగాలకు 19వేల కోట్ల వ్యయం అవుతోందన్నారు. టెకా న్నలజీ వాడకంతో దీన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. డేటా లేక్,డేటా కలెక్షన్ ద్వారా వ్యక్తులకు అందించాల్సి న చికిత్సకు అవసరమైన ఔషధాలు కూడా అందించవచ్చన్నారు. ప్రివెంటివ్ హెల్త్, రియల్ టైం మానిటరింగ్ లాంటి అంశాలు పరిశీలించాలన్నారు. గర్భిణుల ఆరోగ్యాన్ని నిరంతరం తనిఖీ చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా ప్రతి మూడు నెలలకు రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. రెండో దశలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా డిఐఎన్‌సి సెంటర్‌ను అన్ని పిహెచ్‌సిలకు అనుసంధానిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. ఆయుష్మాన్ భారత్‌తో పాటు ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని సమన్వయం చేస్తామన్నారు.

**ప్రపంచానికే నమూనా డిఐఎన్‌సి కేంద్రం :**

కుప్పంలో అమలు చేస్తున్నడిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రపంచానికే నమూనాగా మారుతుందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా వైద్య రంగంలో అత్యుత్తమ సా ంకేతికతను సమన్వయం చేస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని అనుసంధానిస్తామన్నారు. ఎఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కేంద్రాలను కూడా డిఐఎన్‌సి సెంటర్‌తో అనుసంధానం చేయాలని సిఎం ఆదేశించారు. వ్యక్తిగత వైద్య రికార్డుల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉండేలా సేవలు అందించనున్నట్లు చెప్పారు. వర్చువల్ విధానంలో సైతం రోగికి వైద్య నిపుణుల్ని అందుబాటులో తీసుకువచ్చి చికిత్స అందించే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో రోగులు, వైద్యులతో మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ వైద్య సేవలు మెరుగుపరచుకునేందుకు సిఎం చంద్రబాబునాయుడు అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చారన్నారు. వైద్య సేవలను డిజిటల్ నెర్వ్ సెంటర్‌తో అనుసంధానించే ఈకార్యక్రమం భవిష్యత్తులో చరిత్ర సృష్టిస్తుందన్నారు. రోగుల పట్ల ఆత్మీయంగా వ్యవహరిస్తూ ప్రత్యేక సేవలు అందించేందుకు ఈ కార్యక్రమం అవకాశం ఇస్తుందన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు, వైద్య, ఆరోగ్య శాఖ కమీషనర్ వీర పాండియన్, టాటా కన్సల్టెన్సీ ప్రతినిధులు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, డిఎంహెచ్‌ఓ సుధారాణి పాల్గొన్నారు.

# తుది నివేదిక సిద్ధం!

>> కోల్పోయిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఘోరతప్పిదాలకు ఇంకెందరు కారణమనేది తెలియాల్సి ఉంది. తొక్కిసలాటఘటనలో అప్పట్లో ఏకంగా తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు పాఠశాల కౌంటర్ల ప్రాంతంలో బందోబస్తు విధుల్లో ఉన్న తిరుపతి నగరక్రైమ్ డిఎస్పీ రమణకుమార్, టిటిడి ఎస్వీగోశాల డైరెక్టర్ హరనాథరెడ్డిని అదేరోజు సస్పెండ్ చేసిన విషయం విదితమే.ఐఎఎస్, ఐపిఎస్‌లను తక్షణం బదిలీ వేటుపడింది. ఆ తరువాత తిరుపతి నగర డిఎస్పీనికూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ తొక్కిసలాటఘటనకు తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీకి ముందు తగిన జాగ్రత్తలు, ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించలేకపోవడమే కారణమని పలువురు క్షతగాత్రులైన బాధితులు స్విమ్స్,రుయా ఆస్పత్రుల్లో చికిత్స పొందిన సమయంలోనే సిఎం చంద్రబాబుకు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు టిటిడి ఆర్థికసాయం భారీ మొత్తంలో అందించింది. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తిని విచారణ కమిషన్ ఛైర్మన్‌గా నియమించింది. ఆయన నేతృత్వంలోని కొందరు సిబ్బంది ఏకంగా నాలుగునెలలు తిరుపతి జిల్లాకలెక్టరేట్‌లో ప్రత్యేక ఛాంబర్ నుండి విధులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరచారి, అప్పటి జెఇఒ గౌతమి, సివిఎస్ఒ శ్రీదర్‌లను పలు దఫాలుగా విచారణ చేశారు. దీనిపై ప్రత్యేక నివేదిక రూపొందించారు. పూర్తిగా పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తొక్కిసలాట, ఆరుగురు ప్రాణీలు తీసిందనేది బాధితుల ఆరోపణలు.

# విద్యార్థులకు రవాణా ఖర్చులు

>> పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఈ ఏడాది సంస్కరణల్లో భాగంగా పాఠశాలల హేతుబద్ధీకరణ చేసింది. తొమ్మిది రకాల బడులను తీసుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 9,600 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఇందుకోసం సమీపం లోని 3,4,5 తరగతులను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు తరలించారు. కొన్ని చోట్ల విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రాథమికోన్నత బడుల స్థాయిని తగ్గించారు. దీంతో 6,7,8 తరగతుల విద్యార్థులు సమీపం లోని ఉన్నత పాఠశాలలకు వెళ్ళాల్సి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 79,860 మంది విదార్యార్థులకు రవాణా ఛార్జీలను చెల్లించనున్నారు. 1-5 తరగతులు ఉండే ప్రాథమిక పాఠశాల ఆవాసానికి కిలోమీటరు కంటే ఎక్కువ దూరం ఉన్నా 6,7,8 తరగతుల పాఠశాలలు 3 కిలోమీటర్ల దూరం కంటే ఎక్కువ ఉన్నా ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున రవాణా ఛార్జీలు చెల్లిస్తారు. గతంలో విద్యా సంవత్సరం ముగింపు సమయంలో ఒకేసారి రూ.6వేలు చెల్లించేవారు. ఈ సారి మూడు నెలలకో సారి చెల్లిస్తే విద్యార్థులు,వారి తల్లిదండ్రులకు ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

# నీటి ప్రాజెక్టులు పూర్తి

>> వేగవంతంపై వివరాలు అడిగారు జైకా నిధులతో నత్తనడకన సాగుతూ నిలిచిపోయిన ఆంధ్ర రిజర్వాయర్, రైవాడ, పెద్దంకలం, పెద్దగడ్డ, వట్టిగెడ్డ, పూర్తిచేయడానికి ఉన్న అవాంతరాలపై ఆరా తీశారు వెలిగొండ ప్రాజెక్ట నిర్మాణంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా సొరంగాల్లో బెంచింగ్, లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో టన్నెల్‌లో ఉన్న టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగింపుకు కోర్టుకేసు అడ్డంకిగా ఉన్న నేపథ్యంలో మిషన్ విలువ నిర్ణయించేందుకు సాంకేతిక నిపుణుల కమిటీని నియమించామని తెలిపారు. ఫీడర్ కెనాల్, లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి పాలనా పరమైన అనుమతులు రాగానే టెండర్లు పిలిచి పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు.ఇంక పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల్లో హైవే బ్రిడ్జి, పంపా ఆక్విడెక్ట్, కృష్ణవరం సైఫన్ వంటి క్లిష్టతర పనులు వేగంవంతం చేయాలి అని అధికారులు, ఏజెన్సీలకు నిర్దేశించారు ముఖ్య మంత్రి సమీక్ష నాటికి ఏ ఏ పనులకు ఎంతెంత ప్రాధాన్యం ఇవ్వాలి.

ఎంత కాలంలో పూర్తి చేస్తారు, తదితర వివరాలతో సమగ్ర నివేదికలతో సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు, ఇంజనీర్లకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సి, నరసింహామూర్తి, ఆయా ప్రాజెక్టల సిఇలు, ఎస్ఇలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్టే తొలగింపు

>> కోరుతూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు హైకోర్టులో విచారణకు వచ్చాయి. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. ముందుగా ప్రతిపాదించినరైల్వేలైన్ అలైన్‌మెంట్‌ను మార్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి, రైలేశాఖ తరఫు న్యాయవాది రుద్ర ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. రైల్వే అలైన్‌మెంట్ మార్పు కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదన చేశారని తెలిపారు. సర్వే నిర్వహణపై హైకోర్టు స్టే విధించడంతో ప్రక్రియ ముందుకు సాగలేదన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 04-07-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
నవమి సా.4.32
చిత్త సా.4.50
వర్జ్యం రా.11.08-12.56
దు.ఉ.8.17-9.09, 2) మ.12.39-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైై చికాకులు పెడతాయి. బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**వృషభం :** టెంపరరిగా ఉన్న ఉద్యోగం పర్మినెంట్ అవుతుంది. రాజకీయరంగాల వారికి ప్రభుత్వరంగం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**మిథునం:** సోదరుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు పొందు తారు.

**కర్కాటకం:** ప్రముఖుల నుండి వచ్చిన ఆహ్వానం ఆశ్చర్యపరుస్తుంది. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**సింహం:** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**కన్య :** జీవిత భాగస్వామితో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**తుల :** ప్రముఖుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.సంతానం, విద్యా,ఉద్యోగావకాశాలు పొందుతారు.

**వృశ్చికం:**వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండటం మంచిది. సంతానం నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**ధనుస్సు:** ఉద్యోగులకు ఎదురైన చికాకులు కొంతవరకు తొలుగుతాయి. కళా, సినిమా రంగాలవారికి ప్రోత్సహకరంగా ఉంటుంది.

**మకరం:** సోదరుల నుండి వచ్చిన వార్తవల్ల ఆనందం కలుగుతుంది. పెట్టుబడులకు తగిన లాభాలు కష్టమే.

**కుంభం :** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మీనం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటాయి. జీవిత భాగస్వామి నుండి సహాయ సహకారాలు అందుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మాజీ సిఎం జగన్‌తో వంశీ దంపతుల భేటీ



గురువారం మాజీ సిఎం జగన్‌తో భేటీ అయిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దంపతులు

**విజయవాడ, జులై3, ప్రభాతవార్తప్రతినిధి:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దంపతులు వైకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను తాడేపల్లి నివాసంలో గురువారం కలిశారు. నిన్న జైలు నుంచి బెయిల్‌పై వంశీ విడుదలయ్యారు. ఆయనపై కిడ్నాప్, బెదిరింపులు, గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి, నకిలీఇళ్లపట్టాలు, అక్రమ గనుల తవ్వకాలు వంటి ఆరోపణలతో 11 కేసులు నమోదయ్యాయి. ఆయనపై నమోదైన అన్ని కేసుల్లో బెయిల్ మంజూరు కావడంతో నిన్న జైలు నుంచి విడుదల య్యారు. ఆయన గురువారం నేరుగా కుటుంబ సభ్యులతో కలిసి మాజీ సిఎం వైఎస్ జగన్ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. తనకు కష్టకాలంలో అండగా నిలిచినందుకు వైయస్ జగన్‌కు వల్లభనేని వంశీ దంపతులు ధన్యవాదాలు తెలిపారు. వంశీకి పార్టీ అన్నివేళల అండగా ఉంటుందని వైఎస్ జగన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. వంశీకి అన్ని విధాలుగా అండగా ఉన్న ఆయన సతీమణి పంకజశ్రీని జగన్ అభినందించారు.ఆరోగ్య విషయంలో తగిన శ్రద్ధ దీసుకోవాలని వంశీకి జగన్ సూచించారు.తాను పార్టీ కార్యకలపా లల్లో చురుగ్గానే పాల్గొంటానని జగన్‌కు వంశీ వెల్లడించారు.తనపై ఆరోపణలు,కేసులు చంద్ర బాబు ఆయన బృందం వత్తిడితో పోలీసులు పెట్టారని వంశీ వివరించారు.

# హైకోర్టులో చుక్కెదురు

>> తొలగించేలా ఆదేశించాలని మోహిత్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. పిటీషన్‌పై విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. మద్యం కుంభకోణం కేసులో సిఐడి పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు తుడా మాజీ ఛైర్మన్ మోహిత్‌రెడ్డి(ఎ39)హైకోర్టులో క్వాష్ పిటీషన్ వేసిన విషయం తెలిసిందే. బుధవారం జరిగిన విచారణలో సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ...ఓ వైపు పిటీషనర్‌ను కేసులో నిందితుడిగా పేర్కొంటూ మరో వైపు సాక్షిగా విచారణకు హాజరుకావాలని దర్యాప్తు అధికారి(ఐఓ) నోటీసు ఇచ్చారన్నారు. ఇలాంటి చర్య సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు.

ఈ వాదనలపైన్యాయమూర్తి స్పందిస్తూ...దర్యాప్తులో భాగంగా వివరాలు తెలుసుకునేందుకు సాక్షిగా ముందు హాజరుకావాలని మోహిత్‌రెడ్డికి నోటీసు ఇచ్చే అధికారం ఐఓకు ఉందన్నారు. 'నందిని'సత్పతి' కేసులో సుప్రీం కోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వలేమని వెల్లడించారు.

# బెయిలు మంజూరు

>>మంజూరుచేసింది. దర్యాప్తుకు సహకరించాలని, దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని పిటిషనర్లకు న్యాయస్థానం స్పష్టం చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి (టిటిడి)నకిలీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో ఈ ముగ్గురు కూడా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ క్రమంలో బెయిల్ మంజూరు చేయాల్సిందిగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా.. ఇటీవల వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి .. ఈరోజు పిటిషనర్లకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ ఉత్తర్వుల అనంతరం బెంచ్ మీదనే న్యాయమూర్తి జస్టిస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పల్నాడు జిల్లా రెంటపాల్లలో జగన్ పర్యటన సందర్భంగా ఆయన కారుకిందే పడి సింగయ్య అనే వృద్ధుడు మృతి చెందారు. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో జగన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో తనపై నమోదైన కేసులను కొట్టి వేయాలంటూ మాజీ సిఎం హైకోర్టును ఆశ్రయించారు. గత వారం సింగయ్య కేసులో జగన్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. దీంతో ఈ వ్యవహారంలో జస్టిస్ శ్రీనివాస్ రెడ్డిని సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. ఈ ట్రోల్స్‌పై బెంచ్ మీదనే జస్టిస్ కె.శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. నన్ను గత రెండురోజులునుంచి సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. సారీ స్టేట్ ఆఫ్ అఫ్ఫైర్స్ అంటూ వ్యాఖ్యానించారు. ఇప్పుడు కల్తీ నెయ్యి కేసులో నిందితులకు బెయిల్ ఉత్తర్వులు కూడా ట్రోల్స్‌కు బాగా పనికి వస్తాయంటూ జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి కామెంట్స్ చేశారు. అలాగే వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బెయిల్ కేసులను వచ్చే మంగళవారానికి న్యాయమూర్తి వాయిదా వేశారు. అంతేకాకుండా తన ముందున్న బెయిల్ కేసుల అన్నీ వచ్చే వారం వేరే బెంచ్ ముందు చూసుకోవాలని జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

# బ్యాలట్‌తో ఎన్నికలు జరపండి

>> తదితరంశాలపై చర్చలు జరిగాయి. ఏపీలోని కొన్ని నియోజకవర్గంలో ఈవీఎంల ఓట్లకు , వివి ప్యాట్ లతో పోల్చి చూడాలని కోరినా ఎన్నికల సంఘం స్పందించలేదు. నిబంధనల ప్రకారం డబ్బులు కట్టినా కూడా మ్యాచింగ్ చేయడానికి కౌంటింగ్ చేయడం లేదనే విషయంపై ఎన్నికల అధికారులను ప్రశ్నించాం. అలాగే ఈవీఎంలలో బ్యాటరీల పైన కూడా సందేహాలు ఉన్నాయి. పోలింగ్ పూర్తయ్యే సరికి బ్యారీల్లో 80 శాత చార్జింగ్ ఉంటే, నలబై రోజుల తరువాత కౌంటింగ్ సమయానికి దాదాపు 98 శాతం చార్జింగ్ ఉన్నట్లు గుర్తించాం. దీనిపైన కూడా విచారణ జరగాలని కోరాం. ఏపీలో సాయంత్రం 6 గంటల తర్వాత ఎక్కువ నియోజకవర్గాలలో పోలింగ్ శాతం పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4 కోట్ల ఓట్లలో దాదాపు 51 లక్షల ఓట్లు చివరి గంటలో పోలవ్వడం అనేక సందేహాలకు తావిస్తోంది. దీనిపై విచారణ జరపాలని కోరాం. అయితే ఎన్నికల సంఘం అధికారులు మాత్రం వివి ప్యాట్ ల కంపారిజన్ చేయడంకుదరదని తెగేసిచెప్పారు. బ్యాటరీ చార్జింగ్‌విషయంలో అవి రీచార్జ్‌బుల్ బ్యాటరీలు కావడం వల్ల చార్జింగ్ పెరగడం, తగ్గడం అంటూ జరగదని ఎన్నికల సంఘం అధికారులు వివరణ ఇచ్చారు. ఆరు తరువాత పోలింగ్ జరిగిన చోట్ల, ఎక్కువ శాతం పోలింగ్ నమోదైన ఘటనలపై డేటా తెప్పించుకుని పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అలాగే కొన్ని నియోజకవర్గాల్లో ఓట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. రాయచోటి నియోజకవర్గంను ఉదాహరణగా చూపించడం జరిగింది. దీనికి ఎన్నికల కమిషన్ సానుకూలంగా స్పందించింది. ఈ నియోజకవర్గం నుంచి డెటా తెప్పించుకుని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఓటర్ల పెంపుదలపై బీహార్ తరహాలో ఏపీలో కూడా స్పెషల్ ఇంటెన్సిపై రివిజన్ చేయాలని కోరిన నేపథ్యంలో దానికి ఎన్నికల అధికారులు అంగీకరించారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ బూత్ నెంబర్ 157, 28వ పోలింగ్ బూత్ ల్లో అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు భిన్నమైన పోలింగ్ నమోదు అయ్యింది. 28 వ బూత్‌లో వైయస్‌ఆర్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థికి 472 ఓట్లు వస్తే, అసెంబ్లీ అభ్యర్థికి కేవలం 1 ఓటు మాత్రమే వచ్చింది. అలాగే రాష్ట్రంలో నామమాత్రంగా ప్రభావం చూపించే కాంగ్రెస్‌పార్టీకి చెందిన పార్లమెంట్ అభ్యర్థికి 1 ఓటు వస్తే, అసెంబ్లీ అభ్యర్థికి 464 ఓట్లు వచ్చాయి. అలాగే టిడిపికి పార్లమెంట్ అభ్యర్థికి 8 ఓట్లు వస్తే, అసెంబ్లీకి 95 ఓట్లు వచ్చాయి. ఈ ఓటింగ్ సరళిని గమనిస్తేనే అనేక సందేహాలు వ్యక్తమవుతు న్నాయి. వీటిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరడంతో, దీనిపై డేటా తెప్పించుకుని పరిశీలిస్తామని ఇసి హామీఇచ్చింది. ఇటువంటి ఘటనల నేపథ్యంలో ఇవిఎంలపై అనుమానాలు ఉన్నాయని వివరించాం. అందుకే రాబోయే రోజుల్లో జాతీయ స్థాయిలో అన్ని ఎన్నికలు బ్యాలెట్ విధానంలో జరగాలని సూచించాం. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో బ్యాలెట్ విధానం అమల్లో ఉంది. యూఎస్, జర్మన్, యూరోప్ దేశాల్లో బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు జరుగుతున్నాయి. కాబట్టి రాబోయే రోజుల్లో ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే, బ్యాలెట్ పేపర్ తో ఎన్నికలు జరగాలనేదే వైయస్‌ఆర్సీ ఉద్దేశమని వివరించాం. ఇప్పటికే మాజీ ఎంపి బెల్లాన్న చంద్రశేఖర్ తన నియోజకవర్గంలో వీవీప్యాట్‌లను లెక్కించా లని కోర్టులో కేసువేశారు. కానీ ఎన్నికలఅధికారులు మాక్ పోలింగ్ నిర్వహించి చేతులు దులుపుకున్నారు. వివి ప్యాట్‌లను లెక్కించేది లేదని చెబుతున్నారు. కనీసం సీసీ ఫుటేజీ అడిగినా ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. మా మార్గదర్శకాలు ఇలాగే ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు. ఈఅనుమానాలను తొలగించేందుకు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరపాలనికోరామని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి వెల్లడించారు.




## రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన లక్ష్యంగా అడుగులు : ఆకె రవికృష్ణ

**విజయవాడ,జులై 3,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి సరఫరా చేసిన అడ్డుకొని తీరుతామని ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ స్పష్టం చేశారు. గంజాయి సప్లై చేస్తున్న వారిని గుర్తించి ఆస్థులను అటాచ్ చేశామని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి అమ్మినా, కొన్నా, సరఫరా చేసినా ఎవ్వరినీ వదిలి పెట్టమని రవికృష్ణ హెచ్చరించారు.ఏపీ డిజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు డ్రగ్స్ రవాణాపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో రైళ్ళలో ఈగల్,జీఆర్పీ,ఆర్పీఎఫ్ విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాలకు కోరమాండల్ రైలులో తరలిస్తున్న గంజాయి చాక్లెట్లను, గంజాయినీ ఈగల్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా రవి కృష్ణ మీడియాతో మాట్లాడారు. గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగుచేయిస్తున్నామని చెప్పుకొచ్చారు.ఏపీలో ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి సరఫరా చేసినా అడ్డుకొని తీరుతామని ఆకే రవికృష్ణ స్పష్టం చేశారు. గంజాయి సప్లై చేస్తున్న వారిని గుర్తించి వారి ఆస్థులను అటాచ్ చేసామని పేర్కొన్నారు. డ్రగ్స్,గంజాయి అమ్మినా,కొన్నా,సప్లై చేసిన ఎవ్వరిని వదిలి పెట్టమని హెచ్చరించారు. గంజాయి,నిషేధిత డ్రగ్స్ సప్లై చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. రూ.21 వేల గంజాయిని ఆరు నెలల్లో పట్టుకున్నామని తెలిపారు. గంజాయిని రైళ్ళ ద్వారా ఇతర రాష్ట్రాకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించామని చెప్పుకొచ్చారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ, రైల్వే,ఈగల్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టిందని ఆకే రవి కృష్ణ వెల్లడించారు.

## పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి 'మీడియేషన్ ఫర్ ది నేషన్' క్యాంపైన్

### రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ బి.ఎస్.వి.హిమబిందు



**విజయవాడ,జూలై 3, ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశంతో సుప్రీం కోర్టు మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ ఈ నెల 1 వ తేదీ నుండి 90 రోజుల పాటు నిర్వహిస్తున్న దేశవ్యాప్త మధ్యవర్తిత్వ క్యాంపైన్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యారు సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ (డిస్ట్రిక్ట అండ్ సెషన్స్ జడ్జి) బి.ఎస్.వి.హిమబిందు విజ్ఞప్తి చేశారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించేందుకు ఈ నెల 5 వ తేదీన నిర్వహించే 2 వ జాతీయ లోక్ అథాలత్ ను కూడా సద్వినియోగం చేసుకోవాలన ఆమె కోరారు. బుధవారం రాష్ట్ర సచివాలయం దగ్గర్లోనున్న రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ మీడియేషన్ ఫర్ ద నేషన్ క్యాంపైన్ మరియు లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీచేసుకుంటే ఇరు పక్షాలు విజయం సాధించినట్లే అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు ఈ నెల 1 వ తేదీ నుండి సెప్టెంబర్ 30 వ తేదీ వరకు 90 రోజులపాటు దేశవ్యాప్తంగా మీడియేషన్ ఫర్ ద నేషన్ క్యాంపైన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెలలో పరిష్కరించ దగ్గ కేసులను గుర్తించి, మధ్యవర్తిత్వం ద్వారా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకై మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన దాదాపు 893 మంది విశ్రాంత న్యాయమూర్తులు, సమాజ సేవకులు మరియు న్యాయవాదులకు ఆయా కేసులను అప్పగించి, వారి మధ్యవర్తిత్వంలో పరిష్కారమైన కేసులకు కోర్టులో రాజీ మార్గంలో తీర్పు ఇవ్వడం జరుగుతుందన్నారు. సాధారణంగా ఏ కోర్టులో అయినా తీర్పు చెపితే, ఎవరో ఒకరు మాత్రమే విజయం సాధించే అవకాశం ఉంటుందని, దాని పైన అప్పీళ్లకు కూడా వెళ్ళే అవకాశం వుందని ఆమె తెలిపారు. అలా కాకుండా మధ్యవర్తిత్వం ద్వారా కానీ లేదా లోక్ అదాలత్ ద్వారా గాని పరిష్కరించుకున్నట్లైతే, కక్షిదారులు ఇరువురూ విజయం సాధిస్తారన్నారు. అదే విధంగా, జాతీయ న్యాయసేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు ఏడాదికి 3 నుండి 4 జాతీయ లోక్ అథాలత్ లను నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 5 వ తేదీన 2వ జాతీయ లోక్ అథాలత్ ను రాష్ట్రంలోని అన్ని న్యాయస్థానాల్లోనూ, హైకోర్టులోనూ మరియు విశాఖపట్నంలోని డెట్ రికవరీ ట్రిబ్యునల్ లోనూ ఈ అథాలత్ లను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అథాలత్ తో వివాహ, ఆస్తి, సివిల్ తగాదాలు, మనీ సూట్లు, వాహన ప్రమాదాల ఇన్సూరెన్స్ కేసులు. చెక్ బౌన్స్ కేసులు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను కూడా రాజీ చేసుకోవచ్చని ఆమె వివరించారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ, 13 డిఎల్ఎస్ఏ లు మరియు 147 ఎంఎల్ఎస్ఏ లు గత కొద్ది కాలంగా కృషి చేసి లోక్ అదాలత్ లో రాజీపడ దగ్గ కేసులు మొత్తం 1,15,071 రాష్ట్రంలో ఉన్నట్లు గుర్తించడం జరిగిందని ఆమె తెలిపారు. లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవడంవల్ల కక్షిదారుల సమయం డబ్బు కూడా ఆదా అవుతుందని, మానవ సంబంధాలు మెరుగు పడతాయని ఆమె వివరించారు.

## బాలాజీ యాదవ్, నవీన్ కృష్ణలు గుంటూరు జిల్లా జైలుకు తరలింపు

**విజయవాడ,జులై 3,ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో అరెస్టు అయిన వైకాంగ్రెస్ పార్టీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనుచరులు బాలాజీకుమార్ యాదవ్ (ఎ-35),ఎద్దల నవీన్ కృష్ణలకు(ఎ-36) ఈ నెల 15 వరకు రిమాండు విధిస్తూ విజయవాడ ఎసిబి న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. వీరిని గుంటూరు జిల్లా జైలుకు తరలించాలని ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో వారిద్దరినీ పోలీసులు గుంటూరు జిల ఆ జైలుకు తరలించారు. అంతకు ముందు ఏసీబీ న్యాయ స్థానంలో సిట్,నిందితుల తరపు న్యాయవాదులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆదేశాల మేరకు మద్యం ముడుపుల సొమ్ము తరలింపులో వీరిద్దరూ ప్రత్యక్షంగా పాల్గొన్నారని సిట్ తరపు న్యాయవాది, ప్రాసిక్యూషన్స్ జెడీ రాజేంద్రప్రసాద్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సాధారణ ఎన్నికల సమయంలో తీసుకొచ్చిన ఈ ముడుపుల సొమ్మును వీరు ఎవరెవరికి చేర్చారనేది రాబట్టాల్సి ఉందని,అందుకే వారికి రిమాండు విధించాలని కోరారు. అనంతరం నిందితుల తరపున న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ,వీరికి అవినీతి నిరోధక చట్టం లోని సెక్షన్లు వర్తించవని, మిగతావి ఏడేళ్ళ లోపు జైలు శిక్ష పడే సెక్షన్లే కనుక రిమాండు అవసరం లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి... నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులిచ్చారు. మరో వైపు సిట్ అధికారులు తనను దూషించారని, తెల్ల కాగితంపై సంతకాలు చేయాలని బెదిరించారని బాలాజీ యాదవ్ న్యాయాధికారికి ఫిర్యాదు చేశారు.ఇప్పటి వరకు మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన తొమ్మిది మంది విజయవాడ కారాగారంలో ఉన్నారు. తాజాగా రిమాండుకు వెళ్ళిన ఇద్దరితో కలిసి అరెస్ట్ అయిన వారి సంఖ్య 11కు చేరింది.

కీలకమైన ఈ కేసులో ఒకే జైలులో ఇంత మందిని ఉంచడం క్షేమం కాదని భావించి బాలాజీ, నవీన్‌లను గుంటూరుకు తరలించారు.

## సీమాంధ్ర మీదుగా తిరిగే పలు రైళ్లు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే, జూలై 3,ప్రభాతవార్త** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ రాయలసీమ జిల్లాల మీదుగా బెంగళూరు-బీదర్-బెంగళూరుల మధ్య ప్రస్తుతం నడుపుతున్న ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను సెప్టెంబరు 1వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. బెంగళూరు నుంచి బీదర్ వెళ్లే నెంబర్ 06539ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 4నుండి ఆగస్టు 31వరకు పొడిగించారు. బెంగళూరు-నారంగీ మధ్య తిరిగే ప్రత్యేక రైళ్లు ఈ నెల 19వరకు పొడిగింపు :- అలాగే బెంగళూరు నుంచి నారంగీ(గౌహతి) వెళ్లే నెంబర్ 06559ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 15వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో నారంగి నుంచి బెంగళూరు వెళ్లే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ 19వరకు పొడిగించారు. బెంగళూరు-మల్డా టౌన్ మధ్య తిరిగే ప్రత్యేక రైళ్లు 16వరకు పొడిగింపు : బెంగళూరు నుంచి పశ్చిమ బెంగాల్ లోని మాల్డా టౌన్ మధ్య తిరిగే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ 13వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో మాల్డా టౌన్ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 06566ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 16వరకు పొడిగించారు.

## గుంతకల్లు రైల్వే డివిజన్ మెడికల్ బడ్జెట్‌ను దక్షిణ మధ్య రైల్వేలోనే కొనసాగించాలి

### రైల్వే కార్మికులు




**గుంతకల్లు రైల్వే, జూలై 3,ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు కొత్తగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో విలీనం చేసిన గుంతకల్లు డివిజన్‌లోని డివిజనల్ రైల్వే ఆసుపత్రికి వచ్చే రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోనే కొనసాగించాలని రైల్వే కార్మికులు,కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి. రాయలసీమకే తలమానికమైన గుంతకల్లు డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో 98వేల మంది రైల్వే కుటుంబాలు చికిత్స నిమిత్తం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. డివిజన్‌లో మెడికల్ బడ్జెట్ కింద రూ.15కోట్లు కేటాయిస్తున్నారు. ఇందులో సాధారణ మెడికల్ బడ్జెట్‌లో రూ.7కోట్లు, రెఫరల్ ఆసుపత్రులకై చెల్లించేందుకు మరో రూ.8కోట్ల వ్యయం చేస్తున్నారు. గుంతకల్లు డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో 131బెడ్లు ఉండేవి, డివిజన్ పరిధిలోని తిరుపతిలోని సబ్ డివిజన్ ఆసుపత్రికి 30పడకలను బదలాయించడంతో గుంతకల్లు రైల్వే ఆసుపత్రిలో ప్రస్తుతం 101పడకలున్నాయి. అలాగే రాయచూరు,డోన్, గుత్తి,కడప, నందలూరు,రేణిగుంట, పాకాల, మదనపల్లి, ధర్మవరంలలో మరో 9ఆరోగ్య కేంద్రాలు రైల్వే కుటుంబాలకు సేవలందిస్తున్నాయి. ఇదిలావుండగా గుంతకల్లు రైల్వే డివిజన్‌ను విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో విలీనం చేయడంతో రైల్వే కార్మిక కుటుంబాల్లో ఆందోళనలు మొదలయ్యాయి. ఇకపై రైల్వే సెంట్రల్ ఆసుపత్రికి రెఫర్ చేస్తే 786కి.మీల దూరంలో ఉన్న విశాఖ రైల్వే సెంట్రల్ ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంటుంది. రైల్వే కార్మిక కుటుంబాల జీవన్మరణాల సమస్యలను దృష్టిలో ఉంచుకొని గుంతకల్లు రెఫరల్, మెడికల్ బడ్జెట్ రూ.15కోట్లను 366కి.మీ దూరంలోని సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు కేటాయించి రైల్వే కుటుంబాల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత రైల్వే యాజమాన్యంపైనే ఉంది. ఈ విషయమై దక్షిణ కోస్తా రైల్వే/దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సందీప్ మాథూర్ ప్రత్యేక దృష్టి సారించి రైల్వే కుటుంబాలను రక్షించవలసిన బాధ్యత ఉంది.

## తోమాలసేవ, అభిషేకం దర్శనాల పేరుతో దళారీ మోసం

**తిరుమల,జూలై 3ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దగ్గరగా తమ కళ్ళారా వీక్షించుకోవాలనే తపన ప్రతి భక్తునికి కలుగుతుంది. అలాంటి భక్తుల అమాయ కత్వాన్ని, దర్శనాలను ఆసరాగా చేసుకుంటున్న కొందరు దళారులు సులభంగా తమ వలలోవేసుకుని వేలల్లో, లక్షల్లో డబ్బులు తీసుకుని చివరకు చేతులెత్తేస్తుండటం కొందరైతే,మరికొందరు ఏకంగా నకిలీ దర్శన టిక్కెట్లు సృష్టించి భక్తులను మోసం చేస్తున్నారు. ఇలాంటి కోవకు చెందిన ఓ దళారీ తెలంగాణ సిరిసిల్ల వాసులను భారీగా మోసం చేశాడు. ఆ భక్తులు తమకు తోమాలసేవ దర్శనం అదృష్టమని భావించి తిరుమలకు చేరుకుంటే అసలు మోసంజరిగిందని తెలుసుకున్నారు. తిరుమల పోలీసుల కథనం మేరకు సిరిసిల్లకు చెందిన విజయ్ కుటుంబంతో శ్రీవారి తోమాల, అబిషేకసేవలు దర్శనం కావాలని కోరాడు. ఇందుకు అతనికి తెలిసిన వ్యక్తిద్వారా బాలాజీ అనే వ్యక్తి నంబర్‌ను తీసుకుని కోరిన దర్శనం చేయిస్తాడని నమ్మించాడు. బాలాజీని ఫోన్‌లోనే సంప్రదించడంతో కోరిన దర్శన టిక్కెట్లు ఇప్పిస్తానని అందుకు 65వేల రూపాయలు నగదును రెండు దశల్లో తీసుకున్నాడు. గత వారం క్రిందట విజయ్ తన కుటుంబంలోని ఐదుగురు సభ్యుల పేర్లతో టిటిడి లోగోతో ఉన్న నకిలీ తోమాలసేవ టిక్కెట్‌ను జులూ 3వతేదీ గురువారం(నేడు)దర్శనానికి, మరుసటిరోజు 4వతేదీ శుక్రవారం రోజుకు 6మంది భక్తులకు అభిషేకం సేవ టిక్కెట్‌ను ఇప్పించాడు. భక్తులకు అనుమానం రాకుండా ఈ టిక్కెట్లను ఓ ఇంటర్‌నెట్ దుకాణం నుండి డౌన్లోడ్ చేయించి విజయ్ మొబైల్‌కు పంపించాడు. ఇది నిజమేనని నమ్మిన విజయ్ కుటుంబం సంతోషంగా తిరుమలకు బయలుదేరారు. అయితే ఇవి నకిలీ దర్శన టిక్కెట్లు అని తెలియకపోవడంతో తిరుపతిలో ముందస్తుగా టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా పొందారు. ఈ నకిలీ దర్శన టిక్కెట్లతో తిరుమలకు వచ్చిన భక్తులు గురువారం వేకువ జామున తోమాలసేవకు హాజరవడానికి రావడంతో నకిలీవిగా తేలింది. వసతి కోసం సూట్ రూమ్ బుక్‌చేశాడని చెప్పిన బాలాజీ చివరకు ఫోన్ తీయకపోగా స్పందించలేదు. దీంతో భక్తులు మోసపోయామని గ్రహించి తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తిరుమల పోలీసులు తదుపరి జరిగిన సంఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అయితే సాధారణంగా కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి మంగళ,బుధ, గురువారాల్లోనే తోమాల, అర్చనసేవలు గృహస్థ భక్తుల మధ్య జరిపిస్తారు. మిగిలిన మూడు రోజులు ఏకాంతంగా జరిపిస్తారు. అయితే రాజ్యాంగ పరిధిలోని వివిపిల సిఫార్సు లేఖలపై పరిమితంగా ఒకటిలేదారెండు తోమాల సేవా టిక్కెట్లు, ఒకటి అభిషేకంసేవ టిక్కెట్ మంజూరవుతాయి. అలాంటిది ఏకంగా దళారీ బాలాజీ ఎక్కువమంది భక్తులకు తోమాల, అభిషేకం సేవ టిక్కెట్లు నకిలీవి సృష్టించి పంపడంతో ఇప్పుడు దళారీ దందా మరోసారి టిటిడి విజిలెన్స్‌ను ఆశ్చర్యపరిచింది.

## వ్యవసాయ శాఖలో అందుబాటులోకి వచ్చిన అజైల్ యాప్

**విజయవాడ,జూలై 3,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయ శాఖ కొత్తగా రూపొందించిన అగ్రి ఇన్‌పుట్ లైసెన్స్ ఇంజిన్ (అజైల్) యాప్‌ను అందుబాటులోకి తీసుకుని వచ్చింది . వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్ ఈ విషయాన్ని మీడియా సమావేశంలో వివరిస్తూ ఈ యాప్ ద్వారా పల్నాడు జిల్లాకు చెందిన మహిళా డీలర్‌కు ఎరువుల తయారీకి అవసరమైన తొలి డిజిటల్ లైసెన్స్ జారీ చేసినట్లు వివరించారు..విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వంటి ఇన్‌పుట్స్ వ్యాపారానికి సంబంధించిన లైసెన్స్‌ల కోసం అజైల్ ఫ్లాట్ ఫాం తప్పనిసరిగా వినియోగించాలని వ్యాపారులకు సూచించారు. ఇది సెంట్రలైజ్డ్ డిజిటల్ ఇన్‌పుట్ మేనేజ్‌మెంట్ సిస్టం అని వివరించారు.

వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ... ఈయాప్ ద్వారా అందుబాటులోకి వచ్చే పర్యవేక్షక కార్యకలాపాలను, వ్యాపారులు, రైతులకు అందుబాటులోకి వచ్చే సేవలను తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, వ్యవసాయ, ఉద్యాన వర్సిటీల వీసీలు శారదా జయలక్ష్మి,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

### మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జూలై 3,ప్రభాతవార్తప్రతినిధి:** అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం లోని పలు ప్రాంతాల్లో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు.ఇంటింటికీ వెళ్ళి ప్రజా సమస్యలను అడిగి మంత్రి తెలుసుకున్నారు. వీధి దీపాలు వెలగడం లేదని, తాగునీరు దుర్వాసన వస్తోందని మంత్రికి పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు. నెలల తరబడి వీధి దీపాలు వెలగడం లేదని మహిళలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణం వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కమీషనర్‌ను ఆదేశించారు.స్వచ్ఛమైన త్రాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్,సచివాలయం అధికారులను మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. పలు అభివృద్ధి పనులపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.సకాలంలో పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని సంబంధిత అధికారులపై మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ దీపాల నిర్వహణ,తాగునీటి సరఫరాలో అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఆదేశించారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## 6 నుంచి డిఇఇసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్

**విజయవాడ జులై 3, ప్రభాతవార్త ప్రతినిధి:** డీఈఈసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ ఈ నెల 6 నుంచి ప్రారంభించనున్నారు. మొదలి విడత కౌన్సెలింగ్‌కు సంబంధించి సీట్ మ్యాట్రిక్స్‌ను 6,7 తేదీల్లో సిద్ధం చేస్తారు. కళాశాలల ఎంపిక కోసం వెబ్ ఐచ్ఛికాలకు 8 నుంచి 12 వరకు అవకాశం కల్పించారు. సీట్ల కేటాయింపు, ప్రొవిజనల్ లెటర్ల జారీ 13 నుంచి 16 వరకు కొనసాగనుంది. డైట్లలో సర్టిఫికెట్ల పరిశీలన 17 నుంచి 22 వరకు నిర్వహిస్తారు. 25 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

## న్యాయవాదులకు రూ.4.42 కోట్ల ఆర్థిక ప్రయోజనాలు

**విజయవాడ జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** న్యాయవాదుల మరణ ప్రయోజనాలు , వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం అందించాలంటూ వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తూ ఏపీ న్యాయవాదుల సంక్షేమ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన సంక్షేమ కమిటీ సమావేశంలో హైకోర్టు, ఏపీ న్యాయశాఖ ప్రతినిధులతో పాటు ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, పి.నరసింగరావు పాల్గొన్నారు. మృతి ప్రయోజనం కింద 75 మంది న్యాయవాదుల కుటుంబసభ్యులకు రూ.3.77 కోట్లు వైద్య ఖర్చుల నిమిత్తం 85 మంది న్యాయవాదులకు ఆర్థిక సాయంలో రూ.50.40 లక్షలు, పదవీవిరమణ ప్రయోజనం కింద ఐదుగురు న్యాయవాదులకు రూ.15 లక్షలతో మొత్తం కలిపి రూ.4.42 కోట్లను మంజూరుచేసింది.

## తల్లికి వందనం రెండో విడత నగదు విడుదలకు తేదీ ఖరారు!

### - జులై 10న విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి..

**విజయవాడ,జులై 3,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం రెండో విడత డబ్బుల విడుదలకు తేది ఖరారు అయ్యింది.జులై 10న విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే లబ్ధిదారుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. తొలి విడతలో డబ్బులు వాని వారితో పాటు ఒకటో తరగతి,ఇంటర్ ఫస్ట్‌ఇయర్‌లో చేరిన వారు ఈ విడతలో లబ్ది పొందనున్నారు. మొదటి విడతలో 67.27 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందారు.ఒకటో తరగతి,ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌కు అడ్మిషన్లు ఇంకా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్కువ మంది లబ్ధి పొందేందుకు వీలుగా జులై 10న మెగా పేరెంట్-టీచర్స్ సమావేశం జరిగే రోజు రెండో విడత నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# తిరుమల సమాచారం

## జగన్ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసింది: బిజెపి ఎంపి లక్ష్మణ్



**తిరుమల,జులై 3ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గత ఐదేళ్ళ వైసిపి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరుమల పుణ్యక్షేత్ర పవిత్రతను దెబ్బతీసిందని బిజెపి ఎంపి లక్ష్మణ్ ఆరోపించారు. దేవుని లడ్డూప్రసాదంలో జరిగిన నకిలీనెయ్యి కల్తీ భక్తులను ఆందోళనకు గురిచేసిందని అన్నారు. గత ప్రభుత్వంలో తిరుమలలో జరిగిన అవినీతి,అక్రమాలపై విచారణ జరపాలని సిఎం చంద్రబాబునాయుడుకు లేఖరాస్తానని ఆయన తెలిపారు.గతంలో ఉన్న టిటిడి పాలకమండళ్ళు భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డాయని విమర్శించారు. గురువారం ఉదయం ఎంపి లక్ష్మణ్ కుటుంబం ,టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డితో కలసి తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. శ్రీవారి ఆశీస్సులందుకున్న లక్ష్మణ్‌కు ఆలయ అదికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారిసేవలో తెలంగాణ డిజి సౌమ్యామిశ్రా



**తిరుమల,జూలై 3ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం ఉదయం తెలంగాణా డిజి సౌమ్యామిశ్రా దర్శించుకున్నారు. ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులు

### 22 వాహనాలకు రూ.1.31లక్షలు జరిమానా



**తిరుమల,జూలై 3ప్రభాతవార్తప్రతినిధి:** రవాణాశాఖ, పోలీసుశాఖ సంయుక్తంగా తిరుమలలో మోటారువాహనాల నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను తనిఖీచేసి భారీగా జరిమానా విధించారు. తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజుల ఆదేశాలతో తిరుమలకు యాత్రికులను తీసుకువస్తున్న వాహనాలు అన్ని నిబంధనలు మేరకు నడుస్తున్నాయా, మోటారువాహనాల నిబంధనల ప్రకారం రికార్డులు కలిగిఉన్నారా అని జిఎన్‌సి టోల్‌గేట్‌లో తనిఖీచేశారు. ఆకస్మిక తనిఖీల్లో రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లపైన డ్రైవ్ నిర్వహించి మొత్తం 45వాహనాలు తనిఖీ చేయగా నిబంధనలు ఉల్లంఘించిన 22వాహనాలను గుర్తించి , 1,31,220రూపాయలు జరిమానా విధించారు. తిరుమలకు వచ్చే అన్ని రకాల వాహనాల రిజిస్ట్రేషన్‌నంబర్‌ప్లేట్లు హెచ్ఎస్ఆర్‌పి నిబంధనలకు లోబడి ఉండాలని రవాణాశాఖ అదికారి మురళీమోహన్ తెలిపారు. ఈ తనిఖీల్లో తిరుమల ట్రాఫిక్ సిఐ పి.హరిప్రసాద్, ఎంవిఐలు శ్రీనివాసరావు, మోహన్‌కుమార్, వెంకటరమణనాయక్ పాల్గొన్నారు.



## శ్రీవాణి దర్శన భక్తుల ఆరోపణలు బాధాకరం

### - నిర్దేశిత సమయం ప్రకారమే టిక్కెట్లు జారీ - టిబిసి గదులు పరిశుభ్రతకు బ్రాండ్

**తిరుమల,జూలై 3ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి యాజమాన్యం ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న దర్శన టిక్కెట్లలో శ్రీవాణిబ్రేక్ దర్శనాలు ఒకభాగం. ఈ టిక్కెట్ల జారీ తిరుమలలోని అదనపు ఇఒ క్యాంపు కార్యాలయం(గోకులం విశ్రాంతి భవనం) ప్రాంతంలోని కౌంటర్‌నుండి ప్రతిరోజూ ఉదయం 8.30గంటల నుండి శ్రీవాణి బ్రేక్ టిక్కెట్లు జారీ అవుతాయి. ఉదయం గంటముందు వస్తే కౌంటర్ వద్దకు భద్రత సిబ్బంది అనుమతినిస్తారు. అయితే గురువారం మధ్యాహ్నం ముగ్గురు శ్రీవాణి బ్రేక్ దర్శనాల భక్తులు దర్శనానంతరం ఆలయం వెలుపల శ్రీవాణి టిక్కెట్ల జారీలో ఆలస్యమవుతోందని, గదులు కూడా మంచివి ఇవ్వడంలేదని ఆరోపణలు చేశారు. సహజంగానే తిరుమలలో శ్రీవాణి బ్రేక్ దర్శనాల (10,500రూపాయలు)భక్తులకు అందుబాటులో ఉన్న నందకం, వకుళమాత, కౌస్తుభం, వరాహస్వామి విశ్రాంతి భవనం ఇలా ఎక్కడ గదులు లభ్యత ఉంటే అక్కడ టిటిడి అధికారులు కేటాయిస్తారు. కానీ బుధవారం తిరుమలలో కొందరు భక్తులు శ్రీవాణి బ్రేక్ దర్శనాల టిక్కెట్ల కోసం నిర్దేశిత సమయం కంటే ముందే వేకువజామున 3.30గంటలకు కౌంటర్ వద్దకు వచ్చి నిరీక్షించారు. టిక్కెట్ కోసం వచ్చిన భక్తులు నిరీక్షించారని, కనీసం అన్నప్రసాదాలు, తాగునీరు. టీ ఇవ్వలేదని మీడియాకు వెల్లడించారు. అయితే టిటిడి సిబ్బంది ఈ టిక్కెట్ల కౌంటర్‌వద్ద వేచివుండే భక్తులకు కౌంటర్‌లు తెరిచే సమయానికి సకాలంలో సమయానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. గురు,శుక్ర.శని వారాల్లో భక్తుల రద్దీ కారణంగా విఐపి బ్రేక్ దర్శనాలు లేకపోవడంతో అదికసంఖ్యలో శ్రీవాణి దర్శనాలకోసం వస్తుంటారు.ముందువచ్చిన వారికి ముందు ప్రాతిపదికలో టిక్కెట్లు జారీచేస్తారు. అలాగే వీరికి టిబిసి గదిని కేటాయించారు.

ఈ గదిలో పారిశుధ్యం సరిగాలేదని, బొద్దింకలు ఉన్నాయని అపరిశుభ్రతపై ఆరోపణలుచేశారు. ఇవన్నీ వాస్తవాం కాదని, టిబిసి గదులు మరమ్మతులు చేసి పరిశుభ్రత పాటిస్తున్నట్లు టిటిడి తెలిపింది.తిరుమలలో వసతి గదుల లభ్యత దృష్ట్యా శ్రీవాణి భక్తులు తిరుపతిలోనే ఉండి తిరుమలకు సమయానికి వస్తున్నారని టిటిడి పేర్కొంది.

అనవసరంగా సంస్థ ప్రతిష్టను దిగజార్చేలా ఆరోపణలు చేయడం చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టిటిడి యాజమాన్యం తెలిపింది.

## ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి సంసిద్ధత కార్యక్రమం

**విజయవాడ జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 1 నుంచి 6 తరగతుల విద్యార్థులకు తరగతి సంసిద్ధత కార్యక్రమాన్ని నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. సాఫీగా తరగతి మార్పు, పునాది దశ విద్య నేర్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఒకటి, రెండు తరగతులకు 45, మూడు నుంచి ఐదు తరగతులకు 30, ఆరో తరగతి విద్యార్థులకు 40 రోజుల పాటు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్‌ను బోధించాలని ఆదేశించింది. ఒకటి రెండు తరగతులకు తెలుగు, గణితం, ఆంగ్లంతోపాటు రంగులు గుర్తించడం శబ్దాలు విని స్పందించడం లాంటివి నేర్పిస్తారు. 3 నుంచి 6 తరగతులకు తెలుగు, గణితం, ఆంగ్లం ఈవీఎస్‌ను బోధిస్తారు.

## ఎపిపిఎస్సీ కేసులో మధుసూధన్‌కు రిమాండు పొడిగింపు

**విజయవాడ,జులై 3,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీపీఎస్సీ ప్రశ్నాపత్రాల అవకతవకల కేసులో ఏ2గా ఉన్న మధుసూధన్ రిమాండ్‌ను పొడిగించారు. ఈ కేసులో ఏ1గా పీఎస్సార్ ఆంజనేయులు,ఏ2గా శ్యామ్ షైన్ సంస్థ డైరెక్టర్ మధుసూధన్ ఉన్నారు. పీఎస్సార్ ఆంజనేయులు మధ్యంతర బెయిలుపై విడుదల కాగా మధుసూధన్ మంత్రం జైలులోనే ఉన్నారు. రిమాండ్ గడుదు ముగియడంతో అయన్ను ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముందు బుధవారం హాజరు పరిచారు. 16 వరకు రిమాండును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వార్త

తప్పులు చేయకుండా ఉండే శక్తి మనిషికి లేదు. కానీ తమ తప్పులు, దోషాల ద్వారా వివేకవంతులు భవిష్యత్తుకవసరమైన జ్ఞానం సంపాదించుకుంటారు.

-ఒవిడ్

# పతనం అంచున ప్రజారోగ్యం?

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే ఆశయం, లక్ష్యంకోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, దేశ ప్రజలందరికి వైద్యసేవలు అందుబాటులోకి తెస్తామని పాలకులు ఎంతగా చెప్తున్నా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్నో లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితాలు చేకూరడం లేదు. దేశానికి పట్టుగొమ్మలైన గ్రామసీమల్లో ఆరోగ్యపరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పొచ్చు. అందరికి వైద్యం అనేదిఇన్నేళ్లు దాటిపోయినా కనుచూపుమేరలో కన్పించడం లేదు. నేటికీ భారత్‌లో దాదాపు నలభైకోట్ల మందికిపైగా అత్యవసర మందులు అందుబాటులో లేవని అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. అన్నింటికంటే ప్రధానంగా దిగువ, మధ్య తరగతి పెట్టే ఖర్చులో దాదాపు డెబ్భైశాతానికిపైగా మందుల కొనుగోళ్లకే ఖర్చు చేస్తున్నారు. అందులో నాసిరకం, నకిలీవి కూడా ప్రజారోగ్యాన్ని పతనం అంచునకు తీసుకుపోతున్నాయి. దేశవ్యాప్తంగా దాదాపు ఇరవైఐదువేలకు పైగా రకాల మందులు నమోదై ఉంటే అంతకు రెట్టింపు స్థాయిలో అనధికారికంగా చెలామణి అవుతున్నాయి. ఒక వ్యూహం ప్రకారం నకిలీ,నాణ్యతలేని మందులను మార్కెట్లో ప్రవేశపెడుతున్నారు. మందుల్లో ప్రామాణికత దెబ్బతినడం వల్ల చోటుచేసుకుంటున్న అనర్థాలు అన్నీఇన్నీకావు. గతంలో నకిలీ మందులు వాడడంతో ఎందరో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ముంబయిలో నాసిరకంమందులతో డజన్ మందికిపైగా మరణించడంతో జస్టిస్ లెంటిన్ కమిషన్‌ను ఆనాటి ప్రభుత్వం నియమించింది. సమగ్ర దర్యాప్తు,అధ్యయనం అనంతరం మంత్రిత్వస్థాయి మొదలు దిగువస్థాయి వరకు ఆరోగ్య ఔషధాలలోని లొసుగులను, వైఫల్యాలను ఎత్తిచూపుతూ లెంటిన్ తన నివేదికలో స్పష్టంగా ఆనాడే పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వం కానీ, ఆ తర్వాత కానీ ఆ ప్రతిపాదనలు పట్టించుకున్నట్లు కన్పించదు. చివరకు విదేశాలకు ఎగుమతులు చేసే మందుల్లో కూడా నాసిరకం బయటపడింది. ఇంత భారీ ఎత్తున నకిలీ, నాసిరకం విస్తరిస్తున్నా అవసరమైన చర్యలు తీసుకొని నివారించడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. నకిలీ మందుల వల్ల కలిగే దుష్ఫలితాలు అటుంచి జబ్బుతగ్గకపోవడంతో వైద్యుడి వైఫల్యమా? ఉపయోగించిన మందులు కారణమా? అర్థంకాక వైద్యులు కూడా మళ్లీ మళ్లీ పరీక్షలు చేయిస్తూ ఇతర మందులతో రోగులపై ప్రయోగాలు చేస్తున్నారు. అందువల్ల రోగి ఆరోగ్యంతోపాటు ఆర్థికపరంగా కూడా కుప్పకూలిపోతున్నాడు. అసలు వైద్య,ఆరోగ్యం విషయంలో నిర్దిష్టమైన ప్రణాళికలు, ముందుచూపు లేకపోవడమే వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా అవినీతి, అంతకుమించి నిర్లక్ష్యం, ఉదాసీనతతోపాటు వైద్యఆరోగ్య రంగంలో సిబ్బంది కొరత కూడా ఈ పరిస్థితికి కారణాలనేది కాదనలేని వాస్తవం.

గత నాలుగైదు వారాలుగా దేశంలో విస్తరిస్తున్న విష జ్వరాలు, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఇటీవల దేశంలోని అనేక రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో డెంగ్యూ వ్యాధి పంజా విసురుతుంది. ఈ యేడాది తెలంగాణలో జనవరి నుంచి మార్చి చివరి నాటికి దాదాపు రెండువందల డెబ్భై కేసులు నమోదు కాగా మార్చి నుంచి జూన్ చివరి వరకు ఎనిమిదివందల డెబ్భై కేసులకుపైగా నమోదయ్యాయి. గత నెలలోనే ఐదు వందలకుపైగా కేసులు నమోదైనట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. గత యేడాది రాష్ట్రవ్యాప్తంగా పదివేల కేసులు నమోదుకాగా అందులో జులై నుంచి డిసెంబర్ వరకే తొమ్మిదివేల కేసులు రికార్డుఅయ్యాయి. ఈయేడాది ఇది మరింత విస్తరించే అవకాశం ఉందని వైద్యరంగ నిపుణులే హెచ్చరిస్తున్నారు. డెంగ్యూ వ్యాధికి నిర్దిష్టమైన చికిత్స లేదనే చెప్పొచ్చు. దీనికితోడు సోకింది మామూలు జ్వరమా? లేక డెంగ్యూనా, లేక ఇంకొకటాని తెలుసుకోవడానికే గ్రామీణులకు రోజుల తరబడి సమయం పడుతున్నది. ఈలోగా వ్యాధి ముదిరి ప్రాణాలకు ముప్పు తెస్తున్నది. వీటితోపాటు చికెన్‌గున్యా,స్వైన్‌ఫ్లూ లాంటి వ్యాధులు కూడా విస్తరిస్తున్నాయి. వాస్తవానికి సీజన్ వ్యాధుల కట్టడికి పటిష్టమైన ప్రణాళిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా నిర్దిష్టమైన అడుగులు వేస్తున్నట్లు కన్పించడం లేదు. పెరుగుతున్న వ్యాధులకు అనుగుణంగా దేశవ్యాప్తంగా పరిశీలించినా ఆస్పత్రులు కానీ, సిబ్బందిగాని లేరనే చెప్పొచ్చు. ఉన్న సిబ్బందిని కూడా మారుమూల గ్రామాలకు పంపి వైద్యసేవలు అందించడంలో పాలకులు విఫలమవుతున్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న బడుగు వర్గాల కుటుంబాలకు కనీస వైద్యం అందుబాటులోలేదు. దీంతో గ్రామాల్లో వచ్చీరాని వైద్యంతో డాక్టర్లుగాచెలామణి అవుతూ తోచినమందులు ఇచ్చేవారు కూడాతక్కువసంఖ్యలో లేరు. కనీసం మందుల పేర్లు రాయలేనివారు డాక్టర్ల జాబితాలో చేరిపోతున్నారు. చిన్నచిన్న ఆపరేషన్లు చేయడానికి వెనుకాడడం లేదు. అర్హతలేని ఇలాంటివైద్యులు చేసే చికిత్సలతో కొన్నిసందర్భాల్లో ప్రాణాలుగాలిలో కలిసిపోతున్నాయి. ఈపరిస్థితి అంతకంతకు పెరుగుతుండడం ఆందోళన కలిగించేఅంశం. ప్రపంచ ఆరోగ్యసంస్థ గతంలో విడుదలచేసిన నివేదికప్రకారం వైద్యం చేసేవారిలో యాభై ఏడు శాతానికిపైగా ఎటువంటి విద్యార్హతలు లేనివారనే విషయం బయటపడింది. అల్లోపతితోపాటు, హోమియోపతి, ఆయుర్వేదం, యూనాని, సిద్ధ, యోగా విధానాల్లో వైద్యులతో కలిపి భారత్‌లో లక్ష జనాభాకు ఎనభై నుంచి వంద మందికంటే మించిలేరు. రాబోయే రోజుల్లో ప్రజారోగ్యం అత్యంత క్లిష్టపరిస్థితులు ఎదుర్కోబోతున్నట్లువైద్య నిపుణులే అభిప్రాయపడుతున్నారు. పాలకులు ఇప్పటికైనా గత అనుభవాలతో పాఠాలునేర్చుకొని ప్రజారోగ్యంఎదుర్కోబోతున్న సవాళ్లకు అనుగుణంగా సమాయత్తం కావాలి.

ఘర్షణ వల్ల శక్తి వృథా అవుతుంది. హెచ్చుతగ్గులు వస్తాయి. ఆందోళనలు చెలరేగుతాయి. అశాంతి కలుగుతుంది.



ఐ.జాన్సన్

చీకటిలో ఉన్నప్పుడు తచ్చాడి వెలుగు కోసం ప్రయత్నించాలి గాని, ఎవరో వెలుగును ప్రసాదిస్తారని ఉన్న చోటనే ఉండకూడదు.



వీరేశలింగం

# ప్రజావాక్కు



### విచారణ జరిపించాలి

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు దగ్గరున్న పాశమైలారంలో గల సిగాచి ఫార్మాకంపెనీలో జూన్‌నెల ముగియనుండగా జరిగిన ఘోర ప్రమాదంలో ప్రస్తుతానికి నలభై రెండు మంది మరణించగా అందులో కొందరు గుర్తుపట్టలేనంతగా మాడిమసైపోయారు. ఈ ప్రమాదాలకు ముఖ్య కారణాలు మొదటిది సేఫ్టీకి ఎంత బడ్జెట్‌ను కేటాయించారు? దీనికో లెక్కుంది. దీని ప్రకారం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారా? నియమిత కాల ప్రకారం ప్రభుత్వ కార్మిక శాఖ,పరిశ్రమ యాజమాన్యం అన్ని యంత్రాలు, ఇతర సాంకేతిక పనిముట్లు లోప భూయిష్టంగా లేకుండా ఉన్నాయా? పని వారందరికి కంపెనీ వారు ఇన్స్యూరెన్స్ చేసారా? ఏడాదికోసారి పూర్తిగా బయటి నిపుణులతో నిర్వహణా కార్యక్రమాలు చేపడుతున్నారా? కార్మికులకు సంబంధిత కార్మాగారాలలో పనిచేసే సర్టిఫికెట్లు, అనుభవం ఉన్నదా? ఇలా అనేక విషయాల మీద సంపూర్ణ విచారణ జరిపించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఉపాధి హామీని అవకాశంగా తీసుకోవాలి

తెలంగాణలో బీడు భూములు దాదాపు 5 శాతం ఉన్నాయి. గాలిలో తేమ పెరిగిన నేపథ్యం లో వర్షం కూడా సమృద్ధిగా కురుస్తుంది కావున నీటి పారుదల వసతులు పెరగడం మూలంగా బీడుగా ఉన్న భూములు సాగులోకి తేవడంవల్ల రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఉపాధి హామీలో భూమి అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం వల్ల దాని చుట్టూ పండ్ల తోటలు ఉదాహరణకు కొబ్బరి లాంటి తోటల వల్ల అభివృద్ధి చేసిన భూమిలో అంతర పంటలకు ఆస్కారం వుంటుంది.

- భారత అవినాష్, జనగాం

### ఉగ్రవాదం అంతమైందా!

ఆపరేషన్ బ్లూస్టార్ సైనిక చర్యతో స్వర్ణదేవాలయంలో నక్కి ఉన్న ఉగ్రవాదులను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పారద్రోలగలిగారు. కానీ ఇందిరాగాంధీఉగ్రవాదుల చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉగ్రవాదసమస్య తీవ్రరూపం దాల్చింది. ఎంతో మంది నాయకులు,పౌరులు ఉగ్రవాదుల ఉగ్రరూపానికి బలయ్యారు. ఆపరేషన్‌బ్లూస్టార్, ఆపరేషన్ సింధూర్ వాటి వల్ల కలిగే ప్రయోజనాలు తాత్కాలికమే.

- ఎమ్.ఎస్. శర్మ, హైదరాబాద్

### లాటరీ పద్ధతిలో పాఠశాల ప్రవేశాలు

నేటితరం తల్లిదండ్రులు విద్యావంతులైనప్పటికీ తమ పిల్లలకు తీర్చిదిద్దగల సమర్థత, వాళ్లకు ఉన్నప్పటికీ సమయం వెచ్చించలేనందువలన, వారికోసం డబ్బులు సంపాదించాలనే ఒక పిచ్చి కోరికతో వారిపిల్లలను పిల్లలమాటలను,ఆలోచనలను పట్టించుకోకుండా వారిని ప్రైవేట్ స్కూళ్లలో, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తూ ఉన్నారు. కార్పొరేట్ లేదా ప్రైవేట్ స్కూల్లోని టీచర్లు పట్ల సదరు తల్లిదండ్రులకు చులకన భావం ఉంటుంది. నిజానికి తల్లిదండ్రులు చదువులు చెప్పే ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు దేవుడి కంటే ఎక్కువగా గౌరవించబడాలి. అలా గౌరవించడానికి ఇష్టం లేని నేటి తరం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు లేదా కార్పొరేట్‌స్కూల్లో చేర్పిస్తూఉన్నారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తూ ఒక అడుగు ముందుకు వేసి నిరుపేద లైన తల్లిదండ్రుల పిల్లలను ప్రైవేటు లేదా కార్పొరేట్ స్కూల్లో చేర్పించడానికి ఇష్టపడితే వారికి లాటరీ పద్ధతిలో ఎన్నిక చేసి ప్రైవేట్ పాఠశాలలకు, కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాలల నుండి పంపిస్తూ ఉన్నారు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### పర్యవేక్షణ ఉండాలి

ఇటీవలి పూరీ జగన్నాథ రథయాత్రలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన ముగ్గురు భక్తుల మృతి, 50 మందికిపైగా గాయపడటం అత్యంతవిషాదకరం. ఈతరహా సంఘటనలు మతపరమైన ఉత్సవాల్లో భద్రతా చర్యలను పునర్విమర్శించాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ప్రతి ఉత్సవానికి ముందస్తు ప్రణాళిక, సమగ్ర భద్రతా ఏర్పాట్లు అత్యవసరం. భద్రతా చర్యల్లోభాగంగా,భక్తుల ప్రవాహాన్ని నియంత్రించేందుకు టికెట్ లేదా టోకెన్ విధానం రూపొందించాలి. స్పష్టమైన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, వాలంటీర్లు ముందుగానే నియమించాలి. ఆధునిక సాంకేతిక పరికరాలు డ్రోన్లు, సీసీటీవీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వికలాంగులకు డిప్యూటేషన్ రద్దు చేయాలి

వికలాంగుల ఉద్యోగులు వారి ఇష్ట ప్రకారం వారు కోరుకొంటేనే డిప్యూటేషన్‌లో పంపాలి. కానీ బలవంతంగా పంపవద్దు. వారు దృష్టి లోపంతో, వివిధ రకాల వైకల్యంతో బాధపడుతున్నారు. ఒక సంవత్సర కాలం కూడా పూర్తి కాకముందే డిప్యూటేషన్ అని అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బాలల్లో 'మానసిక ఆరోగ్యం' పెంచాలి

గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య సలహాలు (కౌన్సిలింగ్) అందుబాటులోకి తేవాలి. కథా వేదికలు,ఆటల పండుగలు నిర్వహించాలి. పల్లెల్లో పిల్లల క్లబ్‌లు, కథా వనాలు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. చైతన్య కార్యక్రమాలు జరగాలి. నేరరహిత సమాజాన్ని నిర్మించాలంటే చిన్నతనం నుండే పిల్లలకు విలువలు, సంస్కారంతో కూడిన నడవడికకు అలవాటు చేయాలి. బాల్యం మొగ్గ లాంటిది. దానిని ఎలా పెంచుతామో అలాగే అది వికసిస్తుంది. ప్రేమతో, సహనంతో, మంచి విలువలతో బాల్యాన్ని బలంగా తీర్చిదిద్దితే రేపటి సమాజం కూడా బాగుంటుంది. తిరిగి రానిది ఎంతో మధురమైనది బాల్యం. దానిని వ్యసనాలకు బానిసలుగా మార్చుకొని భవిష్యత్తును అంధకారంగా మార్చుకోకండి. నేటి బాలలే రేపటి దేశ భవిషత్తు. అలాంటి భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరికీ, వ్యవస్థలకు వుంది. బాల్యాన్ని జ్ఞాపకంగా మార్చుకోండి గాయంగా కాదు.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు మనల్ని తీవ్ర ఆవేదనలో ముంచుతున్నాయి. ఫోన్ ఇవ్వలేదని, మొబైల్‌లో గేమ్ ఆడనివ్వలేదని 12, 14, సంవత్సరాల పిల్లలు ప్రాణాలు తీసుకోవడం, తన ప్రేమకు అడ్డు వస్తుందని ఒక బాలిక వాళ్ల తల్లిని చంపడం, వంటివి ఎన్నో సంఘటనలు నిత్యం నేటి సమాజంలో జరుగుతున్నాయి, వీటిని మనం ఎప్పుడైనా ఊహించమా? ఒక్కసారి ఆలోచించండి – ఏ వయసులో జీవితం ప్రారంభించాలో ఆ వయసులోనే జీవితం ముగింపు చూపడం ఎలాంటి ప్రమాదకర పరిస్థితికి సంకేతం?. పిల్లలను చిన్నతనం నుండి పద్ధతిగా పెంచకుండా, విలువలు నేర్పకుండా, మంచి చెడు చెప్పకుండా పెంచితే వారు పెద్దవాళ్ళు అయ్యాక దాని పర్యవసానలు చాలా ప్రమాదకరంగా ఉంటాయి. అవి కుటుంబం మీదే కాకుండా సమాజం మీద కూడా చెడు ప్రభావాన్ని చూపిస్తాయి. ఒకప్పుడు అమ్మ చందమామను చూపిస్తూ అన్నం తినిపించేది ఇప్పుడు మొబైల్ చూపిస్తూతినిపిస్తుంది. అదే వ్యసనంగా మారి పిల్లలలో మానసిక వైకల్యానికి దారి తీస్తుంది. తల్లిదండ్రులు తమ ప్రశాంతత కోసం పిల్లలకు మొబైల్ ఫోన్లు అలవాటు చేస్తే భవిష్యత్‌లో ఎవ్వరికీ ప్రశాంతత లేకుండా చేస్తున్నారనేది నిజం. దానితో పాటు నేడు పాఠశాల, కళాశాలల స్థాయిలోనే పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి టీనేజ్ వయసు కూడా దాటక ముందే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడం, నేరస్తులుగా మారడం అనేది కూడా ఆందోళన కలిగించే అంశం. ఇది ప్రతీ ఇంట్లో, సమాజంలోనూ, దేశంలో బలంగా చర్చించాల్సిన అంశం. బాల్యం అనేది ఒక వ్యక్తి జీవితానికి పునాది. అది బలంగా విలువలతో కూడి ఉంటేనే మనిషి మంచి జీవితాన్ని నిర్మించుకోగలడు. కానీ అదే బాల్యం దారి తప్పితే జీవితం దిక్కుతెలియని దారిలో నడుస్తుంది. అదే కాకుండా కుటుంబం, సమాజం, దేశం కూడా దాని పర్యవసానాలు ఎదుర్కొంటుంది. ఒకప్పుడు మట్టిలో ఆడిన బాల్యం ఇప్పుడు స్క్రీన్‌లోనే బంధించబడింది. చెట్టు కింద కథలు విన్న ఆ రోజులు.. ఇప్పుడు ఆన్లైన్ ఆటలతో సాగిపోతోంది స్నేహితులతో పెట్టిన ముచ్చట్లు నవ్వుకున్న రోజులు ఇప్పుడు సోషల్ మీడియా మాయలో కనుమరువుతున్నాయి. పిల్లలకు నీతి కథలు చెప్పేవారు కరువయ్యారు,

జి. అజయ్ కుమార్

ఉమ్మడి కుటుంబాలు లేక పెద్దవారి పర్యవేక్షణ లోపించి పిల్లలలో మానసిక వికాసాన్ని పెంపొందించే విధానం లోపించింది. మొబైల్ స్క్రీన్ బానిసత్వం ఒంటరితనం, మూడ్ స్వింగ్స్ మానసిక ఒత్తిడి, డిప్రెషన్ మత్తుపదార్థాల వ్యసనం, చిన్న వయసులో ఆత్మహత్యల యత్నాలు, నేరపూరిత స్వభావం ఈ పరిస్థితులన్నీ మాటల్లో చెప్పదగ్గవే కాదు. గణాంకాలు కూడా చెబుతున్నాయి. ఇటీవల ఒక సంస్థ లెక్కల ప్రకారం 12-17 ఏళ్ల వయసు పిల్లల్లో 26 మంది డిజిటల్ అడిక్షన్ బారినపడ్డారు. వారిలో డిప్రెషన్




కేసులు కూడా 40వరకు పెరిగాయి. రోజుకి 2 గంటలకంటే ఎక్కువ స్క్రీన్ టైమ్ వల్ల పిల్లల్లో మానసిక స్థిరత్వపై తీవ్రమైన ప్రభావం పడుతోంది. దీనివలన మానసిక కుంగుబాటు, ఒంటరితనం, ఆత్మహత్య అలోచనలు కలుగుతాయి. చైల్డ్ లైన్ నివేదిక ప్రకారం బాలలపై వేధింపుల కేసులు 300వరకు పెరిగాయి. యూనిసెఫ్ లెక్కల ప్రకారం భారత దేశంలో మత్తుపదార్థాల తొలిసారి వినియోగం వయస్సు – సగటున 11.5 ఏళ్లు అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పిల్లల్ని ఏడవకుండా ఉంచేందుకు ఫోన్ ఇవ్వడం ప్రేమను పంచకుండా స్క్రీన్‌ని ప్రత్యామ్నాయంగా ఉపయోగించడం, ఎప్పుడూ బిజీగా ఉండి వారితో రోజుకు కొంత సమయం కూడా గడపకపోవడం, పిల్లలకు వ్యక్తిగత గదులు ఇచ్చి వాళ్ళు ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, వంటివి పట్టించుకోకపోవడం, మార్కులు, ర్యాంకుల మాత్రమే ప్రాధాన్యంగా నడిచే విద్యాసంస్థలు ఆటలకు, భావోద్వేగాలకు, విలువలు నేర్పడానికి మొగ్గు చూపకపోవడం విలువలతో కూడిన విద్యాబోధన లేకపోవడం, విద్యాలయాల్లో పిల్లలు ఎంచేస్తున్నారు, చేడుఅలవాట్లకు ఏమన్నా బానిసలుగా మారుతున్నారా అనే పర్యవేక్షణ లేకపోవడం, హింసాత్మక, అసభ్య కంటెంట్ సులభంగా అందుబాటులో ఉండటం, ప్రతి ఇంట్లో ఇంటర్‌నెట్ అందుబాటులోకి రావడం, పిల్లలు ఏం చూస్తున్నారో తల్లిదండ్రులు పట్టించుకోవడం వల్ల వారికి స్వేచ్ఛ పెరగడం, గేమ్స్, రీళ్లు మానసికంగా కలుషితపరచడం,పిల్లల ఆటలకు స్థలాల లేమి, మితిమీరిన పోటీ వాతావరణం, పిల్లల ప్రవర్తనను గమనించకుండా పెద్దలు తమ జీవితాల్లోనే బిజీగాగడపడం, ఇలాంటి దుష్పరిణామాలకు కారణంగా ఉన్నాయి. పిల్లులు మొబైల్ చూసే స్క్రీన్ టైమ్‌పై పరిమితి విధించాలి పిల్లలతో రోజూ కనీసం 1 గంట కలసి గడపాలి. ప్రేమతో కూడిన సంభాషణలు, విలువల బోధన అవసరం. ప్రకృతి, పుస్తకాలు, ఆటలవైపు వారిని ప్రోత్సహించాలి. విలువల బోధనను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి. ఆటలు తప్పనిసరి భాగంగా ఉండాలి. పిల్లల మనోభావాలను గుర్తించి ఆ దిశగావిద్యార్థులను ప్రోత్సహించాలి. హానికర కంటెంట్‌పై నియంత్రణ విధించాలి. స్క్రీన్ టైమ్ నియంత్రణ విధానాలు పెట్టాలి. గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య సలహాలు (కౌన్సిలింగ్) అందుబాటులోకి తేవాలి. కథా వేదికలు,ఆటల పండుగలు నిర్వహించాలి. పల్లెల్లో పిల్లల క్లబ్‌లు, కథా వనాలు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. చైతన్య కార్యక్రమాలు జరగాలి. నేరరహిత సమాజాన్ని నిర్మించాలంటే చిన్నతనం నుండే పిల్లలకు విలువలు, సంస్కారంతో కూడిన నడవడినకు అలవాటు చేయాలి. బాల్యం మొగ్గ లాంటింది. దానిని ఎలా పెంచుతామో అలాగే అది వికసిస్తుంది. ప్రేమతో, సహనంతో, మంచి విలువలతో బాల్యాన్ని బలంగా తీర్చిదిద్దితే రేపటి సమాజం కూడా బాగుంటుంది. తిరిగి రానిది ఎంతో మధురమైనది బాల్యం. దానిని వ్యసనాలకు బానిసలుగా మార్చుకొని భవిష్యత్తును అంధకారంగా మార్చుకోకండి. నేటి బాలలే రేపటి దేశ భవిషత్తు. అలాంటి భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరికీ, వ్యవస్థలకు వుంది. బాల్యాన్ని జ్ఞాపకంగా మార్చుకోండి గాయంగా కాదు. •

# విమానయానంపై బెదురు తగ్గాలంటే..

ఐ.ప్రసాదరావు

అహ్మదాబాద్ విమానం ప్రమాదంలో దాదాపు 274 మంది మరణించడంతో ముఖ్యంగా మన భారతదేశంలో విమాన ప్రయాణం చేసే వారిలో ఒక్కసారిగా 'ఫ్లయిట్ ఫియర్' పెరిగింది. దీంతో ఒక్కసారిగా నలభై శాతం విమాన ప్రయాణం చేసే వారు తాము చేసుకున్న టికెట్ బుకింగ్స్ క్యాన్సిల్ చేసుకోవడం జరుగుతుంది. దీనికితోడు ప్రయాణించే విమానాలు తరచూ వివిధ కారణాల వల్ల చేరవలసిన గమ్యస్థానాలకు చేరకుండా వెనుదిరిగడం లేదా వేరే విమానాశ్రయాల్లో అత్యవసర ల్యాండింగ్ జరగడం వల్ల విమాన ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణం చేయడం అంటే భయపడే పరిస్థితికి వచ్చింది. ఇటీవల విమాన ప్రయాణం చేసే వారు, విమానాలకు సంబంధించిన పూర్తి వివరాలు అనగా విమానం తయారుచేసిన కంపెనీ,మోడల్, వాటి పూర్తి చరిత్ర తెలుసుకుని టికెట్ బుకింగ్స్ చేసుకోవడం జరుగుతుంది.' డ్రీమ్ లైనర్' విమానం అంటే ఆమదదూరం పారిపోతున్న పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా ఎయిర్ ఇండియా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.. ప్రయాణికులకు భరోసా కల్పించాలి. ముఖ్యంగా అన్ని విషయాల్లో అన్ని సంస్థల విమానాలు డి.జి.సి.ఏ గైడ్లెన్స్ తూ.చ తప్పకుండా పాటించాలి. తరచూ విమానాలను తనిఖీ చేయాలి. ముఖ్యంగా మనదేశంలో ఉన్న విమానాశ్రయాల పరిసరాల్లో అనేక చర్యలు తీసుకోవాలని. విమానాశ్రయాల చుట్టుప్రక్కల నివాసప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలి. అదే సమయంలో విమానాల ఫిట్నెస్‌పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. టైర్లు, ఇంధనం, ఇంజన్లు తదితర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. సాంకేతిక సమస్యలపై దృష్టి సారించాలి. సిబ్బంది, పైలెట్లు స్థితిగతులు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ఒత్తిడి లేకుండా చూడాలి. ప్రస్తుతం సంవత్సరానికి 40 కోట్లకు పైబడిన సంఖ్యలో ప్రయాణాలు నమోదు అవుతున్నాయి. రోజూ లక్షల సంఖ్యలో ప్రయాణికులు విమానయానం చేస్తున్నారు. 'ఉడాన్' పథకం ద్వారా విమానయానానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, దేశంలో అనేక చోట్ల నూతన విమానాశ్రయాలు నిర్మిస్తున్నారు. కొత్త కొత్తవిమాన సర్వీసులు ప్రారంభిస్తున్నారు. నిమిషాలు, గంటల వ్యవధిలో దూర ప్రాంతాలకు చేరేవిధంగా వివిధ చర్యలు రూపకల్పన చేస్తున్నారు. ఏవియేషన్ దగ్గర అందరికీచేరవుతుంది.




గతంలో ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండే విమానప్రయాణం ఇటీవల కాలంలో సామాన్యులకు కూడాఅందుబాటులోకి వచ్చింది. ముఖ్యంగా సాఫ్ట్వేర్‌రంగం ఊపుఅందుకోవడం వలన విమాన ప్రయాణం సులభతరం అవుతుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం చదువుకున్న వారు దేశంలో వివిధ పెద్దపెద్ద నగరాలకు, పట్టణాలకు వెళ్ళటంవలన, త్వరితగతిన వెళ్ళడానికి విమాన ప్రయాణాన్ని వాడుతున్న పరిస్థితి. అదే సందర్భంలో చదువుల నిమిత్తం, వ్యాపారాల నిమిత్తం, ఉద్యోగ ఉపాధి అవకాశాల నిమిత్తం, దేశవ్యాప్తంగా పల్లెటూరి నుంచి పట్టణాల నుంచి దేశ విదేశాలకు ప్రజలకు వలస వెళ్లడం ప్రారంభమైంది. దీనికి విమానయానం అత్యవసరంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో విమాన ప్రమాదాలు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇకనైనా తగు భద్రతా చర్యలు తీసుకోవాలి. ఒకప్పుడు దూర ప్రాంతాలకు వెళ్ళాలన్నా, విదేశాలకు వెళ్ళాలన్న నౌకాయానమే సాధనం. కానీ కాలానుగుణంగా విమానయానం త్వరితగతిన దాదాపు అన్ని చోట్లకు అందుబాటులోకి వచ్చింది. అవసరాలు పెరిగాయి. కొంతమేరకు ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఆకాశమే హద్దుగా అందరూ ఆకాశయానం అనగా విమానయానం ద్వారా ప్రపంచ దేశాలను చుట్టేస్తున్నారు. ఇక ఇటీవల కాలంలో 'టూరిజం' ఒక ఫ్యాషన్‌గా మారింది. దీంతో అవకాశం ఉన్నవారు అందరూ దేశంలో వివిధ ప్రాంతాలకు, అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాలకు పర్యటనకు వెళుతున్నారు. దీనికి ప్రధాన కారణం 'విమానయానం' అందుబాటులోకి రావడమే. ఇక భవిష్యత్తు అంతా 'టూరిజమే' అంటున్న ప్రస్తుత తరుణంలో విమాన రంగాన్ని అభివృద్ధి పరుచుకోవాలి. ఆధునిక విమానాలు, సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం తోపాటుప్రయాణికులకు భద్రత కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానికి, విమానయాన సంస్థలకు, రక్షణ సంస్థలకు, ఎయిర్ లైన్స్ సంస్థలకు, సంబంధిత ప్రభుత్వ సంస్థలపై ఉంది. ఇప్పుడే ఊపు అందుకున్న విమాన సర్వీసులు, విమాన ప్రయాణికులకు భరోసా కల్పించాలి. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఎయిర్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రతిష్టాత్మకంగా చర్యలు తీసుకోవాలి. ప్రయాణికుల్లో ప్రబలుతున్న 'ఏవియో( ఏరో) ఫోబియా' కు ఫుల్‌స్టాప్ పెట్టాలి. ప్రయాణికులు కూడా భయాందోళనలకు గురి కాకూడదు. ముఖ్యంగా మానసిక ధైర్యాన్నిఇనుమడింపచేసుకోవాలి. ధైర్యంగా ముందుకు సాగాలి. అవసరమైన సందర్భాల్లో వైద్య నిపుణులను సంప్రదించాలి. సాధ్యమైనంత త్వరలో మన విమానయానం గాడిలో పడుతుంది అని ఆశిద్దాం. ఆ విధంగా పటిష్టమైన చర్యలు ప్రభుత్వం, విమానయాన సంస్థలు తీసుకుంటాయని ఆశిద్దాం. •

# విద్యలో విప్లవాత్మక మార్పులు ఏఐతో సాధ్యమా?



డాక్టర్ మోటె చిరంజీవి

విద్యార్థుల్లో చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి సామర్థ్యాలు పెంపొందించేందుకు ఏఐ ఎంతగానో దోహదపడనుంది. వారి సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచే విధానంలో ఎంతో ఉపయోగపడుతుంది. ఇంతకు ముందు ప్రాథమిక విద్యార్థులకు కనీస అభ్యర్థన సామర్థ్యాల పెంపునకు ఫౌండేషనల్ లిట రసీ న్యూమర్సీ (ఎఫ్ఎల్ఎన్) ప్రోగ్రామ్‌ను అమలు చేశారు. ఇప్పుడు, మరోసారి ఏఐ విద్యతో విద్యార్థుల్లో మరింత నైపుణ్యాలు మెరుగుపడతాయని యోచిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచాన్ని శాసించే దిశగా పయనిస్తున్న అత్యాధునిక సాంకేతికత కృత్రిమ మేధ (ఏఐ) యుగంలో జీవిస్తున్నాం. ఈ మధ్యకాలంలో విడుదలవుతున్న దాదాపు ప్రతి సాధనం (సాఫ్ట్‌వేర్) ఏఐ వెర్షన్‌ను అందిస్తూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం, ప్రతి ఇద్దరు భారతీయుల్లో ఒకరు ఏదో ఒక రూపంలో ఏఐ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. విద్యలో ఏఐ (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) అనేది విద్యార్థులకు అభ్యాస అనుభవాలను వ్యక్తిగతీకరించడానికి ఎక్కువగా ఉపయోగించబడుతోంది. ఇది వారి నైపుణ్యాలు, ఆసక్తులు అభ్యాస శైలుల ఆధారంగా రూపొందించబడిన విద్యా కంటెంట్‌ను అందిస్తుంది. ఏఐ విద్యార్థుల పనితీరు డేటాను విశ్లేషిస్తుంది అభ్యాస ఇబ్బందులు లేదా అవగాహనలో అంతరాలను గుర్తిస్తుంది. బ్రిటానికా ఎడ్యుకేషన్ పరిశోధనల ఆధారంగా, మొదటి ఏఐ ప్రోగ్రామ్ 1951లో వ్రాయబడింది. 1950లలో, బ్రిటిష్ లాజిషియన్ కంప్యూటర్ మార్గదర్శకుడు అలాన్ ట్యూరింగ్ ఒక యంత్రానికి ఆలోచించే సామర్థ్యం ఉందా అని ప్రశ్నించాడు. ఏఐ కేంద్ర భావనలను ప్రవేశపెట్టాడు. తరువాతి దశాబ్దాలలో సాంకేతికత ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతూనే ఉంది. ఈ విధంగా తరగతి గదిలోకి ప్రవేశించింది. తరువాతి దశాబ్దాలలో సాంకేతికత తరగతి గదికి ప్రవేశించడంతో, కె 12 విద్యలో విశ్లేషణలకు ఏఐ పరివర్తన కలిగిస్తుందని నిరూపించబడింది. ఏఐ ఆధారిత సాధనాలతో ఈ పెరిగిన వినియోగం విద్యా, పర్యావరణ వ్యవస్థకు బోధన అభ్యాస అవకాశాలను ప్రభావితం చేసింది. ఒకే రకమైన అభ్యాసన పద్ధతులు విద్యార్థులకు భిన్నంగా నేర్చుకుంటున్నందున నిరాశ కలుగుతుంది. విద్యార్థులకు సంబంధిత లేదా ఆసక్తికరమైన విషయం దొరకకపోవడంతో వారు నిరాశకు లోనవుతారు. తరగతితో ముందుకు సాగడానికి విద్యార్థులకు తరచుగా కొన్ని



అంశాలపై అదనపు సహాయ సహకారాలు అవసరం అవుతాయి. మానవుల వలె ఆలోచించడానికి నేర్చుకోవడానికి రూపొందించబడిన, ప్రోగ్రామ్ చేయబడిన కంప్యూటర్లలో కృత్రిమ మేధస్సు మానవ మేధస్సును ప్రేరేపిస్తుంది. ప్రస్తుతం, స్మార్ట్ కంటెంట్ అభివృద్ధి అనుకూలీకరించిన ట్యూటరింగ్ నుండి ఆటోమేటిక్ గ్రేడింగ్, వర్చువల్ తరగతి గదుల వరకు విద్యకు సంబంధించిన వివిధ రంగాలకు ఏఐ వర్తించబడుతుంది. ఇటువంటి సాంకేతికత, సాంప్రదాయ బోధనా పద్ధతులను విప్లవాత్మకంగా మార్చడమే కాకుండా, మొత్తం అభ్యాస ప్రక్రియ ప్రాధాన్యతను మరింత పెంచడానికి అడ్డంకులను కూడా తొలగిస్తున్నాయి. సాంప్రదాయ బోధన విద్యార్థులు తమ సందేహాలకు వివరణ కోరుకోవడానికి తరగతి గది సమయంపై ఆధారపడి ఉంటుంది. ఉపాధ్యాయులు పాఠాలతో ముందుకు సాగే ముందు ప్రశ్నలను పరిష్కరించడానికి నిర్దిష్ట సమయాన్ని కేటాయిస్తారు. కృత్రిమ మేధస్సు ఏకీకరణతో, ఉపాధ్యాయులు వర్చువల్ అప్లికేషన్ల ద్వారా రియల్‌టైమ్ సహాయాన్ని అందించడం ద్వారా ఈ ప్రక్రియను మెరుగు పరచవచ్చు. ఇది విద్యార్థులకు అవసరమైనప్పుడల్లా తక్షణ సహాయం పొందడానికి వీలు కల్పిస్తుంది. తరగతి గదిబోధనను పూర్తి చేస్తుంది. ఉపాధ్యాయులు తరగతి సమయంలో మరింత లోతైన చర్చలు, వ్యక్తిగతీకరించిన మద్దతుపై దృష్టి పెట్టడానికి వీలు కల్పిస్తుంది. ఇంగ్లీష్,మ్యాథ్స్ సబ్జెక్టులను పిల్లలకు సంపూర్ణంగా అర్థం అయ్యేలా బోధించాలని గత విద్యా సంవత్సరం (2024-2025) చివరిలో నిర్ణయించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఏక్ స్టెప్ ఫౌండేషన్ సహకారంతో ప్రయోగాత్మకంగా పలు జిల్లాల్లో ఏఐ ఆధారిత బోధనను విద్యాశాఖ స్టార్ట్ చేసింది. రాబోయే విద్యా సంవత్సరంలో వందల స్కూల్లో దాన్ని అమలు చేయనున్నారు. అందుకోసం యాభై మందికి మించి విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు అందించాలని విద్యాశాఖ ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లో విద్యార్థులు వారి నైపుణ్యాలు మరింత మెరుగుపర్చుకునేలా వారి సామర్థ్యాన్ని పెంచేందుకు సర్కార్ వివిధ రకాలుగా పథకాలను సృష్టిస్తున్నారు. అంతేకాకుండా, విద్యార్థులకు వివిధ కోర్సులను, సబ్జెక్టులను కూడా బోధిస్తున్నారు. వారి పరిజ్ఞానం, నైపుణ్యం పెరిగేందుకు చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా రాష్ట్రంలోని సర్కార్ బడుల్లో విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యార్థులు అధ్యాపకులు తెలియని విషయాలను తెలుసుకోవడం జరుగుతుంది. కృత్రిమమేధా ద్వారా తెలుసుకొని జ్ఞానాన్నిపొందుతున్నారు. భవిష్యత్తులో కూడా దీని ఉపయోగం, వినియోగం ఎక్కువగా అవసరమవుతుందని మేధావులు యోచిస్తున్నారు. విద్యా సంస్థల స్థాయిలో డిజిటల్ పౌరసత్వం అనే అంశాన్ని పాఠ్యాంశాల్లో ప్రవేశపెట్టాలి. తల్లిదండ్రులు పిల్లల మొబైల్ వాడకాన్ని పర్యవేక్షించి,సరైన మార్గనిర్దేశనంచేయాలి. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి, అశ్లీలతకు బలపడేకంటెంట్‌ను ప్రోత్సహించకూడదు. •

# కొవిడ్ టీకాపై ఆందోళన వద్దు



## ఆకస్మిక మరణాలకు ఆ టీకాతో సంబంధం లేదు..

## వ్యాక్సిన్లు పూర్తిగా సురక్షితం: సీరమ్ ఇన్‌స్టిట్యూట్, ఎయిమ్స్

**న్యూఢిల్లీ,జులై 3:** కొవిడ్ వ్యాక్సిన్‌లపై మరోసారి ఆందోళనలు నెలకొంటున్న వేళ ప్రముఖ టీకాల తయారీ సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) స్పందించింది.వ్యాక్సిన్లు సురక్షితమేనని, శాస్త్రీయంగానూ రుజువైందని స్పష్టం చేసింది. ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలకు మధ్య సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే రెండు సమగ్ర అధ్యయానల్లో తేలిక విషయాన్ని గుర్తు చేసిన సీరమ్.. వాటిని ధ్రువీకరిస్తున్నామని పేర్కొంది. కర్ణాటకలోని హాసన్ జిల్లాలో గుండె సంబంధిత సమస్యలతో ఇటీవల నెల రోజుల వ్యవధిలోనే 20 మంది మరణించడాన్ని కొవిడ్ టీకాతో ముడిపెడుతూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆందోళనలకు దారితీశాయి. వీటిపై కేంద్ర ఆరోగ్య శాఖ ఇప్పటికే స్పష్టతనివ్వగా తాజాగా ఎయిమ్స్ వైద్యులు కూడా టీకాల పనితీరుపై మాట్లాడారు.

**టీకాలతో సంబంధం లేదు: గులేరియా**

'ఆకస్మిక గుండెపోటు కారణంగా యుక్తవయసు వారు చనిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. వీటిపై ఇప్పటికే అధ్యయనాలు జరిగాయి. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసిఎంఆర్), ఎయిమ్స్ ఆధ్వర్యంలో జరిగిన రెండు సమగ్ర అధ్యయనాల్లో ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలకు సంబంధం లేదని తేలింది. అన్ని టీకాలు, ఔషధాలతో కొన్ని దుష్పరిణామాలు ఉన్నట్లే.. ఈ టీకాలకు కొన్ని ఉంటాయి. కానీ, గుండెపోటు మరణాలకు వీటికి సంబంధం లేదు. ఈ విషయాన్ని ఏ అధ్యయం వెల్లడించ లేదు' అని ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ డా. రణ్‌దీప్ గులేరియా పేర్కొన్నారు.

**ఎటువంటి హాని లేదు: డాక్టర్ రాజీవ్ నారంగ్**

'గుండెపోటుకు సంబంధించి యువకులు, వృద్ధులకు కారణాలు వేరుగా ఉంటాయనే విషయం మనందరికీ తెలుసు. వాస్తవానికి ఆకస్మిక గుండెపోటు ముప్పు కొవిడ్ టీకాలు తీసుకున్న వారికి తక్కువగా ఉన్నట్లు ఐసిఎంఆర్, ఎయిమ్స్ అధ్యయనాల్లో తేలింది. కొవిడ్ వ్యాక్సిన్‌తో ప్రయోజనం తప్ప ఎటువంటి హాని లేదని స్పష్టంగా రుజువైంది' అని ఎయిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ వెల్లడించారు. మరోవైపు యుక్తవయసువారి ఆకస్మిక మరణాలకు జీవనశైలి,ముందస్తు ఆరోగ్య సమస్యలే కారణం తప్పితే కొవిడ్ వ్యాక్సిన్ కాదని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. దేశీయంగా తయారైన కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తున్నాయని, తీవ్ర దుష్పరిణామాలు సంభవించిన ఉదంతాలు అత్యంత అరుదుగా కనిపించాయని ఐసిఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం (ఎన్‌సిడిసి) అధ్యయనాలు వెల్లడించినట్లు వివరించింది.



# హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం..

## -ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

**టెల్అవీవ్, జులై 3:** హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. గాజాలో 60 రోజులపాటు కాల్పుల విరమణకు అవసరమైన షరతులను ఇజ్రాయెల్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తరుణంలో ఈ స్పందన వచ్చింది. 'హమాస్ ఉండదు.. హమస్థాన్ ఉండదు. ఆ విషయంలో మేం వెనక్కి తగ్గబోం. ఆ సంస్థను తుడిచి పెట్టేస్తాం' అని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ నెతన్యాహు వ్యాఖ్యలు చేశారు. యుద్ధాన్ని నిలువరించడానికి ఈజిప్టు, ఖతార్‌నుంచి వస్తున్న కాల్పుల విరమణ ఒప్పందాలను హమాస్ పరిశీలిస్తున్నదశలో ఈవ్యాఖ్యలుచేయడం గమనార్హం. కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ఓకే చెప్పిందని, హమాస్ కూడా అంగీకరించాలని ఇటీవల ట్రంప్ ప్రతిపాదించారు. అందుకు తాము సిద్ధమేనని చెప్పిన హమాస్.. గాజాపై యుద్ధాన్ని శాశ్వతంగా ఇజ్రాయెల్ ముగిస్తామంటేనే సంధి చేసుకుంటామని స్పష్టం చేసింది. గాజా భూభాగాల నుంచి ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వెనక్కి వెళితే దానికి బదులుగా మిగిలిన 50 మంది బందీలను విడుదల చేస్తామని తీవ్రవాద సంస్థ ప్రతినిధి తాహెర్ అల్‌-నును తెలిపారు. యుద్ధాన్ని ముగిస్తామంటే చర్చలకు సిద్ధమేనని వెల్లడించారు. అయితే, ఆయుధాలు అప్పగించి హమాస్ లొంగిపోవాలని పాలస్తీనాను వీడి వెళ్లిపోవటానికి అంగీకరిస్తేనే 60 రోజుల కాల్పుల విరమణకు అంగీకరిస్తామని ఇజ్రాయెల్ తెలిపింది. యుద్ధానంతరం గాజాలో హమాస్ కనిపించడానికి వీల్లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు.

# వైట్‌హౌస్‌నుంచి జుకర్‌బర్గ్‌ను బయటకు పంపించేసారా?

## ట్రంప్‌పై వైరల్ అవుతున్న సంచలన కథనాలు

**వాషింగ్టన్,జులై 3:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కీలకమైన సమావేశంలో ఉండగా మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ అనూహ్యంగా ప్రత్యక్షం కావడం, ఆయన్ను బయటకు పంపించేశారంటూ భారీ ఎత్తున ప్రచారంలోకి వచ్చింది. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో ఈ ఘటన జరిగినట్టు తెలుస్తోంది. అయితే, ఈ ఆరోపణలను అప్పటి వైట్‌హౌస్ వర్గాలు తోసిపుచ్చడంతో అసలు ఏం జరిగిందనే దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఓవల్ ఆఫీస్‌లో డొనాల్డ్ ట్రంప్ అమెరికా వైమానిక దళానికి చెందిన ఉన్నతాధికారులతో తర్వాతి తరం యుద్ధ విమానాల గురించి అత్యంత రహస్యంగా చర్చిస్తున్నారు. ఆ సమయంలో మార్క్ జుకర్‌బర్గ్ హఠాత్తుగా సమావేశంలోకి వచ్చారని మీడియా వార్తలొచ్చాయి. అత్యంత కీలకమైన ఈ భేటీలో పాల్గొనేందుకు జుకర్‌బర్గ్‌కు ఎలాంటి భద్రతా అనుమతులు లేవు. దీంతో ఆయన్ను అక్కడ చూసిన సైనిక అధికారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారని ఆ కథనం తెలిపింది. పరిస్థితిని అర్థం చేసుకున్న అధికారులు, సమావేశం కొనసాగించడానికి వీలుగా జుకర్‌బర్గ్‌ను గదిలో నుంచి బయటకు వెళ్లి వేచి ఉండాల్సిందిగా కోరినట్టు సమాచారం. ఓవల్ ఆఫీస్‌లో గోప్యత కొరవడటంపై అధికారులు ఆశ్చర్యపోయారని ఒక అధికారి ఈ పరిస్థితిని 'వింత ప్రపంచంలా ఉంది' అని వ్యాఖ్యానించారు. సమావేశం నుంచి జుకర్‌బర్గ్‌ను బయటకు పంపించారనే వార్తల్లో వాస్తవం లేదని, అసలు విషయాన్ని తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆయన తెలిపారు. అధ్యక్షుడు ట్రంప్ అభ్యర్థన మేరకే జుకర్‌బర్గ్ కేవలం పలకరించడానికి మాత్రమే లోపలికి వచ్చారని ఆ అధికారి వివరించారు. సైనిక అధికారులతో సమావేశం ముగిసిన తర్వాత జుకర్‌బర్గ్‌తో ట్రంప్‌కు వేరేభేటీ ఖరారైందని, అందుకే పలకరించి బయటకు వెళ్లి తన మీటింగ్ కోసం వేచి ఉన్నారని స్పష్టం చేశారు.



# అమెరికాలోని షికాగోలో కాల్పులు..

## నలుగురు మృతి, 14 మందికి గాయాలు!

**వాషింగ్టన్, జులై 3:** అమెరికాలోని షికాగోలో కాల్పులు కలకలం రేపాయి. ఓ గుర్తు తెలియని దుండగుడు జరిపిన కాల్పుల్లో నలుగురు మృతి చెందగా 14 మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చికాగోలోని రివర్ నార్త్ పరిసరాల్లో ఉన్న ఓ రెస్టారెంట్ దగ్గర ఓ ఆల్బమ్ రిలీజ్ పార్టీ జరుగుతోంది. అదే సమయంలో అక్కడ లాంజ్‌లో ఉన్న వారిపై ఓ దుండగుడు కాల్పులు జరిపి పారిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. మొత్తంగా 13 మంది మహిళలు, అయిదుగురు పురుషులపై కాల్పులు జరగ్గా వీరిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. బాధితుల వయసు 21-32 మధ్య ఉందని వీరిని స్థానిక ఆసుపత్రులకు తరలించినట్లు పేర్కొన్నారు.

# అమెరికా స్వాతంత్ర్య వేడుకలకు ఇరాన్ దాడుల ముప్పు



**వాషింగ్టన్,జులై 3:** అమెరికా స్వాతంత్ర్య వేడుకల వేళ దేశవ్యాప్తంగా ఉగ్రదాడుల భయం నెలకొంది. ముఖ్యంగా లోన్ వుల్ఫ్ (ఒంటరిగా దాడులకు పాల్పడేవారు) దాడులు జరగవచ్చని ఫెడరల్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఈ ముప్పు మరింత పెరిగిందని, దీంతో రేపటి వేడుకల సందర్భంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వంటి సంస్థలు సంయుక్తంగా ఒక బులెటిన్‌ను విడుదల చేశాయి. న్యూయార్క్‌లో జరిగే మేసీస్ జులై 4 బాణసంచా వేడుకలకు ఒంటరి వ్యక్తులు లేదా చిన్న చిన్న బృందాల నుంచే ప్రధాన ముప్పు ఉంది. జాతి, మత, రాజకీయ, ప్రభుత్వ వ్యతిరేక లేదా వ్యక్తిగత కారణాలతో దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఆ బులెటిన్‌లో హెచ్చరించింది. ఈ హెచ్చరికలు కేవలం న్యూయార్క్‌కే పరిమితం కాదని, దేశంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పెద్ద కార్యక్రమాలు కూడా లక్ష్యంగా ఉండవచ్చని స్పష్టం చేశాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో న్యూయార్క్ గవర్నర్ కేథీ హోచుల్ స్పందించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా గత కొన్ని వారాలుగా భద్రతా పరిస్థితిపై నాకు నిరంతరం నివేదికలు అందుతున్నాయి. జులై 4 సెలవుల సందర్భంగా లోన్ వుల్ఫ్ దాడుల ముప్పు ఎక్కువగా ఉందని మా ఫెడరల్ భాగస్వాములు నిన్న మరోసారి స్పష్టం చేశారు. ఈ సెలవుల్లో కుటుంబాలు సంతోషంగా గడిపేలా చూడటం, న్యూయార్క్ వాసుల భద్రతే నా ప్రథమ ప్రాధాన్యత అని ఆమె తెలిపారు. ఇరాన్‌తో ఉద్రిక్తతల తర్వాత రాష్ట్రంలోని భద్రతా బలగాలు ఇప్పటికే అప్రమత్తంగా ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద కార్యక్రమాల వద్ద స్టేట్ పోలీసుల మోహరింపును మరింత పెంచుతామని గవర్నర్ తెలిపారు. ప్రధాన రవాణా కేంద్రాలు, వంతెనలు, సొరంగాల వద్ద నేషనల్ గార్డ్ సిబ్బందిని మోహరించామని, సోషల్ మీడియా కార్యకలాపాలను, సైబర్ దాడుల ముప్పును నిశితంగా గమనిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇటీవల ఇజ్రాయెల్‌తో జరిగిన ఘర్షణలో భాగంగా అమెరికా సైన్యం జూన్ 22న ఇరాన్‌లోని మూడు కీలక అణు కేంద్రాలపై బాంబు దాడులు చేసింది. ఆ తర్వాత గతనెల 23న కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి, జూన్ 24 నాటికి అది పూర్తిగా అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే డీహెచ్‌ఎస్ గతనెల 22న ఒక బులెటిన్‌ను విడుదల చేసింది. 2020 జనవరిలో తమ సైనిక కమాండర్ మృతికి కారణమైన అమెరికా అధికారులను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవచ్చని అందులో హెచ్చరించింది. ఇజ్రాయెల్ఇరాన్ ఉద్రిక్తతలు అమెరికాలోని కొందరిని దాడులకు పురిగొల్పవచ్చని కూడా పేర్కొంది. దాదాపు 2 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉన్న శాన్ ఫ్రాన్సిస్కో జులై 4 బాణసంచా కార్యక్రమంపై కూడా ఫెడరల్ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని సామూహిక ప్రాణనష్టం కలిగించే దాడులకు అనువైన సాఫ్ట్ టార్గెట్స్ సముదాయంగా ఎఫ్‌బీఐ, డీహెచ్‌ఎస్ నివేదిక అభివర్ణించింది. ఈ ఏడాది జనవరి 1న న్యూ ఓర్లీన్స్‌లో ఐసిస్ ప్రభావంతో ఒక వ్యక్తి ట్రక్కుతో జనంలోకి దూసుకెళ్లి 14 మందిని చంపిన ఘటనను గుర్తుచేస్తూ, అలాంటి కాపీక్యాట్ దాడులు జరగవచ్చని అధికారులు హెచ్చరికలు జారీచేసారు.

# అమర్‌నాథ్‌యాత్రకు పటిష్టమైన బందోబస్తు



**జమ్ము,జులై 3:** జమ్మూకశ్మీర్‌లో 36 రోజుల పాటుజరిగే పవిత్ర అమర్‌నాథ్ యాత్ర ఘనంగా ప్రారంభమైంది. దేశం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లమధ్య మంచులింగాన్ని దర్శించుకునేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, భారత సైన్యం కల్పించిన సౌకర్యాలు, భద్రతపై యాత్రికులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఏర్పాట్లు చాలా అద్భుతంగా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా, భారత సైన్యం తమకు పూర్తి భద్రతా భరోసా కల్పిస్తోందని, వారి అండతోనే తాము నిర్భయంగా యాత్ర చేయగలుగుతున్నామని పలువురు యాత్రికులు తెలిపారు. ఒకప్పుడు ఉగ్రదాడుల భయంతో తక్కువ మంది వచ్చేవారని, కానీ ఇప్పుడు ప్రభుత్వం కల్పించిన భద్రతతో పెద్ద సంఖ్యలో యాత్రకు వస్తున్నామని ఆనందంవ్యక్తం చేశారు. గురువారం ఉదయం బల్తాల్, పహల్గామ్ బేస్ క్యాంపుల నుంచి యాత్రికుల తొలి బృందాలు బయలుదేరాయి. 5,246 మంది భక్తులతో కూడిన రెండో బృందం జమ్మూలోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి ప్రత్యేక భద్రతా కాన్వాయ్‌ల నడుమ కశ్మీర్ లోయకు బయలుదేరింది. అంతకుముందు, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం యాత్రను అధికారికంగా ప్రారంభించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఈసారి అధికారులు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా చర్యలు చేపట్టారు. భారత సైన్యం, పారామిలటరీ బలగాలతో పాటు అదనంగా 180 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను (సిఆర్‌పిఎఫ్) మోహరించారు. యాత్రికులు తప్పనిసరిగా భద్రతా కాన్వాయ్‌లలోనే ప్రయాణించాలని, ఒంటరిగా వెళ్లవద్దని అధికారులు కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. సముద్ర మట్టానికి 3,888 మీటర్ల ఎత్తులో ఉన్న పవిత్ర గుహకు భక్తులు పహల్గామ్ లేదా బల్తాల్ మార్గాల గుండా చేరుకోవచ్చు. అయితే, ఈ ఏడాది భద్రతా కారణాల దృష్ట్యా హెలికాప్టర్ సేవలను నిలిపివేశారు. ఈ యాత్ర శ్రావణ పౌర్ణమి రోజైన ఆగస్టు 9న ముగియనుంది.

# వారసుని ఎంపికలో దలైలామాకు మాత్రమే పూర్తి అధికారం

## కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ,జులై 3:** టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయంలో చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా ఖండించింది. 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామాకు, ఆయన సంస్థకు మాత్రమే ఉంటుందని, ఈ విషయంలో ఇతరుల జోక్యానికి తావులేదని గురువారం స్పష్టం చేసింది. చైనా డిమాండ్‌ను తోసిపుచ్చుతూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తన వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని, దీనిపై నిర్ణయం తీసుకునే అధికారం గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టుకు మాత్రమే ఉందని దలైలామా ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే చైనా స్పందించింది. తదుపరి దలైలామా ఎంపికకు తమ ఆమోదముద్ర తప్పనిసరి అని, తమ విధానాలకు అనుగుణంగానే ఈ ప్రక్రియ జరగాలని డిమాండ్ చేసింది. చైనా వాదనపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. "దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం విషయంలో జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ లేదు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనే ఉంటుంది. దలైలామా స్థానం కేవలం టిబెటన్లకే కాక, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులందరికీ ఎంతో ముఖ్యమైనదని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తేల్చిచెప్పారు.

# గుజరాత్‌లో బిజెపికి కాంగ్రెస్ సహకారం

## కాంగ్రెస్‌తో మాకు పొత్తు లేదు : కేజ్రీవాల్



**గాంధీనగర్, జులై3:** కాంగ్రెస్‌తో తమకు పొత్తు లేదని ఆప్ జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో గుజరాత్‌లో అధికార బిజెపికి కాంగ్రెస్ సహకరించిందని ఆరోపించింది. కాంగ్రెస్ సారథ్యంలో విపక్ష పార్టీలతో ఏర్పాటైన ఇండియా కూటమి కేవలం గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ఉద్దేశించింది. మాత్రమేనన్నారు. గురువారం ఆయన అహ్మదాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 2027లో జరగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పోటీ చేసి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అక్కడి ప్రజలు ఇప్పుడు బిజెపి, కాంగ్రెస్‌లను కాకుండా ఆప్‌వైపే చూస్తున్నారన్నారు. కాంగ్రెస్‌తో మాకు పొత్తు లేదు. ఒకవేళ ఏదైనా పొత్తు ఉందనుకుంటే, విశావదర్ ఉప ఎన్నికల్లో వాళ్లెందుకు మాపై పోటీ చేశారు? మమ్మల్ని ఓడించాలని చూశారు. ఓట్లు చీల్చి ఆప్‌ను ఓడించేందుకు కాంగ్రెస్‌ను బిజెపి పంపించింది. కాంగ్రెస్ విఫలం కావడంతో బిజెపి వారిని కూడా చీవాట్లు పెట్టింది. ఇండియా కూటమి కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే. ఇప్పుడు మా వైపు నుంచి ఎలాంటి పొత్తు లేదు అన్నారు. ఇటీవల గుజరాత్‌లోని విశావదర్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ నేత గోపాల్ ఇటాలియ విజయం సాధించిన విషయం తెలిసిందే. బిజెపి అభ్యర్థి కిరీట్ పటేల్‌పై 17 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి నితిన్ రణ్‌పారియాకు కేవలం 5501 ఓట్లు మాత్రమే వచ్చాయి. గుజరాత్‌లో నేటి నుంచి గుజరాత్ జోడో అభియాన్‌ను ప్రారంభిస్తున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు. దీని ద్వారా ప్రజలు తాము ఇచ్చిన నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా ఆప్‌లో చేరవచ్చన్నారు. తమ కార్యకర్తలు కూడా ప్రతి ఇంటిని సందర్శిస్తారన్నారు. ఆప్ యువకుల పార్టీ అని, అవినీతి రహిత గుజరాత్‌ను కోరుకునే యువత పెద్ద సంఖ్యలో తమతో కలిసి రావాలని ఈ సందర్భంగా కేజ్రీవాల్ విజప్తి చేశారు.

# స్టూడెంట్ వీసాలకు దరఖాస్తుల స్వీకరణ షురూచేసిన అమెరికా!

**వాషింగ్టన్,జులై 3:** అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విదేశీ విద్యార్థులకు సుమారు నెల రోజుల విరామం తర్వాత విద్యార్థి వీసా దరఖాస్తుల స్వీకరణను పునఃప్రారంభించినట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఈసారి దరఖాస్తుదారులకు కొన్ని కఠినమైన నిబంధనలతో పాటు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. వీసా మంజూరు ప్రక్రియలో కీలక మార్పులు చేసినట్లు స్పష్టం చేసింది. అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మిగ్నాన్ హ్యూస్టన్ మాట్లాడుతూ విద్యార్థి వీసా దరఖాస్తులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఒక విషయాన్ని విద్యార్థులు స్పష్టంగా గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. విద్యార్థులు ఏ ఉద్దేశంతో వీసా కోసం దరఖాస్తు చేసుకున్నారో, ఆ పని కోసమే దానిని ఉపయోగించుకోవాలి. అమెరికాకు వచ్చిన తర్వాత చదువును మధ్యలో వదిలేయడం లేదా క్యాంపస్‌లలో విధ్వంసానికి పాల్పడటం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని ఆమె స్పష్టం చేశారు.

దేశ జాతీయ భద్రత, వలస చట్టాలను దృష్టిలో ఉంచుకునే తమ విధానాలు ఉంటాయని, అమెరికా ఇమిగ్రేషన్ వ్యవస్థ అత్యున్నత ప్రమాణాలతో కొనసాగేలా చూస్తామని ఆమె వివరించారు. ఈ నిబంధనలు కేవలం అమెరికా పౌరులకే కాకుండా, వారితో కలిసి చదువుకునే ఇతర దేశాల విద్యార్థుల భద్రతకు కూడా అవసరమని అన్నారు. సోషల్ మీడియా ఖాతాల పరిశీలన ప్రక్రియ (వెట్టింగ్ ప్రాసెస్) కోసం గత నెల రోజులుగా నిలిపివేసిన దరఖాస్తుల స్వీకరణను జూన్ 18 నుంచి తిరిగి ప్రారంభించినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తమ అన్ని సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను తప్పనిసరిగా పబ్లిక్ వ్యూలో ఉంచాలని ఆదేశించింది. ఈ నిబంధనను పాటించని వారి దరఖాస్తులను తిరస్కరించడమే కాకుండా, భవిష్యత్తులో వారు అమెరికాకు వచ్చే అవకాశాలనుకూడా కోల్పోతారని తేల్చిచెప్పింది. మరోవైపు విద్యార్థి వీసాలకు కూడా నిర్దిష్ట కాలపరిమితి విధించాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయడం విదేశీ విద్యార్థుల్లో కొత్త ఆందోళనకు కారణమవుతోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ఎఫ్1, జె1 వీసాలపై అమెరికాలో ఉంటున్న వారిపై ప్రత్యక్ష ప్రభావం పడుతుంది. దీని ప్రకారం వీసా గడువు ముగిసిన ప్రతిసారీ విద్యార్థులు పొడిగింపు కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ విభాగం సమీక్షలో ఉన్నాయి.

# జపాన్‌లో రెండు వారాల్లో 900 సార్లు భూప్రకంపనలు!

**టోక్యో, జూలై 3:** రెండువారాల వ్యవధిలో గంటకు సగటున మూడు కంటే ఎక్కువసార్లు భూమి కంపిస్తుంటే ఎలా ఉంటుంది? ఏ క్షణాన ఏం జరుగుతుందో అని ఆందోళనతో క్షణక్షణం గడపాల్సి వస్తుంది. ఇదే పరిస్థితి జపాన్‌లో నెలకొంది. అక్కడ టొకార దీవుల్లో జూన్ 21 నుంచి భూఫలకాల కదలికలు చురుగ్గా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. బుధవారం కూడా ఇక్కడ 5.5 తీవ్రతతో భూకంపం వచ్చింది. సునామీ హెచ్చరికలు జారీ చేసినా.. తర్వాత ఆపేశారు.బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి గత రెండు వారాలుగా నమోదైన భూ ప్రకంపనల సంఖ్య 900 అని జపాన్ వాతావరణ శాఖ ఏజెన్సీ అధికారి అయాటకా ఎబిటా పేర్కొన్నారు. మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే టొకార దీవుల్లో జనావాసాలు తక్కువగా ఉండటం ఒక్కటే కొంచెం ఊరటనిచ్చే అంశం. ఇక్కడి వారిని ఏ క్షణమైనా తరలించేందుకు వీలుగా అధికారులు సిద్ధం చేశారు.

# విమానం గాల్లో ఉండగానే.. నేలపై పడిన రెక్క విడిభాగం!



**వాషింగ్టన్, జులై 3:** విమానం గాల్లో ఉండగానే దాని రెక్కలోని ఓ భాగం ఊడిపోయి రోడ్డుపై ఘటన అమెరికాలోని నార్త్ కరోలినాలో చోటుచేసుకుంది. ఈ విషయాన్ని అమెరికాలోని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ కూడా ధ్రువీకరించింది. మంగళవారం రాత్రి హార్ట్స్‌ఫీల్డ్‌-జాక్సన్ అట్లాంటా ఇంటర్నేషన్ ఎయిర్ పోర్టు నుంచి డెల్టా ఫ్లయిట్ నెంబరు 3247 బోయింగ్ 737-900 విమానం నార్త్ కరోలినాలోని రెలీ-దర్హం ఎయిర్‌పోర్టుకు బయల్దేరింది. ఈ విమానం ప్రయాణం మొత్తం సాఫీగానే సాగింది. కానీ, రెలీ ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ సమయంలో అత్యంత కీలకమైన విమానం రెక్కలోని ఫ్లాప్‌కు సంబంధించిన విడిభాగం ఊడిపోయింది. ఇది కింద ఉన్న రోడ్డుమార్గంపై పడింది. అదృష్టవశాత్తు విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఆ సమయంలో 109 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది దానిలో ఉన్నారు. ఎయిర్‌పోర్టులో సదరు విమానం ఎడమ రెక్క వెనుక ఫ్లాప్‌లో కొంత భాగం కనిపించడం లేదు. పూర్తి స్థాయి తనిఖీలు నిర్వహించగా.. ప్రయాణం సమయంలోనే ఆ భాగం ఊడిపోయి మార్గం మధ్యలో పడిపోయినట్లు గుర్తించారు. ఈ ఘటనపై డెల్టా ఎయిర్‌లైన్స్ ఎఫ్ఎఎకు సమాచారం అందించింది. దీనిపై బుధవారం ఎఫ్ఎఎ స్పందిస్తూ.. రెలీలోని ఓ మోటార్‌వేలో వింగ్ ఫ్లాప్‌లోని విడిభాగం దొరికిందని ప్రకటించింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. దీనిపై డెల్టా ఎయిర్‌లైన్స్ స్పందిస్తూ దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని చెప్పారు.

ఫ్లాప్స్ అనేవి విమానం రెక్క వెనకభాగంలో ఉంటాయి. వీటిని కదిలించే అవ కాశం ఉంటుంది. ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో లిఫ్ట్, డ్రాగ్‌ను నియంత్రించడానికి వీటిని వినియోగిస్తారు. వీటి నియంత్రణలు పైలట్ చేతిలో ఉంటాయి. ఇటీవల కాలంలో బోయింగ్ విమానాల్లో భద్రతా లోపాలు తరచూ బయటపడుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని బోయింగ్‌పై న్యాయస్థానంలో కేసులు వేసిన సంస్థలో పనిచేసే న్యాయవాదికి చెందిన బీచ్‌హౌస్ ఎదుటే డెల్టా ఎయిర్‌లైన్స్ విమానం ఫ్లాప్ పడిపోవడం కొసమెరుపు. ఫ్లాప్ ఊడిపడిన ఘటనలో ఎవరూ గాయపడలేదు.

# బిసిల ఆత్మగౌరవ భరోసా సభను విజయవంతం చేయండి

## - ఆల్మెన్ రాజు, పరసారత్నం పిలుపు

**తిరుపతి కలెక్టరేట్, జులై 03 ప్రభాతవార్త:** తిరుపతి ఇందిరా మైదానంలో ఈనెల 6న ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ ఆత్మ గౌరవ భరోసా సభను విజయవంతం చేయాలని బీసీ సంఘాల దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్ ఆల్మెన్ రాజు, అంబేద్కర్ పూలే వ్యవస్థాపకులు పరసారత్నం పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పెద్ద కాపులేఔట్ ఓ రెసిడెన్సీ లో నాగరాజుగౌడ్ అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. ఆల్మెన్ రాజు మాట్లాడుతూ ఇందిరామైదానంలో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటలకు సభ జరుగుతుందన్నారు. అంతకు ముందు మధ్యాహ్నం 2 గంటలకు పూలే విగ్రహం నుంచి నగర వీధులగుండా ర్యాలీగా బీసీ సోదరులు పెద్ద ఎత్తున ఇందిరా మైదానానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి నలుగురు మంత్రులు హాజరు కానున్నారని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలోని బీసీ సోదరులు, సోదరీమణులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పరసారత్నం మాట్లాడుతూ ఈ సభ ద్వారా ఎస్సీ, ఎస్టీ బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీ ప్రజలు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సోదరులు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా, నగర నేతలు,సభ్యులు, బీసీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సభకు కేంద్ర మంత్రి రాందాస్‌ను ఆహ్వానిస్తున్న కల్లూరి నాగరాజు గౌడ్



ఏపి ఛాంబర్స్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ,ఆడియో విజువలిస్, అవార్డుల బ్రోచర్ ను విడుదల చేసిన మంత్రి పార్థసారథి,మంత్రి కొల్లు రవీంద్ర

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో అవార్డుల ప్రకటన ఉత్సాహాన్నిస్తుంది

## -మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ,జులై3,ప్రభాతవార్తప్రతినిధి:** ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రకటన ఉత్సాహినిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీ ఛాంబర్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 పరిచయ కార్యక్రమును విజయవాడ నగరంలోని ఓ ప్రైవేటు హోటల్ లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉండే ఇండస్ట్రీస్ కి ప్రోత్సాహకాలు పై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రాష్ట్రం లో రిజిస్టర్ కాబడిన కంపెనీ లను గుర్తించి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అవార్డ్స్ ఇవ్వడటం జరుగుతుందని మొత్తం గా 14 రంగాల్లో నామినేటెడ్ చేయటం జరుగుతున్నాయన్నారు. అవార్డు గ్రహీతల ఎంపిక అత్యంత పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. మన రాష్ట్రం లో మెరుగైన వనరులు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవడంపై ఛాంబర్ ఆఫ్ కామర్స్ దృష్టి సారించాలన్నారు.మన రాష్ట్రంలో మరో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నారు.పీ4 మోడల్ ద్వారా సామాన్యుడిని సైతం పైకి తేవాలని మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మన ముఖ్యమంత్రి విజన్ మన రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందని, ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా హైదరాబాద్ ను గమనించవచ్చని మంత్రి అన్నారు.గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖామాత్యులు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు 12 రంగాల్లో 15 అవార్డులను అందించనున్నారని వివరించారు. ప్రభుత్వానికి, పరిశ్రమలకు మధ్య వారధిలా ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ పనిచేస్తుందన్నారు. మన రాష్ట్రంలో 13 పోర్ట్స్ ను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు వెళుతున్నారన్నారు. డబల్ ఇంజన్ సర్కార్ కాదు ఫోర్ ఇంజన్ సర్కార్ మన రాష్ట్రంలో ఉందని, ట్రిపుల్ ఇంజన్ రూపం లో చంద్రబాబు, లోకేష్, పవన్,బీజేపీ లు లాంటి ఫోర్ ఇంజన్ లు కలిగి ఉన్నాయని ఇక అభివృద్ధిలో వెనకడుగు వేసే ప్రసక్తి లేదన్నారు. పారిశ్రామిక వేత్తల తో పాటు ఉద్యోగస్తులకు కూడా అవార్డ్స్ ఏర్పాటు చేస్తే ఉద్యోగులకు, పారిశ్రామిక వేత్తలకు మధ్య సత్సంబంధాలు పెరుగుతాయని మంత్రి కొల్లు రవీంద్ర అభిప్రాయ పడ్డారు.సభలో తొలుత మంత్రి పార్థసారథి ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ఆడియో విజువలీస్ ని విడుదల చేయగా, మంత్రి కొల్లు రవీంద్ర అవార్డుల బ్రోచర్ ను విడుదల చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అవార్డుల లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఛాంబర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో రిజిస్టర్ / పనిచేస్తున్న సంస్థలు తమ నామినేషన్లను దాఖలు చేయడానికి అర్హులని అన్నారు. నామినేషన్లను జులై 30 లోపు దాఖలు చేయాలని సూచించారు. నామినేషన్ల దాఖలు కోసం వెబ్ సైట్ ను సందర్శించాల్సిందిగా కోరారు. విజేతలను ఈ ఏడాది ఆగస్టు 30న నిర్వహించే కార్యక్రమంలో అవార్డులతో సత్కరించనున్నామని తెలిపారు. ఇతర వివరాలకు 9121221473, 9121221474, 9912092222 నెంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చని 'కూటమి' ప్రభుత్వం

## కౌన్సిల్‌లో విపక్షనేత బొత్స



**విజయనగరం, జులై 3 (ప్రభాతవార్త ప్రతినిధి) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు, ఇచ్చిన మాటను అమలు చేయకుండా ఏడాది కాలంలో రాష్ట్ర ప్రజలను మోసం,దగా చేసిందని మాజీ మంత్రి, శాసన మండలిలో ప్రతిపక్ష పార్టీ నాయకుడు బొత్స సత్యనారాయణ విమర్శించారు. గురువారం వైసీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం స్టానిక జగన్నాథ ఫంక్షన్ హాల్ లో వైసీపీ విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు ,జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది.సమావేశంలో బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఇంత వేగంగా ప్రతిపక్షానికి పని చెబుతారని అనుకోలేదన్నారు.ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రణాళిక చాలా పవిత్రమైందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తారని నమ్మిన ప్రజలను మోసం చేసిందన్నారు. అధికార పక్షం ఇచ్చిన వాగ్దానాలను మెడలు వంచి అమలు చేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీపై ఉందన్నారు. చంద్రబాబు,పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజలు ఇచిన నమ్మకాన్ని త్రికరణ శుద్ధితో అమలు చేస్తామని ప్రమాణ పత్రం విడుదల చేసి నేడు అమలు చేయకుండా మోసం చేసారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రతిపక్ష పార్టీ గా తాము అడిగితే తాట తీస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఎవరు తాట తీస్తారో ప్రజలే తేలుస్తారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతి సారి మహిళలు,రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రతి మహిళకు నెలకు 1,500 ఇస్తామని చెప్పారని, ఎక్కడ ఇచ్చారని,నిరుద్యోగ భృతి మూడు వేలు అన్నారని, ఇంత వరకూ ఎంతమంది కి ఇచ్చారని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఇలా అడిగితే బెదిస్తున్నారని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు పార్టీ నాయకులు,కార్యకర్తలు భయపడేది లేదన్నారు. ఏడాది కాలంలో రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ డబ్బులు ఏవని ప్రశ్నించారు.చంద్రబాబు 100 అబద్ధాలు ఆడితే లోకేష్ 200 అబద్ధాలు ఆక్షేపించారు.

# స్వర్ణాంధ్ర 2047లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి : జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత

## పి 4లో భాగంగా 264 కుటుంబాలను దత్తత తీసుకుంటా - మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళిక, పి4 కార్యక్రమాలపై సమీక్షించిన మంత్రులు



**విజయనగరం, జూలై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వర్ణాంధ్ర 2047లో భాగంగా రాష్ట్రాన్ని పేదరికం లేని రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం విజన్ ప్రణాళిక రూపొందించిందని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళిక, పి.4 కార్యక్రమాలపై మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి వచ్చే ఐదేళ్లకు ఒక ప్రణాళిక, 2047 నాటికి మరో ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. 3 సెక్టార్లు, 5 సబ్ సెక్టార్లలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా చేసుకోవడం జరిగిందన్నారు. రానున్న ఐదేళ్లలో వ్యవసాయంలో రెట్టింపు అభివృద్ధిని సాధించాలనే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించా మన్నారు. ఇందుకోసం వ్యవసాయ, అనుబంధ రంగాలలో సాగులో లేకుండా ఉన్న భూములను గుర్తించి, ప్రత్యామ్నాయ పంటలు, అంతర పంటలు వేసి సాగును పెంచి, దిగుబడిని కూడా పెంచి, మార్కెటింగ్‌కు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అందుకోసం వ్యవసాయ, అనుబంధ శాఖలు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సమగ్ర ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. జిల్లాకు వ్యవసాయాధారిత పరిశ్రమలు వచ్చేలా క్షేత్ర స్థాయిలో ప్లానింగ్ ఉండాలని, ప్రణాళికలను కార్యాచరణలోకి తేవడం ముఖ్యమని మంత్రి తెలిపారు. ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యాన పంటలకు ఎక్కువగా అవకాశం ఉందని, అందులో వాణిజ్య పంటలకు ఎక్కువ గిరాకీ ఉంటుందని, ఈ పంటల పై ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తోందని, దీనిపై విస్తృత ప్రచారం జరగాలని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం క్లస్టర్ మాపింగ్ క్రింద సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో మ్యాంగో క్లస్టర్ మాపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. సర్వీస్ సెక్టార్ క్రింద పర్యాటక రంగంలో సన్ రే రిసార్ట్స్ 150 కోట్లతో, ఎయిర్ పోర్ట్ నందు జి.ఎం.ఆర్ వారు 150 కోట్లతో అదాని గ్రూప్ 100 కోట్లతో హోటళ్ళను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు.


అలాగే ఎకో టూరిజం క్రింద తాటిపూడి జలాశయంను అభివృద్ధి చేయడానికి 23 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున మాట్లాడుతూ జిల్లా పర్యాటక కేంద్రాలను వెబ్‌సైట్‌లో పెట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. పి4 లో భాగంగా తాను ఒక కుటుంబాన్ని దత్తత తీసుకున్నట్లు జిల్లా ఇంచార్జ్ మంత్రి అనిత వెల్లడించారు. పి4 అంటే ఆర్ధిక అంశాలే కాదని, విద్య తదితర ఆర్దికేతర అంశాలలో కూడా సహాయ పడవచ్చునని తెలిపారు. జిల్లాలో 6700 బంగారు కుటుంబాలు ఉన్నాయని, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు.

# ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువు పొడిగింపు

**విజయవాడ జులై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియట్ విద్యా శాఖ డైరెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 30 తో ప్రవేశాలకు గడువు ముగిసింది. కొన్ని కళాశాలల అభ్యర్థన మేరకు ప్రవేశాల గడువును పొడిగించారు. పదో తరగతిలో సప్లిమెంటరీ పరీక్షలతో కలిపి మొత్తం 5,92,602 మంది ఉత్తీర్ణత సాధించగా ఇప్పటి వరకు ఇంటర్మీడియట్‌లో 4.90 లక్షల మంది చేరారు. కొంత మంది ఐటీఐ, పాలిటెక్నిక్, ఇతరత్రా కోర్సుల్లో ప్రవేశాలు పొందారు.

# శాంతినారాయణకు ప్రతిభా పురస్కారం

## - పలు సాహితీ సంస్థల శుభాకాంక్షలు




**అనంతపురము, జూలై 3 ప్రభాత వార్తబ్యూరో** ప్రసిద్ధ నవలా కథా రచయిత, కవి, కాలమిస్టు, సాహిత్య సేవకుడు డా.శాంతి నారాయణకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2023వ సంవత్సరానికి నవలా/కథా విభాగంలో ప్రతిభా పురస్కారం ప్రకటించింది. ఈ సందర్భంగా డా.శాంతి నారాయణకు శ్రీశ్రీ కళావేదిక, అభ్యుదయ రచయితల సంఘం, సాహిత్య భారతి, ఉమ్మడిశెట్టి సాహిత్య ట్రస్ట్, జిల్లా రచయితల సంఘం, తెలుగు వెలుగు, సాహిత్య భారతి, స్పందన అనంతకవుల వేదిక, సాహితీ స్రవంతి, మానవత, అనంత సాహితీ ప్రస్థానం ట్రస్ట్, ఉమరాలీషా సాహిత్య సంస్థ, తెలుగు భాషా సంరక్షణ సమితి, తపన సాహిత్య వేదిక మొదలైన సాహితీ సాంస్కృతిక సామాజిక సంఘాలు శుభాకాంక్షలు చెప్పాయి. డా.శాంతి నారాయణ దాదాపు 70 కథానికలు, నాలుగు నవలలు రచించారు. రెండు సంపుటాలు కవిత్వం రాశారు. నాగలకట్ట సుద్దులు రెండు సంపుటాలు ప్రచురించారు. అనంతపురం జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా అద్భుతంగా పనిచేశారు. విమలాశాంతి సాహితీ సామాజిక సేవాసమితి ద్వారా రచయితలకు పురస్కారాలను, సీనియర్ రచయితలకు జీవిత సాఫల్య పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు.

# 'సింగిల్‌' మూవీ పైరసీ విక్రేత అరెస్ట్

## తూర్పుగోదావరి జిల్లా నుంచి వచ్చి యేడాదిగా అక్రమ వ్యవహారం

## 40 సినిమాలు పైరసీ చేసినట్లు పోలీసులు వెల్లడి

## తెలుగు సినీపరిశ్రమకు రూ. 3,700 కోట్ల నష్టం



**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** ఓ తెలుగు చిత్రాన్ని సింగిల్ స్క్రీన్‌పై డిజిటల్ వీడియో తీసి అదే ఆన్‌లైన్‌లో అక్రమంగా విక్రయించిన పైరసీదారుడును గురువారం నగర సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడాదిలో నలబై వరకు చిత్రాలను పైరసీ చేసినట్లు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ నరేశ్ తెలి పిన వివరాల ప్రకారం ఏపీ ఈస్ట్‌గోదావరి జిల్లాకు చెందిన జన కిరణ్‌కుమార్ (29) నగరానికి వచ్చి వనస్థలిపురంలోని ఎన్జీవో కాలనీలో ఏసీ టెక్ని షియన్‌గా పనిచేస్తున్నాడు. ఈజీమని సంపాదించేందుకు మూవీ పైరసీ చేయ డం మొదలెట్టాడు. ఇందుకు సంబంధించిన పైరసీ మూవీలను కొనుగోలు చేసేవారిని పరిచయం చేసుకున్నాడు. దీంతో ఏడాదిగా పైరసీలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అయితే మూవీ కంటెంట్‌ల లింక్‌లు పంపించి ఒప్పందం చేసుకుంటాడు. తాజాగా గత నెలలో 'సింగిల్‌' తెలుగుచిత్రం విడు దలైంది. అయితే నగరంలోని ఓ థియేటర్‌లోనే బ్లాక్‌లో టికెట్టు కొను గోలు చేసి మొబైల్‌తో సినిమాను అక్రమంగా వీడియో తీశాడు. ఆ తర్వాత ఈమెయిల్‌లో ముందు సమాచారం ఇవ్వడం ఆపై ఎవరికీ అనుమానం రాకుండా భద్రత చర్యలు చేపట్టి ఆన్‌లైన్ టెలిగ్రామ్‌లో పంపిస్తున్నాడు. పైరసీ గ్రూపులు అయిన తమిళ్‌ఎంవీ, తమిళ్‌బ్లాస్టర్స్‌తో పాటు మరొకటి దానికి పంపించి ఒక్కో సినిమాకు క్రిప్టో కరెన్సీలో చెల్లింపులు జరిగేలా రాజీ కుదుర్చుకొని వాటిని భారత్ కరెన్సీలోకి మార్చుకుంటున్నాడు. ఇటీవల సినిమాపై అనుమానం తలెత్తడంతో టీఎఫ్‌సీసీ ప్రతినిధి మణీంద్రబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతేడాది తెలుగు ఇండస్ట్రీ రూ.3700కోట్లు నష్టపోయిందని ఆయన పేర్కొన్నారు. వెంటనే దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ పోలీసులు నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనపరుచుకొని రిమాండ్‌కు తరలించారు.

**పైరసీపై కఠినచర్యలు: ఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజు**

సినీ పరిశ్రమలో పైరసీని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని, ఇందు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్ ప్రియాంక తో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉప ముఖ్యమంత్రితో పలు కీలక సమావేశాలు నిర్వహిం చామని, సినిమా ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైతే నూతన నిబంధనల రూపకల్పన కూడా చేస్తామని చెప్పారు.ఎఫ్‌డీసీ నోడల్ ఏజెన్సీగా , ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సినిమా షూటింగ్ లకు ఆన్‌లైన్ అనుమతుల ప్రాసెస్‌తో పాటు వీడియో పైరసీ నియంత్రణకు కఠిన చర్యలు ఉంటాయని దిల్ రాజు పేర్కొన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందరం కలిసి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్. ప్రియాంక మాట్లాడుతూ సినిమా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అంశంపై సమీక్ష జరిపి, సాధ్యసాధ్యాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇండస్ట్రీ సమస్యలపై ఎవరైనా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తప్పకుండ తాము కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# కురిడి గ్రామంలో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మామిడి పండ్లు పంపిణీ


**అరకు రూరల్, డుంబ్రిగుడ, జులై 3 , ప్రభాత వార్త :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంతంపై ప్రత్యేకమైన అభిమానాన్ని చూపిస్తున్నారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను అల్లూరి జిల్లా పర్యటన ద్వారా తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారు. అలాగే గిరిజన గ్రామాల్లో సందర్శించి గ్రామస్థులతో ఆప్యాయతగా మాట్లాడి వారి అవసరాలను గుర్తిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకులోయ నియోజకవర్గం పరిధిలోని కురిడి గ్రామస్తులకు డిప్యూటీ సీఎం తన సొంత తోట లో ఆర్గానిక్ పద్ధతి న పండించిన మామిడి పండ్లను తన సిబ్బంది ద్వారా పంపించి ప్రతి ఒక్కరికి అందజేశారు. కాగా ఇటీవల అల్లూరు జిల్లా పర్యటన అనంతరం ఉప ముఖ్యమంత్రి అరకులోయ నియోజకవర్గం డుంబ్రిగుడ మండలం పరిధిలోని పెదపాడు గ్రామానికి పాదరక్షలు ( చెప్పులు ) పంపించి తన అభిమానాన్ని చూపించిన సంగతి విధితమే. అదేవిధంగా మరోసారి అదే మండలం పరిధిలోని కురిడి గ్రామస్తులకు తన సొంత తోట లో పండించిన మామిడి పండ్లను తన సిబ్బంది ద్వారా ప్రత్యేకంగా పంపించి పంపిణీ చేసి మరోసారి తన అభిమానాన్ని గిరిజనులతో పాలుపంచుకున్నారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉంటూ మారుమూల గిరిజన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, తమ సమస్యలను పరిష్కరించడమే కాకుండా, తమ అవసరాలను గుర్తిస్తుండడం తమకు ఎంతో ఆనందంగా ఉందని , పవన్ బాబు పది కాలాలపాటు చల్లగా ఉండాలని ఈ సందర్భంగా గిరిజనులు డిప్యూటీ సీఎం కి తమ ఆశీస్సులను అందజేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన సొంత తోటలో పండించిన మామిడి

పండ్లను ప్రత్యేకంగా తమ గ్రామానికి పంపించి మరోసారి తన అభిమానాన్ని చాటుకున్నారని కురిడి గ్రామస్తులు ఆనందంగా చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గిరిజనులపై తన ప్రత్యేక అభిమానాన్ని చూపిస్తున్నారనడానికి, గిరిజన గ్రామాల్లో ఆయన చేపడుతున్న కార్యక్రమాలే నిదర్శనంగా పేర్కొనవచ్చు.

# రెవెన్యూ అంశాలపై వ్యవసాయ అధికారులు అవగాహన కలిగిఉండాలి : వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు

## - అన్నదాత సుఖీభవ పథకం నకు గ్రీవెన్స్ మాడ్యులు నేడు విడుదల

**విజయవాడ,జులై3,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కు సంబంధించి ల్యాండ్ మాడ్యూల్స్ లో గ్రామ స్థాయిలో ఎదురయ్యే వివిధ రెవెన్యూ అంశాలపై క్షేత్ర స్థాయిలోనీ వ్యవసాయ అధికారులు సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు తెలియచేశారు .క్షేత్ర స్థాయిలో గ్రామం మొత్తంగా పరిష్కారం కానీ రెవెన్యూ రికార్డులు 1బి లో లేని గ్రామాలు,మునిసిపాలిటీ లలో కలవటం వల్ల వెబ్లాండ్ లో లేని గ్రామాలు , భూముల రీసర్వే వల్ల పరిష్కారం కానీ గ్రామాలు , ఎస్టేట్ మరియు ఇనామ్ భూముల రద్దు చట్టం పరిధిలోని గ్రామాలు సొసైటీ భూముల నోషనల్ ఖాతాలు తదితర అంశాలపై వెబ్లాండ్ లో ఏర్పడుతున్న కొన్ని ప్రతిబంధకాలను ప్రస్తావిస్తూ లేని గ్రామాలు భూముల రీసర్వే వల్ల పరిష్కారం కానీ గ్రామాలు , ఎస్టేట్ ఇనామ్ భూముల రద్దు చట్టం పరిధిలోని గ్రామాలు సొసైటీ భూముల నోషనల్ ఖాతాలు అంశాలపై వెబ్లాండ్ లో ఏర్పడుతున్న కొన్ని ప్రతిబంధకాలను ప్రస్తావిస్తూ ఖాతాదారు బ్రతికే ఉన్నా, ఆధార్ తప్పుగా వెబ్ల్యాండ్ 1.0 మరియు 2.0లో నమోదయిన నేపథ్యం లో .క్రియాశీలకంగా లేని ఖాతాదారులు (సరైన లేదా తప్పుగా ఆధార్ పొందుపరిచినవారు) ల అంశమును పరిశీలిస్తే మరణించిన ఖాతా దారులు ఇంకా వెబ్ల్యాండ్‌లో ప్రత్యక్షమవుతుండటం. వీరిలో కొందరి ఆధార్ ఖాతాదారు స్వంతంగా ఉండటం మరియు ఇతరుల ఆధార్ ఉండటం వల్ల సమస్య ఎదు రవడం వల్ల మ్యుటేషన్ లలో వారసత్వ మార్పు లు చేసుకునేందుకు



ఆటంకం ఏర్పడటం వల్ల ప్రభుత్వం నుండి ప్రయోజనాల లబ్ధిలో సమస్యలు ఏర్పడుతున్నాయి ఇటువంటి వాటికి పరిష్కారంగా ఫీల్డ్‌లో మరణ ధృవీకరణ జత చేసి, వెబ్‌ల్యాండ్‌లో మ్యుటేషన్ ద్వారా ఖాతా మార్చాలి. పట్టా భూమిని ఎవరి ఖాతాకి కేటాయించకుండా మిగులు భూమిగా చూపడం 1 లక్ష సిరీస్‌లో ఖాతాలు ఉండి ఆధార్ ను పొందుపరచకపోవడంఆధార్ లింక్ లేకపోవడం వల్ల, లబ్ధిదారుల గుర్తింపు సాధ్యం కాకపోవడం జరుగుతుంది .ఆటో మ్యూటేషన్ గ్రామాలలో 5000+ సిరీస్ ఖాతాలుఫీల్డ్ సిబ్బంది నోషనల్‌గా భావించే అవకాశం ఉండటం ఆటోమేటెడ్‌గా వచ్చిన సిరీస్ ఖాతాలను కొన్ని సందర్భాల్లో ఫీల్డ్ సిబ్బంది తప్పుడు అర్థంతో నోషనల్‌గా పరిగణిస్తున్నందు దీన) సాంకేతిక లోపం వల్ల వాస్తవంగా భూమి ఉన్న ఎటువంటి భూమి లేని ఖాతాలు గా నమోదు అవ్వటం డేటా లోపాల వల్ల విస్తీర్ణమును చూపించకపోవడం విచారకరం.

# దుర్గమ్మకు వెండి పట్టీల కానుక

**ఇంద్రకీలాద్రి, జూలై 3, ప్రభాతవార్త** దుర్గమ్మ వారికి పలువురు భక్తబృందాల వారు గురువారం ఆషాడం సారెను సమర్పించారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ పలు ప్రాంతాలకు చెందిన బృందాలు తమ ఇంటి ఆడపడుచుగా భావించి దుర్గమ్మవారికి సారె సమర్పించారు. ఆషాడం సారె సమర్పించిన భక్తుల బృందాలకు దుర్గమ్మవారి దర్శనంఏర్పాటు చేసిన అధికారులు అన్నప్రసాదాలు అందించారు. శుక్రవారం నాడు గురుపూర్ణిమ సందర్భంగా పెద్ద ఎత్తున దుర్గమ్మవారి దర్శనానికి భక్తులు వచ్చే అవకాశమున్నందున అంతరాలయ, విఐపి దర్శనాల రద్దు యోచన చేస్తున్నట్లు ఇఓ తెలిపారు. శాకంబరి ఉత్సవాల ముగింపు ఈనెల 10 న జరిగే వరకు ఈ రద్దీ వుంటుందని భావిస్తున్నామన్నారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిర్వహిస్తున్న పోరంకిలోని వేదపాఠశాలను ఇఓ వికె శీనా నాయక్ గురువారం పరిశీలించారు. గతనెలలో తాను చేసిన పరిశీలన సందర్భంగా చెప్పిన పనుల స్థితి గురించి విచారించారు. మరుగుదొడ్ల రిపేర్, ఆర్వోప్లాంట్, కిటికీల రిపేర్లు పూర్తయ్యాయయని ఉపాధ్యాయులు ఇఓకు తెలిపారు. విద్యార్థులకు ఆటమైదానంలో కలుపు మొక్కలు తొలగింపు, బిల్డింగ్ స్లాబ్ రిపేర్లు త్వరగా పూర్తి చేయాలని ఇఓ ఆదేశించారు. కార్యక్రమంలో వేదపాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వేదపండితులు, ఆలయ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి మాజీ మంత్రి సిద్దా రాఘవరావు గురువారం రు1లక్ష 1వెయ్యి లను విరాళంగా ఈఓకు అందించారు. శిద్దారాఘవరావు దంపతులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం వారికి శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు.




వెండి పట్టీలు కానుక అందిస్తున్న దాతలు

# జోలెపట్టిన రఘువీరారెడ్డి..

## ఆధ్యాత్మికతలో మునిగి తేలుతున్న మాజీ మంత్రి

**అనంతపురం, జులై 3, (ప్రభాతవార్త బ్యూరో)** శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం నీలకంఠాపురం లో షిరిడి సాయి మందిరంలో ఈనెల 10వ తేదీన గురు పౌర్ణమి సందర్భంగా అన్నదానం చేసేందుకు వీలుగా సిడబ్ల్యుసి సభ్యుడు, మాజీమంత్రి నీలకంఠాపురం రఘువీరారెడ్డి గురువారం బిచ్చటన చేశారు. శ్రీ నీలకంఠాపురం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ చైర్మన్ హోదాలో రఘువీరారెడ్డి ఇతర భక్తులతో కలిసి జోల బట్టి నీలకంఠాపురం, గోవిందపల్లి,ముద్దలపల్లి, సంకె పాలెం గ్రామాల్లో బిచ్చడం చేసి డబ్బులు, బియ్యము తదితర వాటిని భక్తులతో స్వీకరించడం విశేషం.. ఈ కార్యక్రమంలో ఎస్కేయూ ప్రొఫెసర్ సదాశివరెడ్డి , తదితర గ్రామస్తులు కూడా పాల్గొన్నారు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గాల్లో కీలక మంత్రిగా , పిసిసి అధ్యక్షుడు , తదితర పదవులలో రాణించి ప్రస్తుతం సిడబ్ల్యుసి సభ్యునిగా కొనసాగుతున్నారు.



భిక్షాటన చేస్తున్న సిడబ్ల్యుసి సభ్యుడు నీలకంఠాపురం రఘువీరారెడ్డి దృశ్యాలు

# 5వ తేదీన బి.టి.పి పనులు తిరిగి ప్రారంభిస్తాం

## కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు

**అనంతపురం, జులై 3, (ప్రభాతవార్త బ్యూరో)** కళ్యాణ్ దుర్గం ప్రాంతానికి జీవనాడి అయిన బీటీపీ ప్రాజెక్టు పనులుఈ నెల 5న తిరిగి పునఃప్రారంభం చేస్తున్నామని, ఇక శ్రీరామిరెడ్డి నీళ్లు ఒకటి రెండు రోజుల్లో అన్ని గ్రామాలకు అందుతాయి కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు వెల్లడించారు.. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి కళ్యాణ్ దుర్గం నియోజకవర్గము సెట్టూరు మండలంలో గురువారం ఎమ్మెల్యే సురేంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం కింద ఎంపీ ,ఎమ్మెల్యే తదితర టిడిపి నేతలు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఉషాశ్రీ చరణ్ ఇక్కడ ఉన్న వనరులను పూర్తిగా దోచేసి, ఇక్కడి నుంచి పలాయనం చిత్తగించింది అని ఆరోపించారు. ఆమెకు భయపడి ఎంపీగా ఉన్న తలారి రంగయ్య కళ్యాణదుర్గం ప్రాంతంలో తిరగడానికి కూడా రాలేదు అని, నేడు ఆర్డీటీ పేరు చెప్పి పాదయాత్ర చేశారు అంటే కేవలం ఆయన ఉనికి కోసం మాత్రమే అన్నారు.

ఆర్డీటీ కి ఎఫ్ సి ఆర్ ఏ అనుమతులు ఇప్పించే విషయంలో రాష్ట్ర యువనాయకులు మంత్రి నారా లోకేష్ , కేంద్రమంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారని, కేవలం ఒక్క ఆర్డీటీకే ఇలాంటి చారిటీ ట్రస్టులు అన్నింటికీ ఇబ్బందిగా ఉంది.. ఇంకా కొందరు ఎదో క్యూ ఆర్ కోడ్ అంటూ గ్రామాల్లోకి వస్తున్నారని, వారికి అక్రమాలు చేయడం స్కాములు చేయడమే తెలుసని మరి క్యూ ఆర్ కోడ్ అని మీ అకౌంట్లలో డబ్బులు కొట్టేస్తారు జాగ్రత్తగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఉన్నత విద్య బలోపేతానికి సమగ్ర నివేదిక

### త్వరలోనే ప్రభుత్వానికి సమర్పిస్తాం

### రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్య బలోపేతానికి సమగ్ర నివేదికను సిద్ధం చేయనున్నట్టు తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ తెలిపారు. ఉన్నత విద్య బలోపేతానికి తగు సూచనలతో సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులు గురువారం మొదటిసారిగా పాలమూరు యూనివర్సిటీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డితోపాటు వివిధ విభాగాలధిపతులు బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆకునూరి మురళీ మాట్లాడుతూ విద్యావ్యవస్థలోని సమస్యలను విద్యార్థుల నుంచి వివిధ సంఘాల నాయకుల నుంచి ప్రజాభిప్రాయాలను సేకరించి ఒక సమగ్ర నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. కేజీ టు పీజీ విద్యలో గల సమూల మార్పులకై అధ్యయనం చేస్తున్నామని, యూనివర్సిటీ స్థాయిలో గల వివిధ సమస్యల పైన ప్రత్యక్షంగా విద్యార్థుల నుంచి, మేధావుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని, విద్యా రంగంలో వెనుకబడిన గట్టు మండలంని ఆధారంగా చేసుకుని పాలమూరు యూనివర్సిటీని సందర్శించినట్టు చెప్పారు. త్వరలో మరిన్ని యూనివర్సిటీలను సందర్శించి నివేదిక తయారు చేస్తామన్నారు. యూనివర్సిటీ ఉపకులపతి(విసి) ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిలబస్ రూపకల్పన మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉందా? లేదా? అని.. చాలామంది విద్యార్థులు మంచి పర్సంటేజ్‌తో పాస్ అయినప్పటికీ జీవితంలో స్థిరపడడం లేదని, సమాజ అవసరాల కొరకు సిలబస్ రూపకల్పన జరగాలని, విద్యా కమిషన్ సభ్యులు యూనివర్సిటీలో సమస్యలను చర్చించి ఒక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేయడంలో సహకరించాలని సూచించారు. యూనివర్సిటీ అధ్యాపకులు అధ్యాపకేతరులు, విద్యార్థులు వివిధ సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.

## స్మార్ట్ మీటర్లు ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాల్సిందే :సిపిఎం



ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న సిపిఎం నేతలు

**అనంతపురం, జులై 3 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం నగరంలోని శ్రీనగర్‌లో క్యూ ఆర్ కోడ్ ద్వారా ముఖ్యమంత్రికి ప్రజలు ఫిర్యాదు చేశారు. ప్రజలపై విద్యుత్ బారాలు మోపేలా ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్లను అమర్చరాదని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శ్రీ నగర్‌లో విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం దృష్టికి ఈ ప్రజా సమస్యలను తీసుకెళ్లేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదులు చేసేలా క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఇంటింటికి పంపిణీ చేసి ప్రజలు ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సెకి ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు భారాలపై ప్రభుత్వానికి అర్జీ పెట్టాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి రాకముందు లోకేష్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి విద్యుత్ ఛార్జీలు పెంచమని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి స్మార్ట్ మీటర్లు బిగింపు వేగంగా రాష్ట్రంలో అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్లను కమర్షియల్ కనెక్షన్లకు బిగిస్తున్నారని తెలిపారు. అపార్ట్మెంట్‌లకు బిగించడానికి సిద్ధం చేస్తున్నారని రాబోవు కాలంలో ఇంటి వినియోగదారులకి రైతులకు మోటార్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగిస్తారని తెలిపారు. దీని వల్ల విద్యుత్ భారం పెరుగుతుందన్నారు. సెకిఒప్పందాలను రద్దు చేయాలని స్మార్ట్ మోటార్లను బిగింపు ఆపాలని, ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ ఒప్పందాలను రద్దు చేయాలని విద్యుత్ వినియోగదారులకి పిలుపునిచ్చారు. సెల్ ఫోన్‌లో క్యు ఆర్ కోడ్‌ను క్లిక్ చేసి ప్రభుత్వానికి మీ వ్యతిరేకతను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు వలి, ప్రకాష్, జీవ, కుమార్, రాఘవ, హరికృష్ణ, పాల్, మాబు తదితరులు పాల్గొన్నారు.

## పసుపు రైతుల కోసం జాతీయ సహకార ఎగుమతి సంస్థ

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** పసుపు రైతుల కోసం జాతీయ సహకార ఎగుమతి లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్), జాతీయ సహకార ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సీవోఎల్)ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఈ విషయాన్ని గురువారం ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సంస్థలను తెలంగాణలోని నిజామాబాద్‌లో స్థాపించాలని కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సహకార సంస్థలు పసుపు దిగుమతులను పెంపొందించడంలో పూర్తి సహాయ సహకారాలను అందిస్తాయన్నారు. అలాగే సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలోను, రైతులకు న్యాయమైన లాభాలను అందించడంలో ఆయా సంస్థలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

## డిమాండ్లను అమలు చేయకపోతే ఆగస్టు 13న 'దివ్యాంగుల మహాగర్జన' నగర దిగ్బంధనం

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలను వెంటనే అమలు చేయాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు, విహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆగస్టు 13న 'దివ్యాంగుల మహాగర్జన' పేరిట హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధం చేస్తామని ఆయన హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన దివ్యాంగుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు దాటిందని, అన్ని అవయవాలు ఉండి ఏదో ఒకపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న వర్గాలకు హామీలు అమలు చేస్తూ అవయవ లోపాలతో ఎలాంటి పనులు చేసుకోలేక నిరాశ, నిస ృహలతో ఉన్న దివ్యాంగుల హామీ లను అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో వివిధ దివ్యాంగ సంఘాల నాయకులు ఎల్.గోపాల్‌రావు, అందె రాంబాబు, సుజాత, సామినేని భవాని చౌదరి, కొల్లి నాగేశ్వర్‌రావు, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 18న ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు అనుమతి ఇవ్వండి

### పోలీసు ఉన్నతాధికారులకు మాజీ సర్పంచ్ జెఎసి విజ్ఞప్తి

**హైదరాబాద్ జూలై, 3, ప్రభాతవార్త:** మాజీ సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాకు అనుమతి ఇవ్వాలని మాజీ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన తెలంగాణ సెంటర్ జోన్ డీజీపీ, చిక్కడపల్లి దోమల గూడ సిఐని కలిసి వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి 24 వరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల గురించి ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినిపించిన తమ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. డబ్బులు వడ్డీలకు తెచ్చి అభివృద్ధి పనులు చేసి బిల్లులు రానందువల్ల కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని హైదరాబాద్ ఇందిరాపార్క్ దగ్గర ధర్నాచౌక్ మాజీ సర్పంచులు ధర్నా చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ హెల్పర్ల పదోన్నతుల వయోపరిమితి పెంపు

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** అంగన్వాడీ హెల్పర్లు టీచర్లుగా పదొన్నతి పొందేందుకు వయోపరిమితిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం వాటికి సంబంధించిన ఫైలుకు అమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం పదోన్నతికి గాను గరిష్ట వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,322 మంది అంగన్వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి పొందే అవకాశం ఏర్పడనుంది. గతంలో 45 ఏళ్ల దాటిన తర్వాత ప్రమోషన్ కోసం అవకాశాలు లేకపోయినా, ఇప్పుడు వారికీ మళ్ళీ అవకాశం లభించనుంది. గరిష్ట వయోపరిమితిని పెంచాలని అంగన్వాడీ హెల్పర్ యూనియన్ల నుంచి ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు వచ్చాయి. అర్హతలు ఉన్న 50 ఏళ్ల లోపు హెల్పర్లకు టీచర్ పదోన్నతి ఇవ్వడంలో ఎలాంటి అడ్డంకులు లేవని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారులు నివేదిక సమర్పించారు. 50 ఏళ్ల వయస్సులో టీచర్ గా పదోన్నతి పొందే హెల్పర్లు మరో 15 ఏళ్లు విధులు నిర్వర్తించవచ్చని అందులో సూచించారు. 45 యేళ్లు దాటిన అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వడంలో ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రభుత్వం దానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

## బిల్లులు చెల్లించాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

### మంత్రి సీతక్కకు సుర్వి యాదయ్యగౌడ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ మాజీ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్కకు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించామని అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసి వినతి పత్రం అందచేసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షు గుంటి మధుసూదన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శి మల్లయ్య, అరవింద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## తల్లి సాయంతో తండ్రి హత్య

### ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన నాగోల్ పోలీసులు

**హైదరాబాద్ (ఎల్‌బినగర్), జూలై 3, ప్రభాతవార్త:** తల్లి సాయంతో తండ్రిని ఓ మైనర్ బాలుడు హత్య చేశాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హత్యకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అశోక్‌మహతొ అనే వ్యక్తి పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి కాచిగూడలో జ్యూస్ పాయింట్ పెట్టుకొని నివసిస్తుండగా, మూడు సంవత్సరాల క్రితం తన కుటుంబసభ్యులు కూడా కాచిగూడకు వచ్చి అశోక్‌మహతొ జ్యూస్ పాయింట్ ఎదురుగానే మరో జ్యూస్ పాయింట్ పెట్టుకొని జీవనం కొనసాగిస్తూ కాచిగూడలోని వీరన్నగుట్టలో నివాసం ఉంటున్నారు. అయితే అశోక్‌మహతొ సంపాదించిన డబ్బులను తన కుటుంబసభ్యులకు ఇవ్వకుండా, తన తమ్ముళ్లకు ఇవ్వడంతో తన కుమారుడికి, భార్యకు తనకు మధ్య గొడవ జరగగా అశోక్‌మహతొ గత అయిదు రోజుల క్రితం తనకు తెలిసిన వ్యక్తిని పంపించి తన పెద్ద కుమారుడిని కొట్టించాడు. అది మనసులో పెట్టుకొని అశోక్ మహతొ పెద్ద కుమారుడు అయిన రాజేందర్ కుమార్‌యాదవ్ (20), భార్య క్రాంతిదేవి (40) కలిసి అశోక్ మహతొను ఒక పథకం ప్రకారం మైనర్ బాలుడి సహాయంతో చంపాలని నిర్ణయించుకున్నారు. అశోక్‌మహతొను జూన్ 30వ తేదీ రాత్రి 1:00 గంటల సమయంలో తన కొత్తపేటలోని పెద్ద కుమారుడి టీ కౌంటర్‌ను చూసివద్దామని చెప్పి మైనర్‌ను వెంటపెట్టుకొని తన స్కూటీ పైన కొత్తపేట్ నుండి నాగోల్ నుంచి ఒఆర్‌ఆర్ మార్గంలో పసుమాముల గ్రామం వద్ద నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి పథకం ప్రకారం వారి వెంట తీసుకువచ్చిన ఐస్‌ను కొట్టే బ్యాటు సహాయంతో బాలుడు, రాజేందర్‌కుమార్‌యాదవ్ కలిసి అశోక్‌మహతొను తలపైన తీవ్రంగా కొట్టారు. దీంతో అశోక్‌మహతొ తలకు బలమైన గాయాలు కాగా అతను అక్కడికక్కడే చనిపోయాడు. నిందితులు తమ ఫోన్‌లను స్విచ్‌ఆఫ్ చేసుకొని పారిపోయారు. సమాచారం తెలుసుకున్న నాగోల్ పోలీసులు విచారణ చేపట్టి ఈ నెల 2న నిందితులను పట్టుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినారు. హత్య కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన నాగోల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. సూర్యానాయక్, సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.శివనాగప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శంషుద్దీన్, కానిస్టేబుల్ సుభాష్, సాయిష్‌లను డిసిపి ప్రవీణ్ కుమార్ అభినందించారు.

## ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్‌కు 88,802 మంది దరఖాస్తు

### 6 నుంచి వెబ్‌ఆప్షన్లు.. 40,561 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు..13న మాక్ సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 88,802 మంది కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 28 నుంచే కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా.. ఈ నెల 1 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు 40,561 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరయ్యారు. ఈ నెల 7 వరకు విద్యార్థులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకొని స్లాట్‌బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. అలాగే ఈ నెల 8 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగనుంది.

ఈ నెల 6 నుంచి 10 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. మొదటిసారిగా మాక్ సీట్ అలాట్‌మెంట్‌ను ప్రవేశపెట్టగా..ఈ నెల 13న మాక్ సీట్ అలాట్‌మెంట్ చేయనున్నారు. అందులో మార్పులు చేసుకోవడానికి ఈ నెల 14, 15 తేదీల్లో అవకాశం కల్పించారు. అనంతరం ఈ నెల 18లోపు మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు.

మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు ఈనెల 18 నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో ఈనెల 25న వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలి. 26న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుంది. 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. 30లోపు రెండోవిడత సీట్ల కేటాయింపు చేస్తారు. ఈ నెల 30 నుంచి ఆగస్టు 1 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలి.

## బిసి రిజర్వేషన్ల తర్వాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

### ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాస్తున్నా: ఎమ్మెల్సీ కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 3:** బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితఎఔ అన్నారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తానన్న సీఎం ఇంకా తీసుకెళ్లలేదని విమర్శించారు. జూలై 8 లోపు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లోని బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీ బిల్లు విషయంపై బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకి లేఖ రాస్తున్నామని చెప్పారు. ఈ నెల 17న బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం జాగృతి ఆధ్వర్యంలో చేపట్టనున్న రైల్ రోను విజయవంతం చేయాలన్నారు. రైల్ రోకోకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైల్ రోకో కార్యక్రమానికి వివిధ పార్టీల మద్దతు కూడగట్టామన్నారు.

బీసీ బిల్లుపై బీజేపీ చొరవ తీసుకోవాలని, ఈ విషయమై ఆ పార్టీ నూతన అధ్యక్షుడు రామచందర్ రావుకు లేఖ రాశామని చెప్పారు. ఆయన చొరవ తీసుకొని బీజేపీ అధ్యక్ష హోదాలో తొలి విజయం నమోదు చేసుకోవాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ వస్తున్నారని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ బీసీల కోసం పార్లమెంట్‌లో ఎన్నడూ మాట్లాడలేదని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా బీజేపీపై ఖర్గే ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాత లెక్కలే చెబుతున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీల వారీగా కులగణన వివరాలు బయట పెట్టాలన్నారు. జూలై 17న రైల్ రోకో నిర్వహించి తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లే ప్రతి రైలును ఆపుతామన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు సాధించేందుకు బీజేపీపై ఒత్తిడి తెస్తామని వెల్లడించారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ మెతక వైఖరి కనబరుస్తున్నదని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబును ఒక్క మాట కూడా అనలేదని ధ్వజమెత్తారు. కొందరి కాంట్రాక్టుల కోసమే బనకచర్ల ప్రాజెక్టు అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారని చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారని చెప్పారని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి బనకచర్లను ఆపాలని గట్టిగా కొట్లాడాలని చెప్పారు.



## ఐటి కారిడార్‌లో బోనాల జాతర

### శిల్పకళావేదిక నుంచి దేవస్థానానికి శోభాయాత్ర

**హైదరాబాద్ జూలై, 3, ప్రభాతవార్త:** తెలంగాణ సాంప్రదాయాలకు ఆధునికతను మేళవిస్తూ, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టీహబ్ వేదికగా తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) బోనాలు 2025 పోస్టరు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటా గ్లోబల్ అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాలా, బోనాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ యేడాది ఐటీ బోనాలు వేడుకలు, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ భాగస్వామ్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సందీప్ మక్తాలా, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి. హరికృష్ణకు సంస్కృతి పరిరక్షణలో అందిస్తున్న అప్రతిహత మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆషాఢ మాసం రెండో ఆదివారం, జూలై 6న జరగనున్న ఈ ఐటీ బోనాలు సంప్రదాయం నిలిపే ఈ వేడుకలు ఎంతో గొప్పవని, టీటా ద్వారా ఈ సంస్కృతి ఆధారిత కదలిక ఐటీ కారిడార్లో నిలబెట్టడం అభినందనీయమని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశంసించారు. ఈ సంవత్సరం వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా, శిల్పకళావేదిక నుంచి చిన్న పెద్దమ్మ దేవస్థానానికి భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఊరేగింపు ప్రారంభానికి ముందు సందీప్ ముక్తాలా కుటుంబం, అమ్మవారికి చీరెసారెలతో, ఒడి బియ్యాన్ని సమర్పించి ప్రత్యేక సంప్రదాయ పూజ నిర్వహిస్తారు. భక్తితోపాటు సంగీతం, సంప్రదాయం, ఐక్యత నిండిన ఈ ప్రదర్శన ఉద్యోగులకు ఓ సాంస్కృతిక పండుగను రుచి చూపించనుంది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి వాకిటీ, శ్రీనివాస్ మారి, హరిని గోలీ, యామిని, మనసా, దినేష్, కీర్తన్, ప్రణీత్, వెంకట్ బూర వంటి బోనాల కమిటీ సభులు పాల్గొన్నారు.

## త్వరలో జిపిఓలకు నియామక పత్రాలు

### రెవెన్యూ జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి

**హైదరాబాద్ జూలై, 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అతి త్వరలోనే గ్రామ పరిపాలన అధికారులు (జీపీఓ)కు నియామక పత్రాలను అందజేసి విధుల్లోకి తీసుకోనున్నారని రెవెన్యూ జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి అన్నారు. ఇప్పటికే జీపీఓ నియామకం కోసం పరీక్ష రాసి అర్హత సాధించిన 3,454 మందికి మొదటి విడతలో ఈ అవకాశం దక్కుతుందన్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ, సిసిఎల్‌ఏలోకేష్ కుమార్ గురువారం రెవెన్యూ ఉద్యోగ సంఘాలు డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ లోకేష్ కుమార్ దృష్టికి పలు విషయాలను లచ్చిరెడ్డి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఉన్న 10,954 గ్రామాలలో అదే సంఖ్యలో జీపీఓల నియామకం చేయాలన్నారు. కానీ ప్రస్తుతం 3,454 మంది మాత్రమే ఎంపిక అయ్యారని గుర్తు చేశారు. ఇదే కాకుండా ఆసక్తి కలిగిన పూర్వ వీఆర్ఎ, వీఆర్వోలకు మరో సారి జీపీఓ అర్హత పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. 61 ఏళ్లు దాటిన వీఆర్ఎల వారసులకు సైతం జీపీఓలుగా అవకాశం కల్పించాలని కోరారు. ఇంకా మిగిలిన పోస్టులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసేలా చూడాలన్నారు. అలాగే వీఆర్వోలను ఇతర డిపార్ట్‌మెంట్‌లలో సర్దుబాటు చేసే సమయం కంటే మృతి చెందిన వారి కుటుంబాలలో కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు.

సర్దుబాటు సమయంలో ఇతర జిల్లాలకు పంపిన పూర్వ వీఆర్ఎలను సొంత జిల్లాలకు బదిలీ చేయాల న్నారు. అన్ని అంశాలపై సీసీఎల్ఏ లోకేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఎంపికైన జీపీఓల, ఇతర విషయాలను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో చర్చించి అతి త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పని ఒత్తిడిని బట్టి కార్యాలయాలలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లతో కూడా భూభారతి సదస్సుల దరఖాస్తులు ఎంక్వైరీ చేయించడానికి జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు ఇస్తామన్నారు.

## గంట్యాడ, రాజాం మండల సమాఖ్యలకు జాతీయస్థాయిలో ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డ్స్



**విజయనగరం, జూలై 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయిలో 'ఆత్మనిర్భర్ సంఘటన్ అవార్డ్స్ 2024'కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లాలో రెండు మండల మహిళా సమాఖ్యలు ఎంపిక కావడం రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విజయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళలు, పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోందని ఆయన చెప్పారు. గ్రామీణాభివృద్ధి శాఖ, భారత ప్రభుత్వం అమలు చేస్తున్న దీన్ దయాళ్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా ఈ అవార్డులు ప్రకటించబడ్డాయని, స్వయం సహాయక సంఘాలు, గ్రామ సమాఖ్యలు మరియు క్లస్టర్ స్థాయి సమాఖ్యలు గ్రామీణ మహిళల జీవనోపాధిని మెరుగుపరిచిన విధానాన్ని గుర్తించి ఉత్తమ సమాఖ్యలను ప్రోత్సహించటమే ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశ్యం. దేశవ్యాప్తంగా నాలుగు ప్రాంతాల నుండి మొత్తం 22 సిఎల్‌ఎఫ్‌లు (మండల మహిళా సమాఖ్యలు/క్లస్టర్ మహిళా సమాఖ్యలు) ఎంపిక చేయబడగా, ఐదు సంవత్సరాల పైబడిన కేటగిరీలో విజయనగరం జిల్లా గంట్యాడ మండల మహిళా సమాఖ్య ప్రథమ బహుమతిని, శ్రీకాకుళం జిల్లా రాజాం మండల మహిళా సమాఖ్యతృతీయ బహుమతిని అందుకోనుండటం విశేషం. ఈ అవార్డుల ప్రధానోత్సవం 10 జూలై 2025న న్యూఢిల్లీలో నిర్వహించబడుతుంది. ఎంపికైన సమాఖ్యల కార్యవర్గ సభ్యులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రివర్యులు స్వయంగా అవార్డులు ప్రదానం చేయనున్నారు.

ఈ గౌరవం సాధించడంలో కీలక పాత్ర పోషించిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు. వారి నిరంతర సహకారం మరియు మార్గదర్శకతతో సమాఖ్యలు మరింత సమర్థవంతంగా పనిచేసినందుకు శుభాకాంక్షలు. ఈ విజయం ద్వారా దక్షిణాది రాష్ట్రాల నుండి ఐదు సంవత్సరాల పైబడిన కేటగిరీలో రెండు సిఎల్‌ఎఫ్‌లు (మండల మహిళా సమాఖ్యలు/క్లస్టర్ మహిళా సమాఖ్యలు) ఎంపిక కావటం మన రాష్ట్రానికి అరుదైన గౌరవంగా నిలుస్తుంది.



ధర్నాలో నినాదాలు చేస్తున్న ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు

## కంటిన్యుయేషన్ ఆర్డర్లను తక్షణమే జారీ చేయాలి

### ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూలై 3, ప్రభాతవార్త:** నాలుగు నెలల నుండి పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కంటిన్యుయేషన్ ఆర్డర్లను తక్షణమే జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కంటిన్యుయేషన్ సాధనకై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వెంకటేష్, ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శి జే.కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.కృష్ణారెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశపడ్డారని, కానీ 20 నెలలు గడుస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థలు, శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో కంటిన్యుయేషన్ ఆర్డర్లు జారీ చేయాలి, కానీ అనేక సంస్థలలో, శాఖలలో ఇప్పటి వరకు కొనసాగింపు ఉత్తర్వులు రాకపోవటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నేతలు వై.సోమన్న, టి.సాంబయ్యలతోపాటు వివిధ యూనియన్ నాయకులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# 'సోలో బాయ్' విడుదలకు సిద్ధం

సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బిగ్ బాస్ ఫేమ్ గౌతమ్ కృష్ణ హీరోగా రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి హీరోయిన్స్‌గా నవీన్ కుమార్ దర్శకత్వంలో సతీష్ నిర్మాతగా జులై 4వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. త్రిలోక్ సుద్దు ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా చేయగా ప్రవీణ్ పూడి ఎడిటింగ్ చేశారు. సోలో బాయ్ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో చిత్ర నిర్మాత సతీష్ మీడియా వారితో ఇంటర్వ్యూలో పాల్గొని మీడియావారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం జరిగింది. **సోలో బాయ్ చిత్ర ప్రస్థానం ఎలా మొదలైంది?**




సోలో బాయ్ చిత్ర హీరో గౌతమ్ కృష్ణ నాకు చాలా మంచి స్నేహితుడు. అతను ఈ సినిమా లైన్ చెప్పినప్పుడు మధ్యతరగతి కుటుంబంలోని 17 సంవత్సరాల నుండి సెటిల్ అవ్వడానికి పడే కష్టం తాలూకా పాయింట్ నాకు చాలా బాగా నచ్చింది. **ప్రొడక్షన్ విషయంలో మీరు తీసుకున్న జాగ్రత్తలు ఏంటి?** అనవసరమైన ఖర్చులు ఎక్కడ పెట్టకుండా ప్రతి విషయంలో జాగ్రత్తపడి ఖర్చు పెట్టాము. చిత్రానికి పనిచేసిన యంగ్ టీం అంతా తక్కువ రెమ్యూనరేషన్ తీసుకుంటూ సినిమాకు బాగా సపోర్ట్ చేశారు. **ప్రస్తుత సినిమాలపై, బయట మార్కెట్ పై మీ ఉద్దేశం ఏంటి?** గతంలో బట్టల రామకృష్ణ బయోపిక్ సినిమా తీసినప్పుడు ఒక ఎక్స్పరిమెంట్ లాగా చేశాము. అది మాకు వర్కౌట్ అయింది. ఇప్పుడు ఆ సమయంలో నేర్చుకున్న వాటిని బేస్ చేసుకుని తగ్గ జాగ్రత్తలు తీసుకుంటూ సోలో బాయ్ సినిమా చేశాము. **సినిమా రన్ టైమ్ ఎం? ఎన్ని థియేటర్లలో విడుదల కానుంది?** ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకునేప్పటికీ రెండు గంటల పది నిమిషాలు ఫైనల్ అవుట్ పుట్ వచ్చింది. గౌతమ్ కృష్ణ బిగ్బాస్ ఫేమ్ **సినిమాకు ఎంతవరకు ప్లస్ అవుతుంది?** గౌతమ్ ఈ సినిమా ప్రమోషన్లలో 100 మంచి సపోర్ట్ ఇస్తున్నారు. బిగ్ బాస్ రెండు సీజన్లో ఉండటం వల్ల అతని ఫేమ్ ఈ సినిమాకు మరింత తోడ్పడు తుంది అనుకుంటున్నాను.

# 'హరి హర వీరమల్లు' ట్రైలర్ లాంచ్

పవన్ కళ్యాణ్ చారిత్రక యోధుడిగా కనువిందు చేయనున్న చిత్రం హరి హర వీరమల్లు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఎ.దయాకర్ రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పీరియాడికల్ డ్రామాకు ఎ.ఎం.జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. జూలై 24న విడుదల కానున్న హరి హర వీరమల్లు సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలకు విశేష స్పందన లభించింది. తాజాగా విడుదలైన ట్రైలర్‌తో అంచనాలు రెట్టింపు అయ్యాయి. జూలై3 (గురువారం) హైదరాబాద్‌లోని విమల్ థియేటర్‌లో హరి హర వీరమల్లు ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. అలాగే అభిమానుల కోసం దేశవ్యాప్తంగా పలు థియేటర్లలో ట్రైలర్‌ను ప్రదర్శించారు. భారీ సంఖ్యలో అభిమానులు తరలి రావడంతో థియేటర్లన్నీ కళకళలాడాయి. హరి హర వీరమల్లు ట్రైలర్‌ను మూడు నిమిషాల నిడివితో రూపొందించారు. ట్రైలర్‌లో ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా ఉంది. పవన్ కళ్యాణ్ మునుపెన్నడూ చూడని విధంగా సరికొత్తగా కనిపిస్తున్నారు. ఢిల్లీ సుల్తానుల నుండి సనాతన ధర్మాన్ని రక్షించడానికి నడుం బిగించిన యోధుడు, మొఘల్ శక్తిని ధిక్కరించిన వీరుడు వీరమల్లుగా పవన్ కళ్యాణ్ కనిపించిన తీరు కట్టిపడేసింది. మొఘల్ సామ్రాజ్యంలో అత్యంత అపఖ్యాతి పాలైన పాలకులలో ఒకరైన ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్ భయంకరంగా కనిపిస్తున్నారు. కోహినూర్ వజ్రం కోసం పోరాటం, మొఘలులతో వీరమల్లు తలపడటం వంటి సన్నివేశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. గంభీరమైన రూపాన్ని కనబరుస్తూ, సనాతన ధర్మం పట్ల మక్కువను వ్యక్తపరుస్తూ.. భయమనేది ఎరుగని వీరుడు వీరమల్లుగా పవన్ కళ్యాణ్ కనిపించిన తీరు నభూతో నభవిష్యత్. వీరమల్లు పాత్ర కోసం తనని తాను మలచుకున్న తీరు అమోఘం. యాక్షన్ సన్నివేశాల్లో పవన్ కళ్యాణ్ మరింతగా ఆకట్టుకున్నారు. తన అద్భుతమైన అభినయం, ఆహార్యంతో వీరమల్లు పాత్రకు ప్రాణం పోశారు. ట్రైలర్‌లోని ఆంధి వచ్చేసింది అనే డైలాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ కళ్యాణ్



స్ఫూర్తిదాయక రాజకీయ ప్రయాణాన్నిఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన మాటను గుర్తు చేసేలా ఉన్న ఈ డైలాగ్.. అభిమానుల రోమాలు నిక్కబొడిచేలా చేస్తోంది. అందరూ నేను రావాలని దేవుడిని ప్రార్థిస్తారు.. కానీ మీరు మాత్రం నేను రాకూడదని కోరుకొంటున్నారు అనే మరో డైలాగ్ కూడా పవన్ కళ్యాణ్ ప్రస్తుత ఇమేజ్ కి తగ్గట్టుగా అభిమానులు మెచ్చేలా ఉంది.


# 25న 'ఫెంటాస్టిక్ ఫోర్:ఫస్ట్ స్టెప్స్' రిలీజ్



రీడ్ రిచర్డ్స్ (మిస్టర్ ఫెంటాస్టిక్) పాత్రలో పెడ్రోపాస్కల్ ఫెంటాస్టిక్ ఫోర్ నాయకుడు, రీడ్ రిచర్డ్స్ తన శరీరాన్ని తిరిగి ఆకృతి చేయడానికి తన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాడు. కానీ ఈ వెర్షన్ ఒక కొత్త మలుపును పరిచయం చేస్తుంది: రీడ్ రబ్బరు లాగా ఉండడమే కాకుండా, అతను స్థలాన్ని కూడా తారుమారు చేస్తాడు, దాదాపు అపరిమిత స్థితిస్థాపకతను అనుమతిస్తాడు. అతని మానవాతీత తెలివితేటలతో కలిపి, అతను యొక్క అత్యంత బలీయమైన శాస్త్రీయ మనస్సులలో ఒకరిగా మిగిలిపోయాడు. అతని సాగతీత క్వాంటం షిమ్మర్‌తో చిత్రీకరించబడింది. సూ స్టార్మ్ (ఇన్విజిబుల్ ఉమెన్)గా వెనెస్సా కిర్బీ తరచుగా తక్కువ అంచనా వేయబడిన సూ స్టార్మ్ జట్టు యొక్క వ్యూహాత్మక మరియు భావోద్వేగ మిళితమైన వ్యక్తిగా ఉద్భవిస్తుంది. ఆమె తనను మరియు ఇతరులను అదృశ్యంగా మార్చుకోగలదు, కానీ ఆమె నిజమైన బలం క్షిపణుల నుండి ఇంటర్ డైమెన్షనల్ శక్తి వరకు దాడులను నిరోధించేంత శక్తివంతమైన సైయోనిక్ శక్తి క్షేత్రాలను ఉత్పత్తి చేయడంలో ఉంది.

# బెస్ట్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ మూవీ 'తమ్ముడు'

సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. నితిన్ హీరోగా దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమ్ముడు సినిమా ఈ నెల 4న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్‌ను ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో తెలిపారు ప్రొడ్యూసర్ దిల్ రాజు. శ్రీరామ్ వేణు మా సంస్థలో ఆర్య నుంచి వర్క్ చేస్తున్నాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా, అసోసియేట్ డైరెక్టర్‌గా, స్క్రిప్ట్ రైటర్‌గా మాతోనే ట్రావెల్ చేస్తున్నాడు. శ్రీరామ్ వేణు మా దగ్గరనే ఉన్నాడంటే అందుకు మా మధ్య ఉన్న రిలేషన్, వేవ్ లెంగ్త్ కారణం. ఇండస్ట్రీలో డబ్బుతోనే పనులు జరుగుతుంటాయి. నాది భిన్నమైన పద్ధతి. నేను వేవ్ లెంగ్త్ కలిసిన వాళ్లతోనే జర్నీ చేస్తుంటాను. అనిల్ రావిపూడి, శ్రీకాంత్ అడ్డాల, హరీశ్ శంకర్, వంశీ పైడిపల్లి, దశరథ్..ఇలా డైరెక్టర్స్ మా సంస్థలో వర్క్ చేసి హిట్ చిత్రాలు ఇచ్చారు. శ్రీరామ్ వేణు మా సంస్థలోనే ట్రావెల్ అవుతున్నాడంటే అతనికి భారీగా డబ్బు ఇవ్వడం వల్ల కాదు. మాతో ఆయనకు ఒక కంఫర్ట్ ఉంటుంది. అనిల్ రావిపూడితో నాకొక బాండింగ్ ఉంది. ఆ బాండింగ్ లో ఒక కంఫర్ట్ ఉంటుంది. ఈ డైరెక్టర్స్ టాలెంట్ నాకు తెలుసు. కాబట్టి కథ టైమ్ లో, ఎడిటింగ్ టేబుల్ దగ్గర నాకు అనిపించినవి అడుగుతా. నేను క్వశ్చన్ అడిగితే ఎందుకు అడిగాడు అని ఆలోచిస్తారు. అంతే గానీ వారి పనిలో ఇంటర్ ఫియర్ కాను. తమ్ముడు మూవీ మొదటి 20 నిమిషాల తర్వాత మిగిలిన కథంతా ఒక్కరోజులో జరుగుతుంది. ఐదారు యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయి. వాటిలో రెండు యాక్షన్ ఎపిసోడ్స్ వైలెంట్‌గా ఉన్నాయని ఎ సర్టిఫికెట్ ఇస్తామని సెన్సార్ వాళ్లు చెప్పారు. ఆ రెండు ఎపిసోడ్స్ తీసేస్తే యు బై ఎ ఇస్తామని చెప్పారు. ఈ సినిమాను థియేటర్ ఎక్స్పీరియన్స్ కోసమే చేశాం కాబట్టి ఆ ఫైట్ సీక్వెన్సులు తీసేయకుండా ఎ సర్టిఫికెట్ కు అంగీకరించాం. ఇది సంక్రాంతికి వస్తున్నాం లాంటి ఎంటర్ టైనర్ అయితే ఫ్యామిలీ ఆడియెన్స్ అందరూ రండి అని చెబుతాం. తమ్ముడు మూవీ యాక్షన్ ఓరియెంటెడ్ కంటెంట్ ఉన్న మూవీ. థియేటర్స్‌కు వచ్చిన వాళ్లనైనా సంతృప్తి పరచాలి కదా అని ఎ సర్టిఫికెట్ తీసుకున్నాం. ఈ చిత్రాన్ని 150 రోజులు చిత్రీకరించారు. 80 పర్సెంట్ మూవీ అడవిలో ఉంటుంది. విజువల్స్, సౌండింగ్ హై క్వాలిటీతో ఉంటూ థియేటర్‌లో ఎంజాయ్ చేసేలా రూపొందించారు దర్శకుడు శ్రీరామ్ వేణు. పైరసీ అరికట్టేందుకు ఇండస్ట్రీ నుంచి గట్టి చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో సపోర్ట్ చేస్తోంది.







# 'అఖండ 2'లో భజరంగీ భాయీజాన్ బాలనటి

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను హైలీ యాంటిసిపేటెడ్ అఖండ 2: తాండవం కోసం నాల్గవ సారి కొలాబరేట్ అయ్యారు. ఈ హైఆక్టేన్ సీక్వెల్ కథ, స్కేల్, నిర్మాణం, సాంకేతిక నైపుణ్యం.. ప్రతి అంశంలో అఖండను మించి ఉంటుదని హామీ ఇస్తోంది. ప్రతిష్టాత్మకమైన 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట అత్యంత భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎం. తేజస్విని నందమూరి సగర్వంగా సమర్పిస్తున్నారు. మేకర్స్ జననిగా హర్షాలీ మల్హోత్రా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. సల్మాన్ ఖాన్ బజరంగీ భాయిజాన్‌లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా కనిపించిన హర్షాలీ మల్హోత్రా అఖండ 2తో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. ఆమె సాంప్రదాయ చీరలో అందమైన చిరునవ్వుతో అద్భుతంగా కనిపిస్తుంది. ఈ చిత్ర టీజర్‌కు నేషనల్ వైడ్‌గా ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. టీజర్‌లో బాలకృష్ణ మునుపెన్నడూ చూడని అవతార్‌లో కనిపించారు. టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తున్నారు. ఆది పినిశెట్టి పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తోంది. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. సి రాంప్రసాద్ డీవోపీగా పని చేస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. ఎఎస్‌ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. అఖండ 2 దసరా కానుకగా సెప్టెంబర్ 25న భారీ స్థాయిలో పాన్‌ఇండియా రిలీజ్ కానుంది. నటీనటులు: గాడ్‌ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా.



# 'మార్గన్' సక్సెస్ మీట్

విజయ్ ఆంటోని నటిస్తూ, నిర్మించిన మార్గన్ చిత్రానికి లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంతో తన మేనల్లుడు అయిన అజయ్ ధీషన్‌ను విజయ్ ఆంటోని తెరకు పరిచయం చేశారు. ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మించగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్‌పై జె.రామాంజనేయులు సగర్వంగా సమర్పిం చారు. ఈ సినిమాను జూన్ 27న సురేష్ బాబు తెలుగులో రిలీజ్ చేశారు. రిలీజ్ అయిన ఈ చిత్రానికి మంచి రెస్పాన్స్ దక్కింది. ఈ క్రమంలో చిత్రయూనిట్ థాంక్యూ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో.. విజయ్ ఆంటోని మాట్లాడుతూ, మార్గన్ సినిమాను సురేష్ బాబు, రామాంజనేయులు చాలా గ్రాండ్‌గా తెలుగులో రిలీజ్ చేశారు. ఇకపై నా సినిమాల్ని తెలుగులో రిలీజ్ చేస్తానని సురేష్ బాబు అన్నారు. నాకు ఇంత మంచి మూవీని ఇచ్చిన లియో జాన్ పాల్‌కు థాంక్స్. అజయ్‌ను ఇంత బాగా లాంచ్ చేసినందుకు నాకు చాలా సంతోషంగా అనిపించింది. తెలుగు, తమిళంలో అజయ్‌కు మంచి పేరు వచ్చింది. అజయ్ ఇకపై ఇలానే మంచి కంటెంట్ చిత్రాల్ని చేస్తూ ఆడియెన్స్ నుంచి ప్రేమను సంపాదిస్తూనే ఉండాలి. బిచ్చగాడు 2, రోమియో చిత్రాలకు అజయ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పని చేశారు. అజయ్‌తో కలిసి నేను ఇక స్ట్రెయిట్



తెలుగు సినిమాల్ని నిర్మిస్తాను. తమిళంలో ప్రస్తుతం ఏడు చిత్రాల్ని చేస్తున్నాను. అందులో తెలుగు డబ్బింగ్ కోసం మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాను. త్వరలోనే భద్రకాళి రానుంది. అదొక పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్. మార్గన్‌ను ఇంత పెద్ద సక్సెస్ చేసిన తెలుగు ఆడియెన్స్‌కు థాంక్స్ అని అన్నారు. అజయ్ ధీషన్ మాట్లాడుతూ, మార్గన్ సినిమాకు తెలుగులో ఇంత సక్సెస్ వస్తుందని అనుకోలేదు. ఇది తమిళ చిత్రం అయినా కూడా తెలుగు ఆడియెన్స్ పెద్ద విజయాన్ని అందించారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన విజయ్ ఆంటోనీకి, ఫాతిమా విజయ్ ఆంటోనికి థాంక్స్. నాకు సపోర్ట్ చేసిన లియో జాన్ పాల్‌కి థాంక్స్. మా మూవీని తెలుగులో ఇంతబాగా రిలీజ్‌చేసిన సురేష్, రామాజనేయులుకి థాంక్స్ అని అన్నారు. భాష్య శ్రీ మాట్లాడుతూ, మార్గన్ మూవీని ఫస్ట్ నుంచి లాస్ట్ వరకు కూడా ఆడియెన్స్ అలా సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా ఫీల్ అయ్యారు. ఈ చిత్రానికి నేను మాటలు, పాటలు రాశాను. నా మీద నమ్మకంతో నాకు ఈ అవకాశం ఇచ్చిన విజయ్ ఆంటోనికి థాంక్స్ అని అన్నారు.

# నా మాటల్ని అపార్థం చేసుకోవద్దు: నిర్మాత శిరీష్ రెడ్డి

తెలుగు సినీ ప్రేక్షకులకు, మెగా అభిమానులకు నమస్కారం. మా ఎస్వీసీ సంస్థకు, రామ్ చరణ్‌కి, చిరంజీవికి ఎంతో అవినాభావ సంబంధం ఉంది. చరణ్‌కి నాకు మంచి అనుబంధం ఉంది. నేను అభిమానించే హీరోల్లో రామ్ చరణ్‌ఒకరు. ఆయన్ని అవమానపరచడం గాని, కించపరచడం గాని నా జన్మలో ఎప్పుడూ చేయను. నేను ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన గురించి చిన్న మాట దొర్లినా అది నా తప్పే. అది జరిగిందని అభిమానులు అనుకుంటున్నారు కాబట్టి నిజంగానే క్షమాపణలు చెబుతున్నాను. చరణ్ గారికి కూడా క్షమాపణలు చెబుతున్నాను. చరణ్‌తో నాకు ఉన్నటువంటి రిలేషన్‌షిప్‌ను పాడుచేసుకోదల్చుకోలేదు. ఈరోజు జనం మాట్లాడుకుంటున్న మాటలు, బయట ట్రోలింగ్, అభిమానుల బాధలు నేను అర్థం చేసుకోగలను. ఎందుకంటే ఒక హీరోని అలా అన్నప్పుడు ఎవరూ భరించలేరు. నేను అన్న ఇంటెన్షన్ అది కాదు. మాకున్న రిలేషన్‌షిప్ కోణంలో నేను మాట దొర్లాను తప్పా ఆయన్ని అవమానపరచడానికి కాదు. మెగా హీరోలందరి తోనూ మాకు మంచి అనుబంధం ఉంది. వరుణ్ తేజ్‌తో ఫిదా చేశాం. సాయితేజ్‌తో రెండు సినిమాలు చేశాం. చరణ్‌తో రెండు సినిమాలు చేశాం. చిరంజీవి దిల్‌రాజుతో, మాతో మాట్లాడుతూనే ఉంటారు. ఇంత మంచి అనుబంధం ఉన్నవారిని అవమానపరిచే అంత మూర్ఖుడిని కాదు. దయచేసి అభిమానులందరూ అర్థం చేసుకోవాలి. సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం చరణ్ ఒప్పుకోకపోతే ఆ సినిమా రిలీజ్ అయ్యేది కాదు. ఆయన మనసు గొప్పది కాబట్టి ఆ సినిమాను కూడా రిలీజ్ చేసుకోండి అని ఒక గొప్ప మనసుతో ఒప్పుకున్న వ్యక్తి చరణ్. ఆయన్ని ఎందుకు అవమాన పరుస్తాం. నా మాటల్ని అపార్థం చేసుకోవద్దని కోరుతున్నాను. ఫ్యాన్స్‌కి క్షమాపణలు చెబుతున్నాను. దయచేసి మా రిలేషన్‌ను పాడు చేయొద్దు. మళ్లీ నెక్స్ట్ ఒక ప్రాజెక్టు రెడీ అయింది. నెక్స్ట్ చరణ్‌తో సినిమా తీయబోతున్నాను. మా ఇద్దరి మధ్య ఎలాంటి అభిప్రాయ భేదాలు తీసుకురావద్దని అందర్నీ వేడుకుంటున్నాను. తెలుగు ప్రజలందరూ కూడా గమనించాలి. నాకు చరణ్‌తో మంచి రిలేషన్ ఉంది. ఆయన గురించి నేను ఎప్పుడూ తప్పుగా మాట్లాడను. నేను ఫస్ట్ ఇంటర్వ్యూ ఇచ్చాను కాబట్టి, నాకు తెలియకుండా ఏదైనా మాట దొర్లిందేమో. అది కూడా అర్థం చేసుకోవాలని అందరిని కోరుతున్నాను. థాంక్యూ వెరీ మచ్.



# నేడే విడుదల 'షోటైం'

అనిల్ సుంకర ప్రొడ్లీ ప్రెజెంట్.. స్కై లైన్ మూవీస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కిషోర్ గరికిపాటి నిర్మాతగా మదన్ దక్షిణామూర్తి దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం షో టైం. నవీన్ చంద్ర హీరోగా కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తున్న వినూత్నమైన థ్రిల్లర్ చిత్రం జూలై 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు రంగం సిద్ధమైంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర ప్రెజెంట్ చేస్తున్నారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించారు. షో టైమ్ మూవీ జర్నీ ఎలా స్టార్ట్ అయింది అనే ప్రశ్నకు నవీన్ చంద్ర సమాధానం చెప్పారు. డైరెక్టర్ మదన్ స్టోరీ చెప్పినప్పుడు చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఒక ఫ్యామిలీలో తక్కువ క్యారెక్టర్ల నడుమ సాగే ఈ కథలో ఎన్నో మలుపులు ఉన్నాయి. ప్రతీ అంశం ప్రేక్షకుడిని రంజింప చేస్తుంది అన్నారు. పోలీసు ఆఫీసర్ కామెడీనా? స్ట్రిక్ట్ ఆఫీసర్ అంటే క్యారెక్టర్ యాక్టర్ రాజా రవింద్ర మాట్లాడు.. ఇందులో చాలా మంచి పోలీసు క్యారెక్టర్ చేశాను అన్నారు. అయితే క్యారెక్టర్ చాలా సీరియస్‌గా ఉన్నా.. ప్రేక్షకులకు మాత్రం మంచి ఎంటర్ టైన్ మెంట్ ఇస్తుందన్నారు. ఆఫీసర్ లుక్ కోసం తీసుకున్న జాగ్రత్తలు గురించి మాట్లాడుతూ, పెద్దగా కష్టపడలేదు కానీ ఫిట్ నెస్ మేయింటైన్ చేసినట్లు చెప్పారు. ఇదే ప్రశ్నకు హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ, రాజా రవింద్రది ఒక విచిత్రమైన పర్సనాలిటీ అని ఆయన పాత్రలో ఇట్టే పరకాయ ప్రవేశం చేస్తారు. అందిరిలా మెథడ్ యాక్టింగ్ ఫాలో కాదు... అందరితో నవ్వుతూ.. నవ్విస్తూ.. సరదగా ఉంటాడు.. ఆయన షాట్ రెడీ అవగానే స్ట్రిక్ట్‌గా మారిపోతాడు అని చెప్పారు. ఇలాంటి జోనర్స్ మలయాళంలో ఎక్కువగా వస్తాయి.. తెలుగులో వర్కౌట్ అవుతాయా? అంటే కచ్చితంగా ప్రేక్షకులు ఆదరిస్తారని డైరెక్టర్ మదన్ దక్షిణామూర్తి చెప్పారు.దృశ్యం సినిమాలా అనిపించింది.. ఇది కూడా ఫ్యామిలీని కాపాడే కథే కదా అనే ప్రశ్నకు.. డైరెక్టర్ సమాధానం చెబుతూ.. అంత పెద్ద సినిమాతో పోల్చడం సంతోషంగా ఉంది కానీ ఇది దృశ్యం సినిమాకు భిన్నంగా ఉంటుంది. ట్రైలర్ చూసి ఇదే సినిమా ఫిక్స్ అవకండి... సినిమా చాలా కొత్తగా, చాలా ఆసక్తిగా ఉంటుందన్నారు. షో టైమ్ అని టైటిల్ పెట్టడానికి కారణం ఏంటి? అని మీడియా ప్రశ్నకు.. ఈ సినిమా చూసిన తరువాత ఈ టైటిల్ కరెక్ట్ అని ప్రేక్షకులే అంటారు. ఇది కచ్చితంగా షో టైమ్ అని చెప్పారు. ఎక్కువగా థ్రిల్లర్ జోనర్లే ఎందుకు ఎంచుకుంటున్నారు అని నవీన్ చంద్రను ప్రశ్నించగా.. ఒకే రకమైన సినిమాలు చేయాలని ఎవరికి ఉండదు.. కానీ ఇది సీరియస్ ఇన్విస్టిగేషన్ సినిమా కాదు.. ఇందులో ప్రేక్షకులను ఆకర్షించే అనేక అంశాలు ఉన్నాయి అని చెప్పారు. స్క్రిప్ట్ సెలెక్షన్స్ చాలా బాగుంటాయి కదా... ఏమైన జాగ్రత్తలు తీసుకుంటారా అంటే.. కచ్చితంగా మంచి స్క్రిప్ట్ ను ప్రేక్షకులకు అందించాలనే తపన ఉంటుంది అని హీరో నవీన్‌చంద్ర చెప్పారు. నరేష్ లాయర్‌గా చేశారు, రాజారవింద్ర పోలీసుగా చేశారు కదా.. వీరిద్దరి మధ్య కాంబినేషన్ సీన్స్ ఎలా ఉంటాయి అంటే.. వీరిద్దరి కాంబినేషన్ చాలా బాగుంటుంది. థియేటర్లో వీరి కాంబినేషన్ వచ్చినప్పుడు నవ్వులే నవ్వులు.. ఇంకో రెండురోజుల్లో ఆ మ్యాజిక్ చూస్తారు కదా అంటూ హీరో సమాధానమిచ్చారు.విడుదలైన ట్రయిలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ప్రేక్షకుడిని థియేటర్లో కట్టిపడేసి, అన్ని వర్గాల ప్రేక్షకులను రంజింపజేసే అద్భుతమైన థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు కడుపుబ్బ నవ్వించే కామెడీ ఉందని తెలుస్తుంది.



# గోరింటా పూసింది



ఆషాడ మాసపు వర్షపు జల్లులకు కొత్త చివుర్లు తొడిగి, నిండా ఆకులతో ఉల్లాసంగా కనిపిస్తుంది. గోరింట చెట్టు. అత్తవారింటే నుంచిపుట్టింటికి చేరిన నవ వధువు, మరదలిని ఆటపట్టించే వదినలు, ఆజాయిషీ చేస్తూ తిరిగే అత్తలు, ఆటపాటలతో సందడి చేసే యువతులు.. అందరినీ కట్టిపడేసి కుదురుగా కూర్చోబెట్టి, ఎర్రని పంట కోసం ఎదురు చూపుల సహనాన్ని అలవాటు చేస్తుంది కోరింట. ఈ కాలమే ఎందు కంటే..

* ఆషాడంలో వర్షాలు పడు తుంటాయి. ఇన్ఫెక్షన్లు, అంటు వ్యాధుల వ్యాప్తికి అవకాశాలు ఎక్కువ. అలాగే, చల్లబడిన బయటి వాతావరణానికి, శారీరక వేడికి సమతుల్యత లోపిస్తుంది. దీనిని బ్యాలెన్స్ చేసే శక్తి గోరింటాకకు ఉంటుందనేది పెద్ద చెప్పే మాట.
* వర్షాల కారణంగా నీళ్లలో తరచూ పాదాలు తడుస్తుంటాయి. ఇలాంటప్పుడు పాదాల చర్మానికి సూక్ష్మక్రిముల వల్ల ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది.
* గోళ్లకు కూడా గోరింటాకు పెట్టడం వల్ల గోళ్లు పెళుసుబారడం, గోరుచుట్టు రావడం వంటి సమస్యలు దరిచేరవు.
* ఎర్రగా పండిన చేతులను చూసుకొని ఎంతగానో మురిసిపోయే వనితలు గోరింటాకును సౌభాగ్యానికి ప్రతీకగానూ భావిస్తారు.



గోరింటాకు ప్రాముఖ్యతను తెలుసుకోవడమే కాదు మహిళలంతా ఒకచోట చేరి, వేడుకలా మార్చుకుంటున్నారు. వివాహ వేడుకల్లో మెహిందీ ఫంక్షన్‌కు ఉన్న ప్రధాన్యత ఆషాడం గోరింటాకుకూ వర్తింపజేస్తున్నారు.

# ఎయిమ్స్‌లో తొలి మహిళా డైరెక్టర్



**ఆమె స్నేహ్ భార్గవ రేడియాలజిస్ట్, అడ్మినిస్ట్రేటర్ పనిచేశారు. ప్రొఫెసర్ ప్రత్యేక ఎయిమ్స్ చరిత్రలోనే డైరెక్టర్‌గా చేసిన ఒకే ఒక్క మహిళ, భారతీయ తొలి మహిళా రేడియాలజిస్ట్ విశేష కృషి దక్షిణాసియాలోనే తొలి సీటీ స్కానర్ ఎయిమ్స్‌లో ఏర్పాటయ్యేలా చేయడం. ప్రస్తుతం రచన, వైద్యశాస్త్రంలోని కొత్త ఆవిష్కరణ ఏఐ గురించి తెలుసుకోవడం. 'ద ఉమెన్ హూ రాన్ ఎయిమ్స్' పుస్తకంతో వార్తల్లో నిలిచారు. ఇందులో ఆమె రాసుకన్న కొన్ని సంగతులు తెలుసుకుందాం.**

అక్టోబర్ 31, 1994 ఎయిమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నా. ఇంకా డెస్క్‌లో కూర్చోలేదు. ప్రధాని వచ్చారని ముందుగా చెప్పకుండా రాదుకదా అనుకుంటూ వెళ్లేసరికి కనిపించారు. ఇందిర...స్ట్రెచర్‌మీద రక్తమయం.. షాక్ నుంచి తేరుకుని ఆపరేషన్‌థియేటర్‌కి పంపించమని చెబుతూనే పల్స్ చూశాం అప్పటికే నాడి అందడం లేదు అమెను బతికించడానికి శాయశక్తులా ప్రయుత్నంచాం ఆపై రాజీవ్ గాంధీ వచ్చే వరకు విషయాన్ని బయటకు పొక్కకుండా చికిత్స చేస్తున్నామని నమ్మించల్సిన పరిస్థితి. అలా ఆ రోజు నేను డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నదీ.. ఇందిరాగాంధీ మరణించినదీ ఒకే రోజు కావడం బాధాకరం. దాన్నుంచి తేరుకుని జనాగ్రహం నుంచి మా సిక్కు మత సిబ్బంది, విద్యార్థుల రక్షణ కోసం పోలీసుల సాయం తీసుకున్నా. ఆ సమయంలో ఢిల్లీలో చెలరేగిన హింసలో ఎంతోమంది గాయపడ్డారు. వాళ్లంతా ఆసుపత్రులకి వెళ్లే పరిస్థితీ లేదు. దాంతో మా వైద్యుల్నే వాళ్ల ఇళ్లకి దగ్గర్లోని పాఠశాలల్లో ఓపి విధుల్ని నిర్వర్తించేలా చేశాను. రోగనిర్ధారణలో అపార నైపుణ్యం గడిచా. మా విభాగంలో ఓ బోర్డు మీద మనసుకు తెలియనది కన్ను చూడదు అని రాసుండేది. అందుకే సబ్జెక్టులో అప్ టు డేట్‌గా ఉంటూ రోగాన్ని కచ్చితంగా కనిపెట్టేదాన్ని. దాంతో నాకు మూడోకన్ను ఉందనేవారు. ఎయిమ్స్‌లో వీఐపి సంస్కృతి ఎక్కువ. ఒకసారి మంత్రి బంధువులు నిబంధనలకి విరుద్ధంగా గదిలో ఉన్నారు. నేను వాళ్లను బయటకు వెళ్లమంటే.. అదే జరిగితే ఆసుపత్రి పగులుగొడతా అన్నారాయన. బదులుగా సంస్థ గోడలు, నా భుజాలు మరీ అంత బలహీనంగా లేవు. నేను ఇక్కడున్నంతవరకూ నిబంధనలు పాటించాల్సిందే అన్నా. 1961లో ఎయిమ్స్ రేడియాలజీ విభాగంలో చేరా. అప్పటికి అక్కడ ఇద్దరు టెక్నీషియన్లు, పాత సామాన్లే ఉండేవి. అప్పట్లో రోగి శరీరంలోపల చూడటానికి ఏకైక మార్గం ఎక్స్-రే. అయినా రేడియాలజీ పట్ల గౌరవం లేదు. వాళ్లనో ఫొటోగ్రాఫర్లుగా బ్యాక్ ఆఫీస్ ఉద్యోగులుగా చూసేవారు. ఆ విభాగానికికో గుర్తింపు తేవడానికి చాలా కష్టపడ్డా. ఇందిగాంధీ నన్ను డైరెక్టర్‌గా నియమించారు. కానీ కొన్ని ఫార్మాలిటీస్ మిగిలున్నాయి. దాంతో నా నియామకం చెల్లదనే అన్నారంతా. ఎయిమ్స్‌లాంటి సంస్థను ఓ మహిళ నడపగలదా అన్నది మరికొందరి సందేహం. అయితే ప్రధానిగా రాజీవ్‌గాంధీ సంతకం చేసిన తొలి ఫైళ్లలో నాదీ ఒకటి. ఓ మహిళ దేశానికి ప్రధానిగా చేయగలిగినప్పుడు నేను ఎయిమ్స్ డైరెక్టర్‌గా చేయలేనా అనుకున్నా. ఆరేళ్ల పూర్తి పదవీ కాలాన్ని బాధ్యతగా నిర్వర్తించా శక్తిమంతమైన నాయకురాలిగా పేరు తెచ్చుకున్నా. రేడియాలజీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన నాకు, మొదట్లో అదేమీ ఇష్టం కాదు. ఢిల్లీలో ఎంబిబిఎస్ అయ్యాక స్పెషలైజేషన్ ఎందులో చేయాలా అని ఆలోచించా. పిజి కోసం లండన్‌కి వెళ్లినప్పుడు రేడియాలజీలోనే సీటు వచ్చింది. ఆ బ్యాచ్‌లో ఏకైక మహిళను రేడియాలజిస్ట్ అర్హత సాధించిన తొలి భారతీయురాలిని కూడా. 70లో న్యూయార్క్ కాన్ఫరేన్స్‌కి వెళ్లినప్పుడు-గాడ్ ఫ్రే హౌన్స్‌ఫీల్డ్ ప్రపంచానికి పరిచయం చేసిన సీటి స్కానర్ చూసి ఆశ్చర్యపోయా. మెదడు లోపల చూడగలగడం. ఎంత గొప్ప సంగతి. అది రేడియాలజీలోనే పెద్ద విప్లవం. ఎలాగైనా ఆ పరికరాన్ని ఎయిమ్స్‌కు



తీసుకురావాలనుకున్నా. వృథా ఖర్చు అని కొందరు వెనక్కి లాగారు. కానీ పట్టుదలతో దక్షిణాసియాలోనే తొలి సిటీ స్కానర్ ఎయిమ్స్‌లో ఏర్పాటయ్యేలా చేశా. అల్ట్రాసౌండ్ మెషీన్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్, ఫెర్టిలిటీ సెంటర్ రావడానికీ కృషిచేశా. మూడు దశాబ్దాల పదవీకాలంలో ఎన్నో కొత్తననగాలతోపాటు మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకీ కృషిచేశా. 'ద నేషనల్ మెడికల్ జర్నల్ ఆఫ్ ఇండియా' స్థానమునకు కారణమైన సభ్యుల్లో నేనూ ఉన్నా. ఎయిమ్స్‌లో రిటైరయ్యాక రెండు ఆసుపత్రుల్లో తొంభై ఏళ్ల వచ్చే వరకూ పనిచేశా. ఆపై కొవిడ్ కారణంగా ఇంటికే పరిమితమై పుస్తకాలు రాస్తున్నా. ఇప్పటికీ బిజీగా ఉండటమే ఇష్టం. ఈ వయసులోనూ ఉదయాన్నే కాసేపు నడుస్తా. 40ల నుంచి గార్డెనింగ్, యోగాలను అలవాట్లుగా మార్చుకున్నా. గ్రీన్ టీ, కొబ్బరినీళ్లు, ఇంట్లో చేసిన ధోక్లా.. నా రోజువారీ ఆహారంలో తప్పక ఉంటాయి. ఇవే నా ఆరోగ్య రహస్యం.

ఓ రేడియాలజిస్ట్‌గా ఏఐ ద్వారా మానవ శరీరాన్ని మరింత లోతుగా పరిశీలించాలని ఉంది. అప్పట్లో నాకా అవకాశం లేదు. ఏఐ మెడికల్ పరీక్షలకు ఎంతో దోహదపడుతుంది. అయితే పేషెంట్ హిస్టరీ అనేదీ కీలకమే. పరీక్షల్లో ఎంత గొప్ప పురోగతి ఉన్నా రోగి స్వయంగా చెప్పేది వినడం అత్యవసరం. ఈ తరం ఆ రెండిటినీ కలిపి వైద్యం చేయాలి. ప్రతిరోజూ పని చేశాను. నేనెప్పుడూ డైరీ నోట్స్ రాయలేదు. కానీ గుర్తున్నవన్నీ ఈ పుస్తకంలో కచ్చితంగా రాశా. అంటూ ఆమె రాసుకొచ్చిన 'ద ఉమన్ హూ ర్యాన్ ఎయిమ్స్' బుక్‌లో వ్యక్తిగతం కన్నా ఓ వైద్యురాలి క్రమశిక్షణ. భారతీయ వైద్య రంగాన్ని అభివృద్ధి చేయాలన్న తపన.. వంటివే ఎక్కువగా కనిపిస్తాయి.

# దోమలు కుట్టకుండా..

**జోరున వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడో ఓ చోట కాసిని నీళ్లు నిలబడినా.. దోమలు మన ఇంటిని చుట్టుముట్టేస్తాయి. దాంతో జ్వరాల బారిన పడక తప్పడం లేదు. అలాగని మస్కిటో రెపెల్లెంట్, మస్కిటో మ్యాట్‌లు వాడితే వాటి రసాయనాల వల్ల మన ఆరోగ్యానికే చేటు. అలాకాకూడదంటే ఈ సహజ చిట్కాలు పాటించి చూడండి.**

- మూడు టేబుల్ స్పూన్ల ఎప్సమ్ సాల్ట్‌ని ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో వేసుకుని స్నానం చేయండి. దోమ కాటు నుంచి మీ శరీరాన్ని కాపాడుకోవచ్చు.
- కొందర్ని దోమలెక్కువగా కుడతాయి. మీరూ బాధితులే అయితే.. వేపనూనెకి రెండుచుక్కల కొబ్బరినూనె చేర్చి ఒంటికి రాసుకోండి. కనీసం ఎనిమిది గంటలపాటు దోమలు మీ దరిచేరవు.
- యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఎక్కువగా ఉండే వేప క్రిమికీటకాలనే కాదు దోమలనూ అరికడుతుంది. కాస్త కర్పూరం, వేప ఆకులు కలిపి నలిపి పొడి చేసి కిటికీలు, గుమ్మాల దగ్గరా పొగ వేయండి. ఆ వాసనకు పరారవుతాయి.
- సాయం సంధ్యవేళలో కాస్త సాంబ్రాణి తీసుకుని పొగ వేసి తలుపులు మూసేయండి. ఇది దోమల్నినఇంట్లోకి దూరనీయదు.
- కప్పు నీళ్లల్లో యూకలిప్టస్ ఆయిల్ రెండు చుక్కలు కలిపి ఇల్లంతా స్ప్రే చేస్తే సరి. ఆ ఘాటైన పరిమళం దెబ్బకి దోమలు పోతాయి.
- నాలుగు వెల్లుల్లిపాయలను దంచి దానికి కాస్త కర్పూరం, కొద్దిగా ఏదైనా నూనె చేర్చి.. వెలిగిస్తే సరి మీ సమస్య దూరమవుతుంది.
- బంతి ఆకుల్ని నలిపి కిటికీ దగ్గర పెట్టండి. లేదా బంతిపూల రేకల్ని నీళ్లల్లో వేసి మరిగించి ఆ నీటిని ఇల్లంతా చిలకరించండి



దోమల బెడద తప్పుతుంది.

# జరీ నిజమైనదేనా ?

**పట్టు దుస్తులంటే ప్రతి ఒక్కరకీ ఓ ఎమోషన్. ప్రత్యేక సందర్భాలకోసం కొన్ని వీటిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుచుకుంటాం.** అయితే, మెరిసేదంతా బంగారం కాదన్నట్లు. పట్టు పేరుతో అమ్మేదంతా స్వచ్ఛమైనదీ కాదు. అచ్చమైన జరీ అంచుల్ని తలపించేలా అనుకరణ రకాలెన్నో మార్కెట్‌ని ముంచెత్తుతున్నాయి. అయితే అసలైన జరీ, సింథటిక్ మెరుపుల మధ్య



తేడాను అర్థం చేసుకోగలగాలి. ప్యూర్ జరీని రాగితో ఎలక్ట్రోప్లేట్ చేసిన పట్టు దారాలను ఉపయోగించి చేస్తారు. ఆపై వెండితో చుట్టి బంగారు పూతతో పూర్తి చేస్తారు. అయితే, దీనికి విరుద్ధంగా టెస్టెడ్ జరీ అనుకరణలు, కొౕకైన లోహాల చుట్టూ ప్లాస్టిక్, ల్యూరెక్స్ వంటివి ఉపయోగించి చేస్తారు. దూరం నుంచి చూస్తే ఆ మెరుపు మనల్ని మాయ చేయొచ్చు. కానీ, ఇవి ఎక్కువ కాలం మన్నవు. ఇక ప్యూర్ జరీ సాఫ్ట్‌గా, వార్మ్‌గ్లోతో ఉంటుంది. కానీ, సింథటిక్ జరీ ఎక్కువ మెరుపుతో, మెటాలిక్‌లుక్‌తో మెరిసిపోతుంది. కృత్రిమ రకాలతో పోల్చితే స్వచ్ఛమైన జరీ బరువుగా ఉంటుంది. పైగా ఇది గట్టిగా నేసి ఉంటుంది. ఫ్యాబ్రిక్ వెనుకభాగం వదులుగా గజిబిజిగా ఉంటే అది స్వచ్ఛమైనది కాదు. వెనుక దారాలు లేకుండా చక్కగా ఉండాలి. వీటిని టెస్టు చేయడానికి ప్రసిద్ధ బ్రాండ్‌లు ప్రత్యేక యంత్రాలనూ ఉపయోగిస్తున్నాయి చెక్ చేసుకోవచ్చు.

# నూడుల్స్ మసాలా పౌడర్



**ఇన్‌స్టంట్‌గా అప్పటికప్పుడు చేసుకునే వాటిల్లో నూడుల్స్ ఒకటి. ఇది చాలా రుచిగా ఉంది, మనందరికీ నచ్చుతుందంటే.. అందులో వేసే పొడి వల్లే కదా! ఆ పౌడర్‌ను ఇంట్లోనే చేసుకోవచ్చు.**



ఎలాగంటారా? ముందుగా ధనియాల పొడి 4 చెంచాలు, పంచదార పొడి, సోంపు, ఆనియన్ పౌడర్, ఆమ్‌చూర్ పౌడర్, మొక్కజొన్న పిండి, జీలకర్ర పొడి, కారం, గరంమసాలా, డ్రైజింజర్ పౌడర్, గార్లిక్ పౌండర్, మిరియాల పొడి..ఇవన్నీ అర చెంచా చొప్పున, పసుపు పావు చెంచా, రుచికి సరిపోయేంత ఉప్పు సిద్ధంగా ఉంచుకోవాలి. ఇక చేయడం ఎలాగంటే ఒక పాత్రలో ధనియాల పొడి, జీలకర్ర పొడి, కారం, గరంమసాలా, పసుపు వేసి కలపాలి. అందులో.. డ్రై.జింజర్ పౌడర్, గార్లిక్ పౌడర్, ఆనియన్ పౌడర్, ఆమ్‌చూర్ పౌడర్, మిరియాల పొడి, పంచదార పొడి, ఉప్పు, మొక్కజొన్న పిండి వేసి మళ్లీ కలపాలి. అన్నీ బాగా కలిశాయనుకున్నాక. తడి లేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేయాలి. ఈ కొలతల ప్రకారం మరింత కూడా చేసుకోవచ్చు. కానీ మరీ ఎక్కువ పరిమాణంలో చేసి నిలవుంచితే రుచి తగ్గుతుంది. అందువల్ల మితంగా కలపడమే మంచిది.

# నలభై దాటాక పొట్ట పెరుగుతోందా ?



**అప్పటిదాకా నాజూగ్గా, సన్నజాజి తీగలా ఉన్న నడుము కొలతలు పిల్లలు పుట్టాక, వయసు పెరుగుతున్న కొద్దీ మారుపోతుంటాయి. పొట్ట పెరగడం, నడుం చుట్టూ కొవ్వు పేరుకుపోవడంతో అక్కడి చర్మం వేలాడినట్లుగా కనిపిస్తుంటుంది. ఇక మెనోపాజ్ తర్వాత చాలామంది మహిళల్లో ఈ మార్పు కనిపించడం చూస్తుంటాం. దీన్ని మహిళలు జీర్ణించుకోలేరు. తిరిగి పూర్వ స్థితికి రావడానికి ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషిస్తుంటారు. అయితే అందం విషయం కాసేపు పక్కన పెడితే.. ఇలా పెరిగే పొట్ట ఇతర అనారోగ్యాలకూ దారి తీస్తుందంటున్నారు నిపుణులు. అందుకే నలభై దాటాక/మెనోపాజ్ దశలో చక్కటి పోషకాహారం తీసుకోవడం వల్ల పెరిగే పొట్టను తగ్గించు కోవచ్చంటున్నారు. అదెలాగో తెలుసుకుందాం..**

**హార్మోన్ల ప్రభావమే ...** హార్మోన్ల ప్రభావం కారణంగా మన శరీరంలో వివిధ మార్పులు చోటుచేసుకుంటాయి. మెనోపాజ్ దశలో పొట్ట పెరగడానికి ఇవే కారణమంటున్నారు నిపుణులు. ఈ దశలో ఈస్ట్రొజెన్ వంటి హార్మోన్లు తక్కువగా ఉత్పత్తవడం వల్లన వాటి స్థాయుల్లో సమతుల్యత లోపిస్తుంది. ఇది పొట్ట చుట్టూ, పొత్తి కడుపు దగ్గర కొవ్వులు పేరుకుపోయేందుకు ప్రేరేపిస్తుంది. కొంతమందిలో శరీర బరువు పెరగకపోయినా ఇలా పొట్ట పెరిగేసరికి అసౌకర్యానికి గురవుతుంటారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. క్రమంగా బరువు పెరిగి శ్వాస సంబంధిత సమస్యలు, గుండె సమస్యలు, టైప్-2 మధుమేహం. వంటి దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అందుకే ముందే జాగ్రత్త పడి. కొన్ని ఆహార పదార్థాల్ని మెనూలో చేర్చుకోవడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు.

**ఈ ఆహారంతో...**

- అవిసె గింజలు ఆరోగ్యానికే కాదు.. అధిక బరువు తగ్గించడానికీ దోహదం చేస్తాయి. వీటిలో ఉండే మోనోఅన్‌శ్చాచురేటెడ్ కొవ్వులే ఇందుకు కారణం. ఇవి శరీరంలో అధిక నీరు చేరకుండా చేయడంతోపాటు ఈస్ట్రొజెన్ స్థాయుల్నీ క్రమబద్ధీకరిస్తాయి.
- మన శరీరంలో విడుదలయ్యే కార్టిసాల్ హార్మోన్ ఒత్తిడికి కారణమవుతుంది. ఇదీ పొట్టభాగంలో కొవ్వు పేరుకుపోయేందుకు కారణమవుతుంది. కాబట్టి ఈ హార్మోన్ స్థాయుల్ని తగ్గించడంలో దాల్చిన చెక్క సమర్థంగా పని చేస్తుంది.
- సబ్జా గింజల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది పేగు కదలికల్ని ప్రేరేపించి వివిధ జీర్ణ సంబంధిత సమస్యల్ని దూరం చేస్తుంది. అంతేకాదు.. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు కరుగుతుందని పలు అధ్యయనాలు కూడా రుజువు చేశాయి.
- చెడు కొవ్వుల్ని కరిగించడంలో యాపిల్ సైడర్ వెనిగర్ సమర్థంగా పనిచేస్తుంది. పైగా ఇందులో క్యాలరీలు కూడా తక్కువే! కాబట్టి పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వునుకరిగించాలంటే ఇది చక్కటి ప్రత్యామ్నాయం అంటున్నారు నిపుణులు. ఈ ఫలితం పొందాలంటే. గ్లాసు నీటిలో టేబుల్‌స్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ వేసుకొని పరగడుపున తీసుకోవాలి.
- పప్పులు, కాయధాన్యాల్లో ఫోలికామ్లం, మెగ్నీషియం, పొటాసియం, విటమిన్ 'బి', ఫైబర్, ప్రొటీన్..వంటి పోషకాలుంటయి. ఇవి పొట్ట చుట్టూ పేరుకున్న కొవ్వుల్ని కరిగించడానికి దోహదం చేస్తాయి.
- ఆకుకూరల్లో మెగ్నీషియం పుష్కలంగా లభిస్తుంది. ఇది ఒత్తిడి, ఆందోళన, యాంగ్జైటీ వంటి మానసిక సమస్యల్ని తగ్గించడంలో దోహదపడుతుంది. అంటే పరోక్షంగా శరీరంలో పేరుకున్న చెడు కొవ్వులు, పొట్టనూ తగ్గిస్తుందన్నమాట.
- మెనోపాజ్ దశలో తలెత్తే దుష్ప్రభావాలే మహిళల్లో వివిధ మానసిక సమస్యలకు కారణమవుతుంటాయి. వీటిని దూరం చేసుకోవాలంటే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉండే చేపలు, సీ-ఫుడ్, వాల్‌నట్స్‌ని డైట్‌లో చేర్చుకోవాలని చెబుతోంది ఓ అధ్యయనం ! ఇక వీటితో పాటు బరువులెత్తడం, నడక, పరుగు, ఈత, సైక్లింగ్..వంటి వ్యాయామాలు కూడా నలభై దాటిక పొట్టను తగ్గించడంలో సహకరిస్తాయంటూన్నరు నిపుణులు. అయితే ఈ నియమాలు పాటిస్తున్నా ఫలితం లేకపోతే, ఇతర సమస్యలేవైనా ఎదురైతే..ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించడం ఉత్తమం అంటున్నారు.

# పవిత్రమైన రోజు

హిందూ ధార్మిక పంచాంగంలో అత్యంత పవిత్రమైన ఏకాదశులలో శయన ఏకాదశి (ఆషాఢ శుక్ల ఏకాదశి) విశిష్ట స్థానం కలిగి ఉంది. ఈ ఏకాదశికి ఇతర పేర్లు కూడా ఉన్నాయి పద్మ ఏకాదశి, దేవశయనీ ఏకాదశి, హరి శయన ఏకాదశి, ఆషాఢ ఏకాదశి. ఈ రోజు నుండి శ్రీ మహా విష్ణువు నాలుగు నెలలు యోగ నిద్రలోకి ప్రవేశి స్తాడన్న విశ్వాసం ఉంది. ఈ కాలాన్ని చాతుర్మాస్యం అని పిలుస్తారు. చాతుర్మాస్యం అంటే నాలుగు నెలల ఆధ్యాత్మిక నియమాల కాలం. ఇది శయన ఏకాదశి నుంచి ప్రారంభమై ప్రబోధినీ ఏకాదశి వరకు సాగుతుంది. ఈ సమయంలో సాధువులు ఏకస్థాన వాసంలో ఉంటూ ధ్యానం, జపం, వేదపఠనం, ఉపవాసం, మౌనవ్రతం వంటి కఠిన నియమాలను పాటిస్తారు. మాంసాహారం, ఉల్లిపాయ వంటివి వర్జించటం, రాత్రి భోజనం మానటం వంటి నియమాలు ఈ కాలంలో అనుసరిస్తారు. ప్రజలకు ధర్మబోధ చేస్తూ సత్సంగాలను నిర్వహిస్తారు. ఇది ఇంద్రియ నిగ్రహానికి, మానసిక స్థిరత్వానికి, భక్తిలో లోతుకు మార్గం. కార్తీక మాసంలో దీపారాధన, పుణ్యస్నానాలతో చాతుర్మాస్యం ముగుస్తుంది. ఈ దినం నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు భగవంతుడు శేషతలపై క్షీరసాగరంలో నిద్రిస్తాడు. భక్తులు ఉపవాసంతో, జాగరణతో, శ్రీహరి సేవలో నిమగ్నమవుతారు. శాస్త్రప్రకారం ఈ రోజు ఉపవాసం, దానధర్మాలు, భగవన్నామ స్మరణలు చేయడం వల్ల పాపక్షయమవుతుంది, పుణ్యఫలాలు లభిస్తాయి. పురాణాల ప్రకారం, దేవతలు ఈ నాలుగు నెలలపాటు దేవుడి నిద్రను గౌరవిస్తూ, అతని సేవలో ఉండాలని భక్తులకు ఉపదేశించారు. గృహస్థులు ఈ చాతుర్మాస్యంలో కొన్ని నియమాలను పాటిస్తూ, భక్తి మార్గాన్ని అనుసరించడం సంప్రదాయం. శయన ఏకాదశి నాటి ఉపవాసం వల్ల శరీర శుద్ధి, మనస్సు స్థిరత, ఆధ్యాత్మిక చైతన్యం ఏర్పడుతాయి. ఇది శ్రద్ధతో జరిపిన ఒకే ఒక్క ఏకాదశి అయినా, ఎన్నో ఏకాదశులకు సమానంగా ఫలితాన్నిస్తుంది అని స్కంద పురాణంలో చెప్పబడింది. శయన ఏకాదశి భగవంతుడి నిద్రలో మన భక్తిని సమర్పించుకునే పవిత్ర దినం. విశ్రాంతిలోని ఆధ్యాత్మిక జాగృతి - జీవన మార్గాన్ని ధర్మసంపన్నంగా మలచుకునే ప్రవేశ ద్వారం.

**- సి. హెచ్. ప్రతాప్**

ఆధ్యాత్మికం

# పిల్లలకు నత్తి ఎందుకు వస్తుంది..



ప్రపంచంలోని **ఆరుశాతం** పిల్లలూ, ఒక్క శాతం పెద్దల్లోనూ నత్తి ఉంటుందట. మాట్లాడేటప్పుడు మెదడు అనవసరమైన మాతృతకి గురికావడమే ఇందుకు కారణమని వైద్యులు ఎప్పటి నుంచో చెబుతూ వస్తున్నారు. అయినా మెదడులో ఏ భాగంలో ఈ సమస్య ఏర్పడుతుందో పసిగట్టలేకపోయారు.

తాజాగా ఆ భాగమేదో కనిపెట్టారు ఫిన్‌లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ తుర్కు శాస్త్రవేత్తలు. మన మెదడులో ఆవేశాలని అదుపు చేసేందుకు 'అమిగ్దలా' అని, కదలికల్ని నియంత్రించేందుకు 'పుటేమన్' అనీ, మనకొచ్చే భిన్న సాచారాల్ని విశ్లేషించేందుకు 'క్లాస్ట్రమ్' అనీ మూడు విభాగాలుంటాయి. ఆ మూడింటినీ కలిపే న్యూరాన్‌ల విథభాగం కూడా ఒకటుందట. ఆ భాగంలోని మెదడు కణాల్లో ఏర్పడే చిన్నపాటి అంతరాయమే నత్తికి కారణమని తాజాగా కనిపెట్టారు శాస్త్రవేత్తలు. వేలాది బ్రెయిన్ స్కానర్‌లని 'ఏఐ'తో విశ్వేలషించడం ద్వారా దీన్ని సాధించారట. ఈ భాగాన్ని గుర్తించడం వల్ల అక్కడ చిన్నపాటి విద్యుత్తు ప్రేరణలు (స్టిమ్యులేషన్) ఇవ్వడం ద్వారా నత్తి సమస్యని అధిగమించొచ్చని చెబుతున్నారు. ఆ దిశగా చికిత్సా విధానాలనీ రూపొందిస్తున్నారు.










# టెస్ట్ క్రికెట్‌లో.. జెట్ స్పీడ్ హీరోలు

## డబుల్ సెంచరీలతో మెరిసిన బ్యాటర్స్

### త్రిబుల్ సెంచరీలతో సెహ్వాగ్

**న్యూఢిల్లీ:** టెస్ట్ క్రికెట్‌లో డబుల్ సెంచరీ కొట్టడం అనేది ఏ బ్యాట్స్‌మన్‌కైనా ఒక గొప్ప లక్షణం. అది కూడా అత్యంత వేగవంతంగా డబుల్ సెంచరీ చేయడం ప్లేయర్ల సత్తాపై ఆధారపడి ఉంటుంది. భారీ స్కోర్లు చేయడంలో, స్వేచ్ఛగా డబుల్ సెంచరీలు చేయడంలో నైపుణ్యం కలిగిన బ్యాటర్లు పలువురు ఉన్నారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న వ్యక్తి న్యూజిలాండ్‌కు చెందిన నాథన్ ఆస్టల్. 2002లో 153 బంతుల్లో డబుల్ సెంచరీ చేశాడు. క్రైస్ట్‌చర్చ్ మైదానంలో వెలుగులోకి వచ్చిన అతని వీరోచిత ప్రదర్శనలు, ఆ పోటీలో ఆధిపత్యం చెలాయింప చేసింది. అలాగే ఇంగ్లీష్ శిబిరంలో బ్యాటింగ్‌లో దిట్ట అయిన బెన్ స్టోక్స్ మీడియం పేస్ బౌలర్‌గా కూడా పేరుగాంచాడు. టెస్ట్ మ్యాచ్లో ఇప్పటివరకు నమోదైన రెండవ వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. స్టోక్స్ తన డబుల్ సెంచరీని చేరుకోవడానికి తీసుకున్న 163 బంతుల్లోనే ఈ సెంచరీ వచ్చింది. బెన్ స్టోక్స్ 198 బంతుల్లో 258 పరుగులు చేసి ఆధిపత్యం చెలాయించాడు. అతను 30 ఫోర్లు బాదాడు, 11 సిక్సర్లు బాదాడు. టెస్ట్ క్రికెట్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీలు సాధించిన వారి జాబితాలో భారత్‌కు చెందిన వీరేంద్ర సెహ్వాగ్ ఒకరుగా ఉన్నాడు. సెహ్వాగ్ టెస్ట్ క్రికెట్‌లో ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా మూడు డబుల్ సెంచరీలు సాధించాడు. శ్రీలంకపై 168 బంతుల్లో డబుల్ సెంచరీ చేసిన అతను, ఆ తర్వాత లాహోర్లో పాకిస్థాన్‌పై 182 బంతుల్లో డబుల్ సెంచరీ చేశాడు. ఆ సందర్భంలో అతను మొత్తం 254 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. చివరకు కుడిచేతి వాటం బౌలర్ 2008లో దక్షిణాఫ్రికాపై 194 బంతుల్లో డబుల్ సెంచరీ చేశాడు. ఇక క్రికెట్ బంతిని నిజంగా స్మాష్ చేసే వ్యక్తి బ్రెండన్ మెకల్లమ్ ఒక లెజెండ్ అయ్యాడు. మెకల్లమ్ కేవలం 186 బంతుల్లోనే తన టెస్టు డబుల్ మైలు రాయిని చేరుకున్నాడు. అంతేకాకుండా ఈ మ్యాచ్‌లో 11 సిక్సర్లు సైతం కొట్టి అద్భుత ప్రదర్శన చేశాడు. కాగా యూనివర్స్ బాస్ క్రిస్టోఫర్ హెన్రీ గేల్ తన బ్యాటింగ్‌లో బిగ్ సిక్స్ కొట్టడం ద్వారా స్కోరును పరుగు పెట్టించాడు. ఈ ఎడమ చేతి వాటం బౌలర్స్ టెస్టు మ్యాచ్‌లో 98 సిక్సర్లు కొట్టాడు. తన కెరీర్‌లో పదో వంతు సిక్సర్లు కొట్టడానికి ఒకే ఇన్నింగ్స్ పట్టింది. ఆ సమయంలో శ్రీలంకపై క్రిస్ గేల్ 333 ట్రిపుల్ సెంచరీలు సాధించాడు. ఆ ఇన్నింగ్స్‌లో గిల్ కేవలం 221 బంతుల్లోనే తన ట్రిబుల్ సెంచరీ పూర్తి చేశాడు.

# టీమిండియా భారీ స్కోరు

## ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో 564 పరుగులతో పటిష్ట స్థితి

### 265 రన్స్‌తో గిల్ డబుల్, అర్ధ సెంచరీ

**న్యూఢిల్లీ:** బర్మింగ్‌హామ్ లో ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు భారీ స్కోరు సాధించింది. గురువారం రాత్రి 8.30 గంటలకు టీ సమయానికి భారత్ 7 వికెట్లు కోల్పోయి 564 పరుగులతో కొనసాగుతోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుతమైన డబుల్ సెంచరీ, అర్ధ సెంచరీతో చెలరేగడంతో టీమిండియా పటిష్ఠ స్థితిలో నిలిచింది. యువ ఆటగాడు గిల్ కు కెరీర్ లో ఇదే తొలి డబుల్ సెంచరీ. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రెండో రోజు ఆట లంచ్ అనంతర సెషన్ లో భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా, భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా కెప్టెన్ శుభ్‌మన్




గిల్ ముందుండి జట్టును నడిపించాడు. ఓపికగా ఆడుతూ ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న గిల్, 380 బంతుల్లో 30 ఫోర్లు, 3 సిక్సర్లతో 265 పరుగులు చేసి అజేయంగా క్రీజులో ఉన్నాడు. అతనికి రవీంద్ర జడేజా (89), యశస్వి జైస్వాల్ (87), వాషింగ్టన్ సుందర్ (42) చక్కటి సహకారం అందించారు. ఆరంభంలో కేఎల్ రాహుల్ (2) వికెట్‌ను త్వరగానే కోల్పోయినా, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడారు. జైస్వాల్, జడేజా ఔటైన తర్వాత, గిల్, వాషింగ్టన్ సుందర్ (42)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపిస్తున్నాడు. కానీ ఇదే సమయంలో జో రూట్ చేతిలో ఔటయ్యాడు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ రెండు వికెట్లు పడగొట్టగా, బెన్ స్టోక్స్, షోయబ్ బషీర్, జోష్ టంగ్, బ్రైడన్ కార్స్, జో రూట్ తలో వికెట్ తీశారు. భారీ స్కోరు సాధించిన టీమిండియా ఈ మ్యాచ్‌పై పట్టు బిగించింది.



## వరల్డ్ మహిళా బాక్సింగ్ కప్ సెమీస్‌కు

# భారత్ బాక్సర్లు

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కప్-2025లో భారత్ బాక్సర్లు బలమైన ఆరంభాన్ని ప్రదర్శించారు. కజకిస్తాన్‌లోని అస్తానాలోని బీలైన్ అరీనాలో పూజా రాణి,సంజు,మీనాక్షి తమతమ విభాగాల సెమీఫైనల్‌కు చేరుకోవడంతో ప్రపంచ బాక్సింగ్ కప్ సర్క్యూట్‌లో భారత్ బాక్సర్లు అద్భుతమైన అరంగేట్రం చేసి ఆకట్టుకున్నారు. మహిళల 48 కిలోల క్వార్టర్ ఫైనల్‌తో తొలి రోజు ప్రారంభమైంది. ఇక్కడ మినాక్షి చైనీస్ తైపీకి చెందిన యిజువాన్ గువోపై 5-0 తేడాతో ఆధిపత్య విజయం సాధించి బలమైన ప్రదర్శన ఇచ్చింది, తద్వారా ఈ ఈవెంట్‌లో ఆమెకు పతకం ఖాయమైంది. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బాక్సర్ మడేలిన్ బోవెన్‌పై విజయం సాధించిన మినాక్షి కిది ప్రాథమిక రౌండ్ తర్వాత టోర్నమెంట్‌లో ఇది రెండవ బౌట్. ఆమె తర్వాత, అనుభవజ్ఞురాలైన రెండుసార్లు ఆసియా ఛాంపియన్ పూజా రాణి కూడా మహిళల 80 కిలోల విభాగంలో కజకిస్తాన్‌కు చెందిన గుల్సయా యెర్జాన్‌పై స్ప్లిట్ డెసిషన్ 4-1 విజయంతో ఆమెకు పతకాన్ని నిర్ధారించింది. సాయంత్రం సెషన్‌లో, సంజు 60 కిలోల విభాగంలో అమెరికన్ బాక్సర్ జజైరా గొంజాలెజ్‌పై 5-0 తేడాతో విజయం సాధించి ఫైనల్ ఫోర్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకుంది. ఇక పురుషుల విభాగంలో బ్రెజిల్ ప్రపంచ కప్ కాంస్య పతక విజేత లైట్ వెయిట్ బాక్సర్ జదుమణి సింగ్ (50 కిలోలు) 2-3 తేడాతో ఫిలిప్పీన్స్ బాక్సర్ జే బ్రయాన్ బారికువాట్రో చేతిలో క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించాడు. మరోవైపు, మనీష్ రాథోడ్ (పురుషులు 50 కిలోలు), సనమ్చా చాను (మహిళలు 70 కిలోలు) ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో పోటీ నుండి నిష్క్రమించగా, ముస్కాన్ (75 కిలోలు) తన క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో ఓడిపోయారు.

## వింబుల్డన్‌లో భారత్ లెజెండ్

# బోపన్న నిష్క్రమణ

### ముందంజలో శ్రీరామ్

**న్యూఢిల్లీ:** వింబుల్డన్‌లో రోహన్ బోపన్న అనూహ్యంగా ఓటమిపాలవ్వగా, శ్రీరామ్ బాలాజీ ముందంజలో ఉన్నాడు. వింబుల్డన్-2025 ప్రారంభ రౌండ్‌లో పురుషుల డబుల్స్ పోటీ నుండి భారత లెజెండరీ ఆటగాడు రోహన్ బోపన్న మరియు అతని భాగస్వామి సాండర్ గిల్లె నిష్క్రమించారు. అనుభవజ్ఞుడైన బోపన్న అలవోకగా గెలుస్తాడనుకుంటే తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. ఈ జోడీ ఒక గంటా నాలుగు నిమిషాల్లో మూడో సీడ్ జర్మన్ జంట కెవిన్ క్రావిట్జ్ మరియు టిమ్ పుయెట్జ్ చేతిలో 3-6, 4-6 తేడాతో పరాజయం పాలయ్యాడు. అయితే పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ ముందంజ వేశాడు. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో శ్రీరామ్ మిగెల్ రెయ్స్(మెక్సికో) ద్వయం అమెరికా జంటను చిత్తు చేసింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన పోరులో లెర్నర్ థియెన్, అలెగ్జాండర్ కొవసెవిక్ ద్వయంపై 64, 64తో జయకేతనం ఎగురవేసింది. దాంతో, ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రెండో రౌండ్‌కు దూసుకెళ్లిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు శ్రీరామ్. లండన్ వేదికగా జరుగుతున్న వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో యుకీ బాంబ్రీ, రిత్విక్ బొల్లిపల్లి దూసుకెళ్లారు. ఇప్పుడు శ్రీరామ్ కూడా తొలి రౌండ్ దాటాడు. రెండో రౌండ్‌లో శ్రీరామ్ ద్వయం నాలుగో సీడ్‌తో తలపడనుంది. భారత డబుల్స్ స్టార్ యుకీ భాంబ్రీ మరియు అతని అమెరికన్ భాగస్వామి రాబర్ట్ గాల్లోవే, ఫ్రాన్స్‌కు చెందిన మాన్యుయెల్ గినార్డ్ మరియు మొనాకోకు చెందిన రొమైన్ ఆర్నియోడోలను వరుస సెట్లలో ఓడించి వింబుల్డన్ పురుషుల డబుల్స్ పోటీలో రెండవ రౌండ్‌కు చేరుకున్నారు. గంటా 49 నిమిషాల పాటు జరిగిన మొదటి రౌండ్ పోరులో, 16వ సీడ్ ఇండోఅమెరికన్ ద్వయం ఆర్నియోడో మరియు గినార్డ్‌ను 7-6(8), 6-4 తేడాతో ఓడించింది. గ్రాండ్‌స్లామ్‌కు సిద్ధమయ్యే క్రమంలో, మల్లోర్కా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత వారు తమ ప్రదర్శనను మరింత పెంచుకున్నారు.




## కెనడా ఓపెన్ ఉత్కంఠ పోరులో

# శ్రీకాంత్ విజయం

### మహిళల సింగిల్స్‌లో శ్రీయాన్షి గెలుపు

**న్యూఢిల్లీ:** కెనడా ఓపెన్-2025లో ప్రియాంషు రజావత్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో భారత్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ విజయం సాధించాడు. అలాగే మహిళల సింగిల్స్ విభాగంలో భారత్ యువ క్రీడాకారిణి వలిశెట్టి శ్రీయాన్షి గెలుపొందింది. కెనడా ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ తన స్వదేశీయుడు ప్రియాంషు రాజవత్‌పై మూడు గేమ్‌ల ఉత్కంఠభరితమైన విజయంతో పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. 2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల రజత పతక విజేత, మేలో జరిగిన మలేషియా మాస్టర్స్‌లో రన్నరప్‌గా నిలిచిన శ్రీకాంత్, 53 నిమిషాల పాటు జరిగిన ఉత్కంఠభరితమైన ప్రారంభ రౌండ్ పోరులో 18-21, 21-19, 21-14 తేడాతో విజయం సాధించాడు. ఇంతకు ముందు రెండుసార్లు తలపడిన ఈ ఇద్దరు అకాడమీ సహచరుల మధ్య ఇది తీవ్రమైన పోరాటం. రాజవత్ రెండు సందర్భాలలోనూ విజయం సాధించాడు. అలాగే ఇద్దరు భారతీయ పురుషులు తలపడిన మరో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో శంకర్ సుబ్రమణియన్ తొలి రౌండ్‌లో ఆయుష్ శెట్టిని ఓడించాడు. 23-21, 21-12 తేడాతో అద్భుతమైన విజయాన్ని సాధించాడు. మొదటి గేమ్ హోరాహోరీగా సాగింది, చివరికి సుబ్రమణియన్ 23-21తో ఆధిక్యంలో నిలిచాడు. ఇక మహిళల సింగిల్స్‌లో, యువ క్రీడాకారిణి వలిశెట్టి శ్రీయాన్షి 21-18, 22-20 తేడాతో ఉక్రెయిన్‌కు చెందిన ఏడో సీడ్ పోలినా భూరోవాను ఓడించింది. ఇరా శర్మ మరియు తాన్య హేమంత్ తమప్రారంభ రౌండ్ ప్రత్యర్థులను అధిగమించడంలో విఫలమవడంతో, మహిళల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16 డ్రాలో ఉన్న ఏకైక భారతీయురాలుగా శ్రీయాన్షి నిలిచింది. మరోవైపు, టాప్ సీడ్ మిక్స్‌డ్ డబుల్స్ ద్వయం తనీషా క్రాస్టో మరియు ధ్రువ్ కపిల వరుసగా రెండో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించారు, స్పానిష్ జంట చేతిలో 15-21, 19ı21 తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయారు.

# హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సిఇఓపై క్రిమినల్ కేసు

**ముంబై, జులై 3:** ముంబైలోని లీలావతి ఆసుపత్రి ట్రస్టీలు తనపై ఎఫ్‌ఐఆర్ దాఖలు చేయడంతో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సిఇఓ శశిధర్ జగదీషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రిమినల్ కేసులో బలమైన ఆధారాలేవీ లేవని, పెండింగ్ చెల్లింపులపై ఒత్తిడి తప్పా మరేమీ కాదని జగదీషన్ తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. జగదీషన్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తూ ఆసుపత్రి ట్రస్టీలు నమోదు చేయించిన ఎఫ్‌ఐఆర్‌కు బలమైన ఆధారాలు లేవని, ఆసుపత్రి నుంచి డబ్బు రికవరీ చేయడానికి బ్యాంకు ప్రయత్నిస్తున్నందునే ఎఫ్‌ఐఆర్ దాఖలు చేశారని వాదించారు. ఈ కేసును బాండే హైకోర్టులోని మూడు వేర్వేరు బెంచ్‌లు పలుమార్లు ప్రయత్నాలు చేసినప్పటికీ విచారించలేకపోయాయని ఆయన అన్నారు. కొద్దిసేపు వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ కేసును శుక్రవారంకు వాయిదా వేశారు. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్




బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌డిఎఫ్‌సి చీఫ్‌పై ఇలా ఎఫ్‌ఐఆర్ నమోదు కావడానికి గల కచ్చితమైన కారణాలను ఇరువర్గాలు పంచుకోలేదు. అయితే కొన్ని సంస్థలు తెలిపిన వివరాలు కింది విధంగా ఉన్నాయి. ట్రస్ట్ పాలపై అనవసర నియంత్రణ కోసం జగదీషన్ మాజీ ట్రస్టీ చేత్ మెహతా నుంచి అనధికారికంగా రూ.2.05కోట్లు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. హెచ్‌డిహెచ్‌సి బ్యాంకు సిఇఓగా ఆయన స్వచ్ఛంద సంస్థ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునానరని ట్రస్ట్ పేర్కొంది. లీలావతి ఆసుపత్రిలో జగదీషన్, తన కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యంఅందించారని తెలిపింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో ట్రస్ట్ డిపాజిట్ల కింద రూ.48కోట్లు ఉన్నాయని చెప్పింది.

# అమల్లోకి వస్తున్న ఇండియా-అమెరికా మినీ ట్రేడ్ డీల్

**వాషింగ్టన్, జులై 3:** భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జోరుగా జరుగుతున్నాయి. ఈ తరుణంలో రెండు దేశాల మధ్య మినీ ట్రేడ్ డీల్ (మధ్యంతర వాణిజ్య ఒప్పందం) కుదరనున్నట్లు తెలుస్తోంది. 48 గంటల్లో అది ఖరారు కావొచ్చని, ఆ దిశగా వాషింగ్టన్‌లో చర్చలు జరుగుతున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, ఆటోమొబైల్, ఇండస్ట్రియల్ గూడ్స్, లేబర్ ఇంటెన్సివ్ ప్రొడక్ట్‌ల పైనే దృష్టిపెట్టారు. ముఖ్యంగా వ్యవసాయం, డెయిరీ రంగాల విషయంలో ఇరుదేశాల మధ్య చిక్కుముడులు నెలకొన్నాయి. భారత్ పాల ఉత్పత్తుల మార్కెట్‌ను విదేశీ సంస్థల కోసం తెరిచేందుకు సిద్ధంగా లేదు. మరోవైపు అమెరికా కొన్నిరకాల ఇండస్ట్రియల్ గూడ్స్‌కు, ఆటోమొబైల్ రంగంలో రాయితీలు కోరుతోంది. విద్యుత్తు కార్లు, వైన్స్, పెట్రోకెమికల్స్, డెయిరీ, యాపిల్, నట్స్, జన్యుపరమైన మార్పులు చేసిన పంటల విషయంలో లబ్ధి కోసం పట్టుబడు



తోంది. ఇక, భారత్ నుంచి చేసుకొనే దిగుమతులపై ట్రంప్ యంత్రాంగం విధించిన 26 శాతం టారిఫ్‌లు జులై 9 వరకు అమల్లోకి రావు. ఇక బేస్‌లైన్ టారిఫ్ 10శాతం మాత్రం వర్తిస్తోంది. ఈ చర్చల సందర్భంగా భారత్ 26శాతం పన్నుపై రాయితీ కోరుతోంది. మరోవైపు.. వాణిజ్య ఒప్పందంపై కీలక ప్రకటన జులై 8 కంటే ముందే వెలువడవచ్చని నిన్న వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ చర్చలకు నాయకత్వం వహిస్తున్న వాణిజ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వాషింగ్టన్‌లో ఉండి తుదివిడత సంప్రదింపులు మొదలుపెట్టారు. ఇప్పటికే ట్రంప్ విధించిన టారిఫ్‌ల సస్పెన్షన్ జులై 9వ తేదీ వరకు మాత్రమే అమల్లో ఉంటుంది. ఎందుకంటే ఈ డెడ్‌లైన్‌ను మరోసారి పొడిగించే ఉద్దేశం తనకు లేదని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. అతిత్వరలోనే టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మినీ ట్రేడ్ డీల్ జరగొచ్చని తెలుస్తోంది.


# పతంజలికి ఢిల్లీ హైకోర్టు వార్నింగ్

**న్యూఢిల్లీ, జులై 3:** డాబర్ చ్యవన్‌ప్రాశ్‌ను లక్ష్యంగా చేసుకొని పతంజలి ఆయుర్వేద్ జారీ చేసిన ప్రకటనలను వెంటనే నిలిపి వేయాలని ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జస్టిస్ మణి పుష్కర్ణ ఆదేశాలిచ్చారు. అంతకుముందు.. తమ ప్రముఖ ఉత్పత్తులను అవమానిస్తూ పతంజలి వాణిజ్య ప్రకటనలు జారీ చేస్తోందని డాబర్ సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి తాజాగా ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆయుర్వేద గ్రంథాల్లో చెప్పినట్లు కేవలం తాము మాత్రమే చ్యవన్‌ప్రాశ్‌ను తయారుచేస్తామని పతంజలి తమ ప్రకటనలో చెబుతోంది. ఇతర సంస్థలు సరైన పరిజ్ఞానంతో ఉత్పత్తులు చేయడం లేదని వెల్లడించింది. దీంతో డాబర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈవాణిజ్య ప్రకటనలను నిలిపి వేయడంతో పాటు.. తమపేరుకు భంగం కలిగించినందుకు రూ.2కోట్ల మేరకు నష్టపరిహారం ఇప్పించాలని కోరింది. తమ ఉత్పత్తే సరైందని పతంజలి వాణిజ్య ప్రకటనల్లో తప్పుగా క్లెయిమ్ చేస్తోందని ఆరోపించింది. ఈ అంశంపై న్యాయస్థానం జులై14న తదుపరి విచారణను చేపట్టనుంది. గతంలో కరోనా వైద్యం విషయంలో పతంజలి తప్పుడుప్రచారం చేసినప్పుడు సుప్రీంకోర్టు ఆసంస్థపైచర్యలు తీసుకొన్న విషయంతెలిసిందే. నాడు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆ సంస్థపై న్యాయ పోరాటం చేసింది.



# రూ.4250 కోట్లకు మీషో ఐపిఓ

**ముంబై, జులై 3:** ఇ-కామర్స్ కంపెనీ మీషో ఐపిఒకు వస్తోంది. సెబి వద్ద తన డిఆర్‌హెచ్‌పి దరఖాస్తులను అత్యంత గోప్యంగా దాఖలు చేసింది. సాఫ్ట్‌బ్యాంక్ అధీనంలోని ఈ సంస్థ 497.30 మిలియన్ డాలర్లు అంటే భారతీయ కరెన్సీలో 4250 కోట్ల విలువైన నిధులు సమీకరించేందుకు నిర్ణయించింది. ప్రస్తుత సంస్థలో ఉన్న ఇన్వెస్టర్లుకూడా తమ వాటాలను విక్రయించుకునే అవకాశం ఉంది. మీషో సెబి అనుమతులతో సెప్టెంబరు లేదా అక్టోబరులో మార్కెట్లకు రావచ్చని తేలింది. అమెరికా, భారత్‌లోని వాటాదారుల ఆమోదం తర్వాత లిస్టింగ్ కూడా పూర్తవుతుంది. మీషో తమ వాటాదారుల తాజా ఆమోదంకూడా పొందామని, మూలధన వనరుల సమీకరణకు ఐపిఒకు వస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. గతనెలలోనే నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) కంపెనీ కేంద్ర కార్యాలయాన్ని డెలావేర్‌నుంచి భారత్‌కు మార్చేందుకు అనుమతించింది. దీనితో మీషో ఇపుడు యుఎస్ సంస్థ నుంచి వేరుపడి భారత సంస్థగా కొనసాగుతుంది. అలాగే కార్పొరేట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు చెపుతోంది. భారత్‌లో తన ఉనికిని మరింత పటిష్టంచేసుకునే దిశగా ఈ ఐపిఒ వస్తోంది. కస్టమర్లు, విక్రేతలు, సృష్టికర్తలు, వాల్మో భాగస్వాములు ఇప్పటికే ఇక్కడ ఉన్నారు. ఈరీలొకేషన్ కారణంగా కంపెనీ 288 మిలియన్ డాలర్లుపన్నులరూపంలో చెల్లించాల్సి వస్తోంది. మీషోకు అనేకపెట్టుబడిసంస్థలున్నాయి. ప్రోసస్; ఎలివేషన్ క్యాపిటల్, వెస్ట్‌బ్రిడ్జి క్యాపిటల్; సాఫ్ట్‌బ్యాంకు, పీక్ 15 భాగస్వాములుగా ఉన్నారన్నది తెలిసిందే. 2024లో కంపెనీ నష్టాలు 53 కోట్లకు తగ్గాయి. రాబడులు కూడా 33 శాతంపెరిగి 7615 కోట్లకు చేరాయి. స్థూల వాణిజ్య విలువలు 2025లో 6.2 బిలియన్ డాలర్లకు చేరాయి. దీనితో మీషో ఇపుడు భారత్‌లోనే విలువలపరంగా మూడో అతిపెద్ద ఇ-కామర్స్ సంస్థగా నిలిచింది.




# చివరి క్షణంలో అమ్మకాల జోరు.. నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, జులై 3:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. భారత్ అమెరికా మధ్య మినీట్రేడ్ డీల్ మరికొన్ని గంటల్లో కుదరొచ్చన్న వార్తల నేపథ్యంలో లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. లాభాల స్వీకరణతో వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం 83,540.74 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,409.69) లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. మధ్యాహ్నం వరకు లాభాల్లోనే కొనసాగాయి. ఇంట్రాడేలో83,850.09 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీలు.. తర్వాత అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకున్నాయి. చివరికి 170.22 పాయింట్ల నష్టంతో 83,239.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 48.10 పాయింట్ల నష్టంతో 25,405.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.31గా ఉంది. కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్,ట్రెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్, ఎన్టీపీసీ, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.71 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,356 డాలర్ల వద్ద ట్రేడయింది.



# వాణిజ్యం

## భారత్ ఆర్థికవృద్ధి 6.7%

### సిఐఐ కొత్త అధ్యక్షుడు రాజీవ్‌మెమాని

**న్యూఢిల్లీ, జులై 3:** భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.4 నుంచి 6.7శాతం వరకూ నమోదుకావచ్చని భారత వాణిజ్య మండలి (సిఐఐ) ప్రకటించింది. భౌగోళిక ఉద్రిక్తతలు ఎదురవుతున్నా, ఇతర సమస్యలు సవాళ్లు ఉన్నప్పటికీ ఆర్థికవృద్ధి ఆగడం మాత్రం ఉండదని సిఐఐ అధ్యక్షుడు రాజీవ్‌మెమాని గురువారం వెల్లడించారు. సిఐఐ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి మీడియా సమావేశంలో ప్రసంగించిన మెమాని భారత్ ఆర్థికవృద్ధికి అన్ని సంకేతాలున్నాయన్నారు. మంచి రుతుపవనాలు, నగదు లభ్యంత అందుబాటులోకి రావడం,ఆర్బీఐ సిఆర్ఆర్ కోతలు, వడ్డీరేట్ల తగ్గింపులు వంటి దేశ ఆర్థికవృద్ధికి దోహదం చేస్తాయని ప్రకటించారు. గతనెలలోనే ఆర్బీఐ నగదునిల్వల నిష్పత్తిని 100 బేసిస్ పాయింట్లకు తగ్గించింది. దీనితో బ్యాంకింగ్ వ్యవస్థలోకి 2.5 లక్షల కోట్లు



అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా విభిన్న ఉత్పత్తిరంగాలకు రుణపరపతి సులువుగా అందే అవకాశం లభించింది. బెంచ్‌మార్క్ వడ్డీరేట్లు కూడా 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.5శాతానికి చేర్చింది. ఈ కారణాలవల్లనే సిఐఐ 6.4 నుంచి 6.7శాతం వరకూ భారత ఆర్థికవ్యవస్థ వృద్ధిచెందే అవకాశం ఉందని రాజీవ్‌మెమాని అన్నారు. బయటినుంచి వచ్చే సవాళ్లు ఎక్కువగానే ఉన్నాయని, అయినప్పటికీ కూడా దేశీయంగా ఆర్థిక పటిష్టతకు అన్ని వనరులున్నట్లు మెమానీ చెప్పారు. భౌగోళిక అనిశ్చితితో బయటిప్రాంత రిస్కులు ఉన్నప్పటికీ దేశీయంగా డిమాండ్ మరింతగా ఉండటంతో అనివార్యంగా వృద్ధి పెరుగుతుందన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.